రిపోర్టర్లు కావలెను

మనసర్కార్ దినపత్రిక, డిజిటల్ ఛానల్, వెబ్ సైట్ లకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని (294) అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వార్తలను సేకరించుటకు రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషపై పట్టు, వార్తలను వ్రాయగలిగే సామర్థ్యం, సంఘటనలను వీడియో తీసి పంపగల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ప్రతి నెలా జీతంతో పాటు, ప్రచురించిన ప్రతి వార్తకు, టెలీకాస్ట్ చేసిన ప్రతి వీడియోకు అదనపు పారితోషికం ఇవ్వబడును. పాత జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు గా పనిచేయుటకు కనీసం 5 సం.రాల అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.

మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు

మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540

Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073

Follow: manasarkar

email: jobs@manasarkar.com



సంక్షేమ

# మనసర్కార్

Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:88 | హైదరాబాద్ 30 అక్టోబర్ 2025, గురువారం | పేజీలు: 8, వెల: రూ. 5/-

Vol-01 ::: Issue-88 | Hyderabad 30 October 2025, Thursday | Pages: 8, Rs. 5/-

రిపోర్టర్లు కావలెను

మనసర్కార్ దినపత్రిక, డిజిటల్ ఛానల్, వెబ్ సైట్ లకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని (294) అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వార్తలను సేకరించుటకు రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషపై పట్టు, వార్తలను వ్రాయగలిగే సామర్థ్యం, సంఘటనలను వీడియో తీసి పంపగల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ప్రతి నెలా జీతంతో పాటు, ప్రచురించిన ప్రతి వార్తకు, టెలీకాస్ట్ చేసిన ప్రతి వీడియోకు అదనపు పారితోషికం ఇవ్వబడును. పాత జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు గా పనిచేయుటకు కనీసం 5 సం.రాల అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.

మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు

మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540

Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073

Follow: manasarkar

email: jobs@manasarkar.com





## ముస్లిం అమ్మాయిని ప్రేమించండి, పెళ్లి నేను చేస్తా...

### ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మాజీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

**ఉత్తరప్రదేశ్ (ఏడీఎన్ఎన్)**

ముస్లిం అమ్మాయిలను ప్రేమిస్తే హిందూ యువకులకు అండగా ఉండి, వాళ్లకు పెళ్లి చేస్తానని ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మాజీ ఎమ్మెల్యే రాఘవేంద్ర ప్రతాప్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ముస్లిం యువకులు వివాహం పేరుతో, ఉత్తరప్రదేశ్ కు చెందిన ఇద్దరు హిందూ యువతులను బలవంతంగా మతం మార్పించిన నేపథ్యంలో, ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. సిద్ధార్థ్ నగర్ జిల్లా దుమారియాగంజ్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే రాఘవేంద్ర ప్రతాప్ సింగ్, ఇటీవల ధంఖర్‌పూర్ గ్రామంలో పర్యటించారు. ...::: తరువాయి 2వ పేజీలో..

## క్యాష్ కొట్టు... కొలువు పట్టు... స్టాలిన్ పై ఈ'ఢీ'



ప్రభుత్వ ఉద్యోగాలకు రూ.888 కోట్ల లంచం | మంత్రి నెహ్రూ సోదరుడు రవిచంద్రన్ ప్రధాన పాత్రధారి

- తమిళనాడు పోలీసులకు 232 పేజీల ఈడీ రిపోర్టు
- సీబీఐ దర్యాప్తునకు డిమాండ్ ... ప్రభుత్వ నిరాకరణ

**చెన్నై (ఏడీఎన్ఎన్) :**

తమిళనాడు రాజకీయాలను కుదిపేస్తున్న మరో పెద్ద అవినీతి కేసు వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై శాఖలో ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన 'క్యాష్ ఫర్ జాబ్స్' కుంభకోణాన్ని ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ బహిర్గతం చేసింది.

...::: తరువాయి 2వ పేజీలో..



## రఫేల్ యుద్ధవిమానంలో రాష్ట్రపతి విహారం

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శక్తివంతమైన రఫేల్ యుద్ధవిమానంలో బుధవారం విహరించి చరిత్ర సృష్టించారు. హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి ఆమె ప్రయాణం ప్రారంభమైంది. ఎయిర్‌ఫోర్స్ అధిపతి మార్షల్ ఏపీ సింగ్ ప్రత్యక్షంగా వీక్షించారు. రఫేల్ జెట్‌లో ఎక్కేముందు ముర్ము సూట్ ధరించి, చేతిలో హెల్మెట్ పట్టుకుని, పైలట్‌తో ఫొటో దిగారు.గగనవిహారం తరువాత ఆమె క్షేమంగా తిరిగి అంబాలాకు చేరుకున్నారు. రఫేల్‌లో విహరించడం మరపురాని అనుభవమని ముర్ము తెలిపారు. దేశ రక్షణ సామర్థ్యాలపై గర్వం కలిగిందని ఆమె 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ విన్యాసాన్ని విజయవంతంగా నిర్వహించిన వైమానిక దళం బృందాన్ని రాష్ట్రపతి అభినందించారు.

...::: తరువాయి 2వ పేజీలో..



## క్రిప్టో మోసానికి ప్రభుత్వ వైద్యుడు బలి

**కరీంనగర్ (ఏడీఎన్ఎన్) :**

కరీంనగర్ జిల్లా కేంద్రంలో క్రిప్టో కరెన్సీ మోసం విషాదానికి దారితీసింది. ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ ఎం.శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. ప్రతిమ విద్యావైద్యాసుపత్రిలో అనస్తీషియా వైద్యుడిగా పనిచేస్తున్న ఆయన మత్తు ఇంజెక్షన్ తీసుకుని ప్రాణాలు తీసుకున్నారు. మంకమ్మతోటకు చెందిన శ్రీనివాస్ గతంలో చొప్పదండి మెడికల్ ఆఫీసర్‌గా సేవలందించారు. ఆయన భార్య విప్లవశ్రీ కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. ఆయన భార్య, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బ్యాంకు అధికారులు తరచుగా ఇంటికి రావడంతో తన భర్త మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు.

...::: తరువాయి 5వ పేజీలో..



# రేవంత్ టీంలో స్టార్ బ్యాట్స్‌మన్

అజహరుద్దీన్ కు మంత్రి పదవితో ముస్లిం ఓట్లు పడేనా? | గవర్నర్ కోటాలో కౌన్సిల్ కు పంపేందుకు నిర్ణయం | అయోమయంలో బీఆర్ఎస్ శ్రేణులు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్)**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. స్టార్ క్రికెటర్, మాజీ ఎంపీ మహ్మద్ అజహరుద్దీన్ ను రాష్ట్ర క్యాబినెట్‌లోకి తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆయన రాజ్‌భవన్‌లో మంత్రి హోదాలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రస్తుతం తెలంగాణ క్యాబినెట్‌లో మూడు ఖాళీలు ఉండగా, వాటిలో ఒకదాన్ని అజహరుద్దీన్ తో భర్తీ చేయాలని బుధవారం నిర్ణయించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన అజహరుద్దీన్ కు ఉపఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రాలేదు. దీంతో ఆయనను ఎమ్మెల్సీగా నియమించి, తరువాత మంత్రి పదవి ఇవ్వాలని హైకమాండ్ నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ కోటాలో ఆయనను ఎమ్మెల్సీగా సిఫారసు చేశారు. అయితే గవర్నర్ ఆమోదం ఇంకా వెలువడలేదు.సాంప్రదాయకంగా మంత్రి పదవికి ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ అర్హత అవసరం ఉన్నప్పటికీ, నియమాల ప్రకారం ఆరు నెలల్లోపుగా ఉభయ సభల్లో ఏదో ఒక సభకు ఎన్నికైతే సరిపోతుంది. ...::: తరువాయి 5వ పేజీలో..

## జమైకాకు హరికేన్ ముప్పు

మెలిసా తుపాన్ తో డేంజర్ లో జమైకా | వర్షా లకు నలుగురు మృత్యువాత | 174 చరిత్రలోనే అరుదైన రికార్డు | ఏడు లక్షల మందిని తరలింపు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అట్లాంటిక్ మహాసముద్రంలో ఏర్పడిన మెలిసా తుపాన్ జమైకాపై విరుచుకుపడింది. గంటకు 295 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు దేశాన్ని అతలాకుతలం చేశాయి. కుండపోతగా కురుస్తున్న వర్షాలకు నలుగురు ప్రాణాలు కొల్పోయారు. 174 ఏళ్ల దేశ చరిత్రలో ఇది అత్యంత శక్తివంతమైన తుపానుగా రికార్డయింది. చెట్లు విరిగి పడిపోవడం, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో దేశమంతా చీకటిలో మునిగిపోయింది. కొండచరియలు విరిగిపడి రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. ఏడు లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. కేటగిరీ-5 తుపానుగా రికార్డులకెక్కిన మెలిసా, ప్రస్తుతం క్యూబా వైపు కదులుతోంది. మెలిసా తుపాన్ దెబ్బతో జమైకా దేశ చరిత్రలో ఎన్నడూ చూడని ఆస్తి నష్టాన్నిచూడబోతోందని ప్రధాని ఆండ్రూ హోల్నెస్ ప్రకటించారు. దేశంలో వేలాది మంది ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

...::: తరువాయి 3వ పేజీలో..





## మాజీ సీఎం జగన్‌కు ఊరట

### పిటిషన్ పేరుతో సీబీఐ ఆరాటం... కొట్టేసిన కోర్టు...

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెల్‌ఫోన్ నంబర్ వివాదం ఇవాళ కీలక మలుపు తిరిగింది. అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న జగన్‌పై సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ ను హైదరాబాద్ సీబీఐ కోర్టు కొట్టివేసింది. అక్రమాస్తుల కేసులో బెయిల్ షరతుల ప్రకారం జగన్ విదేశీ పర్యటనలకు వెళ్లే ముందు, తన మొబైల్ నంబర్‌ను సీబీఐకి అందజేయాలి. లండన్ లో చదువుతున్న తన కుమార్తెను చూసేందుకు, జగన్మోహన్ రెడ్డి 10 రోజుల పర్యటన నిమిత్తం కోర్టు అనుమతి పొందారు. ఈ క్రమంలో ఎప్పటిలాగే సీబీఐకి ఒక మొబైల్ నంబర్‌ను సమర్పించారు. అయితే, గతంలో ఇచ్చిన మొబైల్ నంబర్ , ఈసారి ఇచ్చిన నంబర్ మధ్య వ్యత్యాసం ఉండటంపై సీబీఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. ...::: తరువాయి 4వ పేజీలో..

## నిజామాబాద్‌లో లవ్ జిహాద్

హిందూ మహిళపై అత్యాచారం | నిందితునికి పదేళ్ల జైలు



**నిజామాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హిందూ యువతిని ప్రేమిస్తున్నానని నమ్మించి, హిందువుగా మారతానని చెప్పి మోసం చేసిన ముస్లిం యువకుడు మహ్మద్ అబ్దుల్ లతీఫ్‌కు కోర్టు కఠిన శిక్ష విధించింది. నిజామాబాద్ మహిళలపై అత్యాచారాల విచారణ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి హరీష్, బుధవారం ఈ కేసులో తీర్పు వెలువరించారు. నిందితుడు అబ్దుల్ లతీఫ్ ఆ యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు అత్యాచారం చేసినట్టు తేలింది. మాయ మాటలు చెప్పి మోసం చేసినందుకు కోర్టు అతనికి- భారత న్యాయ సంహిత లోని చట్టాలకింద, ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా, అలాగే సెక్షన్ 376(2)(n) కింద పది సంవత్సరాల కఠిన జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. ...::: తరువాయి 5వ పేజీలో..

## మొంథా పై ముఖ్యమంత్రి ఆరా



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్)**

తెలంగాణ రాష్ట్రంపై మొంథా తుపాన్ తీవ్ర ప్రభావం చూపుతుండటంతో ప్రభుత్వం హైఅలర్ట్ జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం నిర్వహించిన అత్యవసర సమీక్షా సమావేశంలో, అధికారులకు కీలక సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. వరి కోతల సమయం కావడంతో కల్లాల్లో ధాన్యం ఆరబెట్టిన ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. మొంథా తుపాన్ ప్రభావం ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో అధికంగా ఉంటుందని సీఎంఓ అంచనా వేసింది. ఈ జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని...

...::: తరువాయి 5వ పేజీలో..



## సొరంగంలోకి వరద నీరు వెలిగొండలో ప్రమాదం

**ప్రకాశం (ఏడీఎన్ఎన్) :**

ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం కొత్తూరు సమీపంలోని వెలిగొండ ప్రాజెక్టు సొరంగంలో 200 మంది కార్మికులు చిక్కుకు పోయిన ఘటన ఒక రోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రాజెక్టు రెండో సొరంగంలో లైనింగ్ పనులు చేస్తూ ఉన్న 200 మంది కార్మికులు, మంగళవారం రాత్రి ఆకస్మికంగా వరదలో చిక్కుకుపోయారు. అయితే అధికారులు సమయానికి స్పందించడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. ...::: తరువాయి 4వ పేజీలో..

## మీ సేవలు ఇక చాలు...

14 వేల ఉద్యోగులకు అమెజాన్ షాక్ | టెక్స్ట్ మెసేజ్‌లతో లేఆఫ్ సమాచారం




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రముఖ ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ తమ ఉద్యోగులకు ఊహించని షాక్ ఇచ్చింది. తమను విధుల నుంచి తొలగించినట్లు వేలమందికి, మంగళవారం ఉదయం నుంచి వస్తున్న టెక్స్ట్ మెసేజ్‌లతో, ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వ్యక్తిగత లేదా వర్క్ ఈమెయిల్‌ను చెక్ చేసుకోవల్సిందిగా వారికి, ఆ మెసేజ్ ల ద్వారా అమెజాన్ యాజమాన్యం సూచించింది. కొందరికైతే, హెల్ప్ డెస్క్ ను సంప్రదించాల్సిందిగా కూడా మెసేజ్ లు వచ్చాయి. ఈ లేఆఫ్‌ల బారినపడిన వారిలో అమెరికాలోని రిటైల్ మేనేజ్‌మెంట్ ఉద్యోగులు ఎక్కువమంది ఉన్నట్లు సమాచారం. ...::: తరువాయి 2వ పేజీలో..

27

## వందేళ్ల... ఆర్ఎస్ఎస్

### భారత పునర్నిర్మాణ మహాయజ్ఞం



**ఏకాత్మతా యాత్ర – అఖండ భారతావని ఆత్మఘోష: ఒక సాంస్కృతిక మహోద్యమం**

భిన్నత్వంలో ఏకత్వాన్ని పునఃప్రతిష్ఠించి, జాతీయ సమైక్యతకు గంగాజలాభిషేకం చేసిన విశ్వ హిందూ పరిషత్ అపురూప యజ్ఞం

భారతదేశం ఒక అద్భుతం. వేల సంవత్సరాల అవిచ్ఛిన్న నాగరికత, ఎన్నో భాషలు, మరెన్నో సంప్రదాయాలు, విభిన్న ఆరాధనా పద్ధతులు – ఇన్ని వైవిధ్యాలు కలిగిన మరో దేశం ప్రపంచ పటంలో కానరాదు. ఈ భిన్నత్వమే మన బలం, మన సౌందర్యం. కానీ, ఈ భిన్నత్వం వెనుక, హిమాలయాల నుంచి హిందూ మహాసముద్రం వరకు, ఈ నేల నరనరాలలో ప్రవహిస్తున్న ఒక అఖండమైన, సనాతనమైన సాంస్కృతిక ఏకతా సూత్రం ఉంది. ఆ సూత్రమే మనల్ని వేల సంవత్సరాలుగా కలిపి ఉంచింది, ఎన్నో దండయాత్రలను, విపత్తులను తట్టుకుని నిలబడే శక్తినిచ్చింది. అదే మన జాతీయతకు ఆత్మ, అదే 'భారతీయత'.

అయితే, 1947లో రాజకీయ స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత, కొన్ని దశాబ్దాలు గడిచేసరికి, ఈ సహజమైన ఏకతా సూత్రం బలహీనపడే ప్రమాద సంకేతాలు కనిపించడం మొదలయ్యాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కొన్నిచోట్ల ప్రాంతీయ దురభిమానానికి దారితీసింది. కులతత్వం విషనాగులా పడగవిప్పింది. ...::: తరువాయి 2వ పేజీలో..



## తుపాను మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

మొంథా తుపాన్ ప్రభావం నుంచి కోలుకుంటున్న ఆంధ్రప్రదేశ్‌లో నష్ట నివారణ చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. తుపాన్ కారణంగా రాష్ట్రంలో ఇప్పటివరకు ముగ్గురు మరణించారని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల వంతున రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి బుధవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. ...::: తరువాయి 4వ పేజీలో..



## ఎవరీ దయాచౌదరి?

- సైబర్ క్రైమ్ పోలీసులకు చిరంజీవి మరో ఫిర్యాదు
- ఏఐతో అశ్లీల వీడియోలు సృష్టిస్తున్నాడని ఆరోపణ
- 'ఎక్స్'లో అసభ్యకర పోస్టులతో 'మెగా' ప్రతిష్ఠకు భంగం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్)**

ప్రఖ్యాత సినీ నటుడు, మెగాస్టార్ చిరంజీవి సామాజిక మాధ్యమాల్లో తనపై జరుగుతున్న అసభ్యకర ప్రచారం పట్ల మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. దయాచౌదరి అనే వ్యక్తి తనపై అభ్యంతరకర, అవమానకర వ్యాఖ్యలు చేస్తూ 'ఎక్స్' లో పోస్టులు పెడుతున్నాడని చిరంజీవి, తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పోస్టులు తన ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆయన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ...::: తరువాయి 5వ పేజీలో..



## మావోల లొంగు'బాట'

- ఛత్తీస్‌గఢ్‌లో 51 మంది సరెండర్

**ఛత్తీస్‌గఢ్ (ఏడీఎన్ఎన్)**

ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీగా మావోయిస్టులు లొంగిపోయారు.మొత్తం 51 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట బుధవారం సరెండరయ్యారు. వారిలో 9 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. వీరి మీద 66 లక్షల రూపాయల రివార్డులు ఉన్నట్టు ఎస్పీ చెప్పారు. ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో భాగంగా, భద్రతా దళాలు ఛత్తీస్ గఢ్ ఏజెన్సీ ప్రాంతాలను భారీగా జల్లడపడుతున్నాయి. ఈ ఆపరేషన్ ప్రారంభమైనప్పటి నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టులపై దాడుల తీవ్రత పెరిగింది. మావోయిస్టు సమస్యను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఆపరేషన్ కొనసాగుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ...::: తరువాయి 2వ పేజీలో..

## క్యాష్ కొట్టు... కొలువు పట్టు...
# స్టాలిన్ పై ఈ'ఢీ'

**మొదటిపేజీ తరువాయి...**

ఈ కుంభకోణంలో రూ.888 కోట్ల రూపాయలు చేతులు మారినట్టు ఈడీ నివేదికలో పేర్కొంది. తమిళనాడు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్లు, జూనియర్ ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వంటి 2,538 పదవుల భర్తీకి 2024 ప్రారంభంలో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 1.12 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న వారికి , అన్నా యూనివర్సిటీ పరీక్షలు నిర్వహించింది.అయితే, ఈడీ ప్రకారం కనీసం 150 మంది అనర్హులు లంచాల ద్వారా ఎంపికయ్యారు. ప్రతి ఉద్యోగానికి రూ.25 నుండి రూ.35 లక్షల వరకు లంచం వసూలు చేసినట్లు తెలిసింది. ఈ మొత్తాలు మధ్యవర్తుల ద్వారా రాజకీయ నాయకులకు, వారి సన్నిహితులకు చేరినట్లు నివేదిక పేర్కొంది. మొత్తం లెక్కలో రూ.35 లక్షల చొప్పున 2,538 పోస్టులకు లంచం తీసుకుంటే, అవినీతి పరిమాణం రూ.888 కోట్లకు పైగా అవుతుందని ఈడీ అంచనా వేసింది. ఈ మోసం విచారణకు నాంది మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై శాఖా మంత్రి కె.ఎన్. నెహ్రూ సోదరుడు ఎన్.రవిచంద్రన్ కంపెనీకి సంబంధించిన బ్యాంక్ ను మోసం చేసిన కేసు నుంచే మొదలైంది. రవిచంద్రన్‌కు చెందిన ట్రూ వాల్యూ హోమ్స్ గ్రూప్‌పై ఈడీ దర్యాప్తు చేస్తూ, రూ.30 కోట్ల ఋణం తీసుకొని మోసం చేసిన కేసులో హవాలా లావాదేవీలు, లంచాల చైన్ బయటపెట్టింది. గత ఏడాది ఈడీ చేసిన దాడుల్లోనే ఈ అంశాలపై ఆధారాలు సేకరించినట్లు అధికారులు తెలిపారు. ఈడీ అక్టోబర్ 29న మనీ లాండరింగ్ నిరోధక చట్టం సెక్షన్ 66(2) ప్రకారం, 232 పేజీల నివేదికను తమిళనాడు పోలీస్ చీఫ్‌కు పంపింది. ఇందులో మోసం ఎలా జరిగిందో, లంచాల రహదారి ఎలా నడిచిందో, అనర్హ అభ్యర్థుల జాబితా, మధ్యవర్తుల పాత్ర వంటి అంశాలను వివరించింది.అదే విధంగా, మంత్రి నెహ్రూ సోదరుడు రవిచంద్రన్, శాఖ సెక్రటరీలు, , ఉద్యోగ నియామక ఆర్డర్లను పంపిణీ చేసినవారు ప్రధాన పాత్రధారులుగా పేర్కొంది. ఈడీ నివేదికలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేరు కూడా ఉల్లేఖించబడినట్లు సమాచారం. ఈ మోసం బయటపడటంతో తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. విపక్షాలు సిబిఐ దర్యాప్తు కోసం డిమాండ్ చేస్తున్నాయి. "ఇది కేవలం ఉద్యోగ అవినీతి కాదు, ఇది స్టాలిన్ పాలనలో జరుగుతున్న డీప్‌రూటెడ్ సిస్టమాటిక్ కరప్షన్" అని మాజీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నమలై వ్యాఖ్యానించారు.అలాగే ఐఏడీఎంకే నేతలు కూడా ఈ వ్యవహారంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తమిళనాడు ప్రభుత్వం ఈడీ ఆరోపణలను నిరాధారమని ఖండించింది.

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై శాఖ నియామకాలు పూర్తిగా మెరిట్ ఆధారంగా, పారదర్శకంగా జరిగాయని ప్రభుత్వం తెలిపింది. కానీ ఈడీ లేఖలో పేర్కొన్న వివరాల నేపథ్యంలో పోలీసు దర్యాప్తు ప్రారంభం కావాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఈ కేసు 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ముందు బయటపడటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. విపక్షాలు ఈ అంశాన్ని ప్రచార ఆయుధంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఈడీ పంపిన రిపోర్టు ప్రకారం పోలీసులు త్వరితగతిన దర్యాప్తు ప్రారంభిస్తే, తమిళనాడు రాజకీయాల్లో మరిన్ని సెన్సేషన్లు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

## ముస్లిం అమ్మాయిని ప్రేమించండి,
# పెళ్లి నేను చేస్తా...

**మొదటిపేజీ తరువాయి...**

ఈ పర్యటనకు సంబంధించిన వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఆ వీడియోలో రాఘవేంద్ర ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ, "ఏ హిందూ యువకుడైనా ముస్లిం అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుంటే, ఆ వివాహాన్ని నేనే దగ్గరుండి జరిపిస్తాను. అంతేకాకుండా వారికి ఉద్యోగం కూడా ఇప్పిస్తాను" అని పేర్కొన్నారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక వర్గాల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయి. హిందువులు భయపడాల్సిన అవసరం లేదని, యూపీలో తమకు నచ్చినది చేసుకోవచ్చని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఇది అఖిలేష్ యాదవ్ కాలం కాదని , యోగి ఆదిత్యనాథ్ శకం కాబట్టి మనం ధైర్యంగా ఉండాలని ఆయన చెప్పారు. ఇద్దరు హిందూ మహిళలను ముస్లిం యువకులు బలవంతంగా మతం మార్చిన ఘటనకు ప్రతిగా హిందూ యువకులు కనీసం పది మంది ముస్లిం మహిళలను పెళ్లి చేసుకోవాలని సూచించారు. దుమారియాగంజ్ ప్రాంతాన్ని గతంలో 'మినీ పాకిస్తాన్' అని పిలిచేవారని ఆయన వ్యాఖ్యానిస్తూ, యోగి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ భయం తొలగిపోయిందని అన్నారు. హిందూ మహిళలు ఇప్పుడు భయపడకుండా జీవిస్తున్నారని పేర్కొన్నారు. అయితే రాఘవేంద్ర ప్రతాప్ సింగ్ చేసిన ఈ వ్యాఖ్యలపై సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే సయ్యదా ఖతూన్ తీవ్రంగా స్పందించారు. ఆయన వ్యాఖ్యలు మతపరమైన ఉద్రిక్తతలు రేకెత్తించేలా ఉన్నాయని, మహిళలను అవమానించేలా ఉన్నాయని ఆమె అన్నారు. ముస్లింలను నిరంతరం అవమానించడం బీజేపీ నేతల ధోరణిగా మారిందని ఆమె విమర్శించారు. "ముస్లింలు భారత పౌరులు కాదా? స్వాతంత్ర్య పోరాటంలో వారు ప్రాణత్యాగాలు చేయలేదా?" అంటూ ప్రశ్నించారు. ఆమె ఇంకా మాట్లాడుతూ, తమ ఫిర్యాదులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, పరిస్థితి ఉద్రిక్తంగా మారితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## రఫేల్ యుద్ధవిమానంలో
# రాష్ట్రపతి విహారం

**మొదటిపేజీ తరువాయి...**

వారణాసిలో జన్మించిన స్క్వాడ్రన్ లీడర్ శివంగి సింగ్ రాష్ట్రపతితో కలిసి అంబాలా వైమానిక స్థావరంలో కనిపించారు. ఆమె రఫేల్‌ను నడిపిన తొలి భారతీయ మహిళా పైలట్. ఇటీవల పాకిస్తాన్ సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన "ఆపరేషన్ సిందూర్" వాదనలను భారత అధికారులు ఖండించారు. ఆ దాడిలో రఫేల్ జెట్లు పాక్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాయి. రాష్ట్రపతి ముర్ము యుద్ధవిమానంలో విహరించడం ఇది రెండోసారి. 2023లో ఆమె సుఖోయ్30 ఫైటర్ జెట్‌లో గగనవిహారం చేశారు. అంతకుముందు 2006లో ఏపీజే అబ్దుల్ కలాం, 2009లో ప్రతిభా పాటిల్ కూడా ఇలాంటి విమానాల్లో పయనించారు.

# మావోల లొంగు'బాట'

**మొదటిపేజీ తరువాయి...**

"మావోయిస్టు రహిత భారత్ సాధించేంత వరకు ఈ ఆపరేషన్ ఆగదు" అని ఆయన హెచ్చరించారు. ఫలితంగా, వందలాది మావోయిస్టులు హతమవడం, వేలాది మంది స్వచ్ఛందంగా లొంగిపోవడం జరుగుతోంది. ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్య, బీజాపూర్, సుక్మా, నారాయణ్‌పూర్ ప్రాంతాలు ఒకప్పుడు మావోయిస్టుల గడపగా ఉండగా, ఇప్పుడు పోలీసులు అక్కడ గట్టి పట్టు సాధించారు. మౌలిక వసతుల అభివృద్ధి, గ్రామాల్లో సర్కారు సంక్షేమ పథకాల అమలు కారణంగా మావోయిస్టు ప్రభావం గణనీయంగా తగ్గిందని భద్రతా వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవలి లొంగుబాట్లు మావోయిస్టు పార్టీ అంతర్గత విభేదాలను, భవిష్యత్ వ్యూహపరమైన బలహీనతను బయటపెడుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. భద్రతా దళాల నిరంతర ఆపరేషన్లు, ప్రభుత్వ పునరావాస పథకాలతో మావోయిస్టులు పెద్ద ఎత్తున సమాజంలో కలిసిపోతున్నారని అధికారులు పేర్కొన్నారు.

# ఏకాత్మతా యాత్ర - అఖండ భారతావని ఆత్మఘోష: ఒక సాంస్కృతిక మహోద్యమం



**మొదటి పేజీ తరువాయి...**

మత మార్పిడులు, వేర్పాటువాద ఉద్యమాలు (ముఖ్యంగా పంజాబ్‌లో ఖలిస్తాన్) దేశ సమగ్రతకే సవాలు విసిరాయి. రాజకీయాలు కేవలం అధికారం కోసం జరిగే స్వార్థ క్రీడగా మారి, జాతిని ఏకం చేయాల్సింది పోయి, ఓటు బ్యాంకుల కోసం విడదీసే సాధనంగా మారాయి. 'భిన్నత్వంలో ఏకత్వం' అనే మన నినాదం, కేవలం పుస్తకాలకే పరిమితమై, ఆచరణలో 'భిన్నత్వమే' ప్రముఖంగా కనిపించే ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడింది. దేశం రాజకీయంగా ఏకీకృతంగా ఉన్నప్పటికీ, భావోద్వేగపరంగా, సాంస్కృతికంగా విచ్ఛిన్నమయ్యే సూచనలు మేధావులను, దేశభక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి.

ఈ చారిత్రక సంధిగ్ధంలో, జాతి ఎదుర్కొంటున్న ఈ అంతర్గత బలహీనతను గుర్తించి, కృత్రిమమైన విభజన రేఖలను చెరిపివేసి, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, కచ్ నుంచి కామరూప్ వరకు నివసించే కోట్లాది మంది భారతీయుల హృదయాలలో "మనమంతా ఒక్కటే, మనందరిదీ ఒకే తల్లి, ఒకే వారసత్వం, ఒకే సంస్కృతి" అనే సనాతన సత్యాన్ని పునఃప్రతిష్ఠించడానికి, ఒక అపూర్వమైన, అద్వితీయమైన, పూర్తిగా అరాజకీయమైన సాంస్కృతిక మహోద్యమం ఆవిర్భవించింది. అదే విశ్వ హిందూ పరిషత్ (VHP) ఆధ్వర్యంలో జరిగిన ఏకాత్మతా యాత్ర (1983).

ఏకాత్మతా యాత్ర కేవలం ఒక ఊరేగింపు కాదు. అదొక జాతీయ యజ్ఞం. అదొక భావోద్వేగ ప్రవాహం. అదొక సాంస్కృతిక పునరుజ్జీవన శంఖారావం. గంగా మాత పవిత్ర జలాన్ని, భరతమాత దివ్య రూపాన్ని రథాలపై అధిష్ఠింపజేసి, దేశం నలుమూలలకూ తీసుకువెళ్ళి, కోట్లాది మంది ప్రజలను ఒకే తాటిపైకి, ఒకే భావోద్వేగంతో, ఒకే జాతీయ స్ఫూర్తితో ఏకం చేసిన అద్భుత దృశ్యం అది. ఇది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వ్యవస్థాపకులైన డాక్టర్ కేశవ్ బలీరాం హెడ్గేవార్ యొక్క 'హిందూ సమాజ సంఘటన' సిద్ధాంతం యొక్క సహజమైన పరిణామం, సంఘ రెండవ సర్ సంఘ్‌చాలక్ శ్రీ గురూజీ గోల్వాల్కర్ ఆకాంక్షించిన 'సాంస్కృతిక జాతీయవాదం' యొక్క ఆచరణ రూపం.

ఇందులో, ఏకాత్మతా యాత్రకు దారితీసిన ఆనాటి జాతీయ పరిస్థితులను, దాని వెనుక ఉన్న మహోన్నతమైన దార్శనికతను, దాని అపురూపమైన ప్రస్థానాన్ని, అది భారత జాతీయ సమైక్యతపై, సాంస్కృతిక చైతన్యంపై చూపిన అపారమైన, శాశ్వతమైన సానుకూల ప్రభావాన్ని సమగ్రంగా విశ్లేషించుకుందాం. ఇది కేవలం ఒక యాత్ర కథ కాదు, ఇది తనను తాను తిరిగి కనుగొన్న ఒక జాతి ఆత్మ కథ.

**చీలికల కాలం – ఏకత్వానికి పెను సవాళ్లు (1980ల ప్రారంభం)**

ఏకాత్మతా యాత్ర యొక్క చారిత్రక ఆవశ్యకతను, దాని ప్రాముఖ్యతను సంపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే, 1980ల ప్రారంభంలో భారతదేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన విచ్ఛిన్నకర ధోరణులను, జాతీయ సమైక్యతకు పొంచి ఉన్న ప్రమాదాలను మనం లోతుగా పరిశీలించాలి. అది దేశ భవిష్యత్తు గురించే ఆందోళన కలిగించిన ఒక గడ్డు కాలం.

1. **పంజాబ్‌లో ఖలిస్తాన్ భూతం – వేర్పాటువాద విషజ్వాలలు:**

ఆనాటి భారతదేశం ఎదుర్కొన్న అతిపెద్ద అంతర్గత భద్రతా సవాలు, పంజాబ్‌లో వేళ్లూనుకుంటున్న ఖలిస్తాన్ వేర్పాటువాద ఉద్యమం. కొందరు స్వార్థపూరిత నాయకులు, విదేశీ శక్తుల ప్రోద్బలంతో, సిక్కులకు ప్రత్యేక దేశం కావాలనే నినాదాన్ని అందుకుని, హింసా మార్గాన్ని ఎంచుకున్నారు. అమాయక హిందువులను, చివరికి తమతో విభేదించిన సిక్కులను కూడా దారుణంగా హత్య చేశారు. స్వర్ణ దేవాలయం వంటి పవిత్ర స్థలాలను ఆయుధాగారాలుగా, తీవ్రవాద స్థావరాలుగా మార్చారు. ఈ ఉద్యమం, శతాబ్దాలుగా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవిస్తున్న హిందూసిక్కుల మధ్య అగాధాన్ని సృష్టించి, దేశ సమగ్రతకే పెను ముప్పుగా పరిణమించింది. ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతోందనే భావన ప్రజలలో బలపడింది.

**2. మీనాక్షిపురం మత మార్పిడులు – సాంస్కృతిక దాడి:**

1981లో తమిళనాడులోని మీనాక్షిపురం గ్రామంలో, వందలాది దళిత కుటుంబాలు ఇస్లాం మతంలోకి సామూహికంగా మారడం, యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇది కేవలం మత మార్పిడి సంఘటన కాదు. ఇది హిందూ సమాజంలోని అంతర్గత బలహీనతలను (కుల వివక్ష వంటివి), పేదరికాన్ని ఆసరాగా చేసుకుని, విదేశీ నిధుల ప్రలోభాలతో, దేశ జనాభా స్వరూపాన్ని, సాంస్కృతిక అస్తిత్వాన్ని మార్చడానికి జరుగుతున్న ఒక ప్రణాళికాబద్ధమైన దాడి అనే ఆందోళనను దేశభక్తులలో తీవ్రతరం చేసింది. హిందూ సమాజం తన అంతర్గత లోపాలను సరిదిద్దుకుని, ఐక్యంగా, జాగృతంగా ఉండకపోతే, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు మరిన్ని పొంచి ఉన్నాయని ఇది హెచ్చరించింది.

3. **పెరుగుతున్న కుల, ప్రాంతీయ ఘర్షణలు:**

రాజకీయ లబ్ధి కోసం, కులాల మధ్య, ప్రాంతాల మధ్య, భాషల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే ధోరణులు పెరిగాయి. రిజర్వేషన్ల వివాదాలు, సరిహద్దు తగాదాలు, భాషా ఆధిపత్య పోరాటాలు సమాజంలో చీలికలను మరింత పెంచాయి. "భారతీయులం" అనే భావన కంటే, "మేము ఫలానా కులం వారం, ఫలానా ప్రాంతం వారం, ఫలానా భాష వారం" అనే సంకుచితమైన గుర్తింపులు బలపడ్డాయి. జాతీయ ప్రయోజనాల కంటే, స్థానిక, వర్గ ప్రయోజనాలకే ప్రాధాన్యత పెరిగింది.

4. **జాతీయ నాయకత్వ లోపం – సడలుతున్న నైతిక విలువలు:**

స్వాతంత్ర్య సంగ్రామ తరం నాయకుల తర్వాత, రాజకీయాలలో నైతిక విలువలు, దేశభక్తి, నిస్వార్థ సేవాభావం సన్నగిల్లాయి. అవినీతి, అధికార దుర్వినియోగం, కుటుంబ పాలన వంటివి పెరిగాయి. జాతీయ నాయకత్వం, ప్రజలలో ఐక్యతా భావాన్ని, నైతిక స్థైర్యాన్ని నింపడంలో విఫలమవుతోందనే భావన వ్యాపించింది.

ఈ విధంగా, 1980ల ప్రారంభంలో భారతదేశం ఒక బహుముఖ సంక్షోభాన్ని ఎదుర్కొంది. దేశం భౌగోళికంగా ఒక్కటిగా ఉన్నప్పటికీ, మానసికంగా, భావోద్వేగపరంగా విడిపోయే ప్రమాదం అంచున నిలబడింది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, విశ్వ హిందూ పరిషత్ వంటి జాతీయవాద సంస్థలు, కేవలం సమస్యలను విమర్శించడంతో ఆగిపోకుండా, ఒక నిర్మాణాత్మకమైన, సానుకూలమైన, దేశవ్యాప్త పరిష్కారాన్ని కనుగొనాలని సంకల్పించాయి. ఆ సంకల్ప ఫలమే ఏకాత్మతా యాత్ర.

**సంకల్పానికి రూపం – ఏకాత్మతా యాత్ర దార్శనికత, ప్రణాళిక**

దేశం ఎదుర్కొంటున్న విచ్ఛిన్నకర ధోరణులకు విరుగుడు ఏమిటి? కృత్రిమమైన విభజన రేఖలను చెరిపివేసి, ప్రజల హృదయాలను తిరిగి ఎలా ఏకం చేయాలి? ఈ ప్రశ్నలపై సంఘ్, VHP నాయకత్వం లోతుగా మథనపడింది. వారు ఒక చారిత్రక సత్యాన్ని గుర్తించారు: భారతదేశాన్ని కలిపి ఉంచే అసలైన శక్తి, రాజకీయ అధికారం కాదు, సైనిక బలం కాదు. అది ఈ దేశపు సనాతనమైన, అఖండమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వం. ఆ వారసత్వాన్ని ప్రజలకు తిరిగి గుర్తుచేసి, వారిలో ఉమ్మడి జాతీయ అస్తిత్వం పట్ల గర్వాన్ని, సోదరభావాన్ని జాగృతం చేయగలిగితే, ఏ విచ్ఛిన్నకర శక్తీ ఈ దేశాన్ని విడదీయలేదు.

ఈ దార్శనికత నుంచే ఏకాత్మతా యాత్ర ఆలోచన పుట్టింది. ఇది ఒక వినూత్నమైన, సాహసోపేతమైన, పూర్తిగా అరాజకీయమైన ప్రణాళిక.

**ప్రధాన సూత్రధారులు – సంఘ్ ప్రేరణ, VHP నిర్వహణ:**

ఈ మహోద్యమానికి వెనుక అసలైన ప్రేరణ, మార్గదర్శనం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ది. ముఖ్యంగా, సంఘ సీనియర్ ప్రచారక్, అద్భుతమైన వ్యూహకర్త మోరోపంత్ పింగళే గారు ఈ యాత్ర యొక్క రూపశిల్పిగా పరిగణించబడతారు. అయితే, ఈ బృహత్తర కార్యాన్ని క్షేత్రస్థాయిలో నిర్వహించే, దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను సమీకరించే బాధ్యతను విశ్వ హిందూ పరిషత్ స్వీకరించింది. అప్పటి VHP ప్రధాన కార్యదర్శి అశోక్ సింఘాల్ గారు, తమ అకుంఠితమైన దీక్షతో, సంఘటనా సామర్థ్యంతో ఈ యాత్రను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

**యాత్ర లక్ష్యాలు – కేవలం సాంస్కృతికం, ఆధ్యాత్మికం:**

యాత్ర యొక్క లక్ష్యాలు అత్యంత స్పష్టంగా, పవిత్రంగా నిర్దేశించబడ్డాయి:

1. **జాతీయ ఏకతా భావనను పునరుద్ధరించడం:** భాష, ప్రాంతం, కులం, సంప్రదాయం వంటి భేదాలకు అతీతంగా, భారతీయులందరూ ఒకే జాతి, ఒకే కుటుంబం అనే భావనను బలంగా ప్రజలలోకి తీసుకువెళ్లడం.
2. **సాంస్కృతిక వారసత్వం పట్ల గర్వాన్ని పెంపొందించడం:** మన దేశపు మహోన్నతమైన చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మిక సంపదను ప్రజలకు గుర్తుచేసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని, జాతీయ గర్వాన్ని నింపడం.
3. **సామాజిక సమరసతను సాధించడం:** ముఖ్యంగా, అంటరానితనం వంటి సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా బలమైన సందేశాన్ని ఇవ్వడం, హిందూ సమాజంలో అంతర్గత ఐక్యతను సాధించడం.
4. **విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా జాగృతి:** వేర్పాటువాదం, మత మార్పిడులు, కులతత్వం వంటి దేశ విచ్ఛిన్నకర శక్తుల ప్రమాదం గురించి ప్రజలను జాగృతం చేయడం.
5. **రాష్ట్ర నిర్మాణంలో భాగస్వామ్యం:** ప్రతి పౌరుడూ దేశ నిర్మాణం కోసం, సమాజ సేవ కోసం తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలనే స్ఫూర్తిని కలిగించడం.

**ప్రతీకల ఎంపిక – జాతి హృదయాన్ని స్పృశించే శక్తి:**

ఈ లక్ష్యాలను ప్రజల హృదయాలలోకి బలంగా తీసుకువెళ్లడానికి, అత్యంత శక్తివంతమైన, పవిత్రమైన, విశ్వజనీనమైన ప్రతీకలను ఎంచుకున్నారు.

- **గంగా జల్:** గంగా నది కేవలం ఒక నది కాదు, అది భారతీయ నాగరికతకు జీవనాడి. హిమాలయాలలోని గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు ప్రవహిస్తూ, కోట్లాది మంది భారతీయుల జీవితాలతో, విశ్వాసాలతో పెనవేసుకుని ఉంది. దాని జలం పవిత్రతకు, నిరంతర ప్రవాహానికి, ఏకత్వానికి ప్రతీక. గంగోత్రి నుంచి సేకరించిన పవిత్ర గంగా జలాన్ని కలశాలలో దేశం నలుమూలలకూ తీసుకువెళ్లడం, యావత్ భారతదేశాన్ని ఆ పవిత్ర జలంతో అభిషేకించి, ఏకం చేస్తున్న భావనను కలిగించింది.
- **భారతమాత:** భారతదేశాన్ని కేవలం ఒక భౌగోళిక ప్రాంతంగా కాకుండా, ఒక సజీవమైన, ప్రేమమయమైన తల్లిగా (భారతమాతగా) ఆరాధించడం, భారత స్వాతంత్ర్య సంగ్రామం నుంచి వస్తున్న ఒక బలమైన జాతీయవాద ప్రతీక. భారతమాత చిత్రం, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరినీ ఏకం చేయగల శక్తివంతమైన భావోద్వేగ బంధం.
- **ఏకాత్మతా రథాలు:** ఈ పవిత్ర ప్రతీకలను తీసుకువెళ్లడానికి, సుందరంగా అలంకరించిన రథాలను (Chariots) ఉపయోగించారు. రథయాత్ర అనేది భారతదేశంలో వేల సంవత్సరాలుగా ఉన్న ఒక భక్తి సంప్రదాయం. ఇది ప్రజలలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని, సామూహిక భాగస్వామ్యాన్ని ప్రేరేపిస్తుంది.

బృహత్తర ప్రణాళిక - దేశమంతటినీ చుట్టివచ్చే యాత్ర:

ఈ యాత్ర యొక్క ప్రణాళిక దాని లక్ష్యం ఎంత మహోన్నతమైనదో, అంతే బృహత్తరమైనది.

- **మూడు ప్రధాన యాత్రలు:** దేశాన్ని ఉత్తరందక్షిణం, తూర్పుపశ్చిమంగా కలిపేలా మూడు ప్రధాన రథయాత్రలను రూపొందించారు:

1. హిమాలయాలలోని హరిద్వార్ నుంచి దక్షిణాగ్రాన ఉన్న కన్యాకుమారి వరకు.
2. నేపాల్‌లోని పశుపతినాథ్ ఆలయం నుంచి (హిందూ సంస్కృతి యొక్క విస్తృతికి గుర్తుగా) దక్షిణాన ఉన్న రామేశ్వరం వరకు.
3. తూర్పున ఉన్న గంగాసాగర్ నుంచి పశ్చిమాన ఉన్న సోమనాథ్ వరకు.

- **వందలాది ఉపయాత్రలు:** ఈ మూడు ప్రధాన యాత్రలతో పాటు, దేశంలోని ప్రతి జిల్లాను, ప్రతి తాలూకాను, చివరికి అనేక గ్రామాలను స్పృశించేలా వందలాది ఉపయాత్రలు (Upayatras) కూడా నిర్వహించబడ్డాయి.
- **లక్షలాది కార్యకర్తల సమీకరణ:** ఈ బృహత్తర యాత్రను విజయవంతంగా నిర్వహించడానికి, VHP, RSS మరియు ఇతర అనుబంధ సంస్థలకు చెందిన లక్షలాది మంది నిస్వార్థ కార్యకర్తలు నెలల తరబడి అహోరాత్రులు శ్రమించారు. మార్గాల రూపకల్పన, రథాల తయారీ, రాత్రి బస ఏర్పాట్లు, ఆహార ఏర్పాట్లు, బహిరంగ సభల నిర్వహణ, పోలీసులతో సమన్వయం - ఇలా ప్రతి అంశాన్నీ అత్యంత సూక్ష్మస్థాయిలో, అద్భుతమైన క్రమశిక్షణతో ప్రణాళిక చేశారు.

ఈ విధంగా, ఒక మహోన్నతమైన దార్శనికత, పవిత్రమైన ప్రతీకలు, బృహత్తరమైన ప్రణాళిక, లక్షలాది కార్యకర్తల అంకితభావం - ఇవన్నీ కలిసి ఏకాత్మతా యాత్ర అనే అపూర్వ ఘట్టానికి రంగం సిద్ధం చేశాయి.

జన గంగా ప్రవాహం - యాత్ర సాగిన తీరు, అపూర్వ స్పందన

1983 నవంబర్‌లో, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఏకాత్మతా యాత్ర రథాలు గంగా జల కలశాలతో, భారత మాత చిత్రపటాలతో తమ చారిత్రక ప్రస్థానాన్ని ప్రారంభించాయి. ఆ తర్వాతి రెండు నెలల కాలంలో, భారతదేశం ఒక అపూర్వమైన, అద్భుతమైన, భావోద్వేగభరితమైన దృశ్యానికి సాక్ష్యంగా నిలిచింది. అది కేవలం రథాల ప్రయాణం కాదు, అది కోట్లాది మంది ప్రజల హృదయాల ప్రయాణం. అదొక జన గంగా ప్రవాహం.

**ఊహకందని ప్రజా స్పందన – ప్రతి పల్లెలో పండుగ:**

యాత్ర సాగిన ప్రతి మార్గంలో, ప్రతి పట్టణంలో, ప్రతి గ్రామంలో, ప్రజల నుంచి లభించిన స్పందన ఊహలకు అందనిది, అపూర్వమైనది.

- **గంటల తరబడి నిరీక్షణ:** రథాల రాక కోసం, ప్రజలు - వృద్ధులు, మహిళలు, పిల్లలతో సహా - గంటల తరబడి, కొన్నిసార్లు రాత్రంతా రోడ్ల పక్కన వేచి ఉన్నారు.
- **సంప్రదాయ స్వాగతాలు:** రథాలు తమ గ్రామంలోకి ప్రవేశించగానే, ప్రజలు శంఖారావాలతో, డప్పు వాయిద్యాలతో, పూల వర్షంతో, పూర్ణకుంభాలతో, సాంప్రదాయ నృత్యాలతో వాటికి భక్తిపూర్వకంగా స్వాగతం పలికారు. ఇళ్ళ ముందు రంగవల్లులు తీర్చిదిద్దారు, వీధులను మామిడి తోరణాలతో అలంకరించారు. ప్రతి గ్రామంలో అదొక పండుగ వాతావరణం.
- **భక్తి పారవశ్యం:** భారతమాత చిత్రపటానికి, గంగా జల కలశానికి నమస్కరించడానికి, వాటిని తాకి ఆశీర్వాదం పొందడానికి ప్రజలు పోటీ పడ్డారు. ఎందరో భక్తులు భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు. తమ ఇళ్ళ నుంచి తెచ్చిన నీటిని గంగా జల కలశంలో కలిపి, ఆ పవిత్ర జలాన్ని తీర్థంగా స్వీకరించారు. ఇది కేవలం ఒక ఆచారం కాదు, ఇది యావత్ జాతితో తాము మమేకమవుతున్నామనే ఒక గాఢమైన అనుభూతి.

> **ఆ యాత్రకు రూపకల్పన చేసిన దార్శనికులకు, దానిని విజయవంతం చేయడానికి అహోరాత్రులు శ్రమించిన లక్షలాది మంది నిస్వార్థ కార్యకర్తలకు, అందులో భక్తిశ్రద్ధలతో పాల్గొన్న కోట్లాది మంది సామాన్య ప్రజలకు ఈ జాతి ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటుంది. ఏకాత్మతా యాత్ర – అదొక యాత్ర కాదు, అదొక శాశ్వతమైన జాతీయ స్ఫూర్తి.**

- **సామూహిక భాగస్వామ్యం:** ప్రజలు స్వచ్ఛందంగా యాత్ర నిర్వాహకులకు ఆహారం, నీరు, వసతి సౌకర్యాలు కల్పించారు. రథాలను లాగడానికి, దారి చూపించడానికి పోటీ పడ్డారు. ఇది ఎవరో నిర్వహిస్తున్న యాత్ర కాదు, ఇది 'మన' యాత్ర అనే యాజమాన్య భావన ప్రతి ఒక్కరిలోనూ కనిపించింది.

**సాధు సంతుల ఆశీస్సులు – ధార్మిక ఏకీకరణ:**

ఈ యాత్ర యొక్క మరొక విశిష్టత, దీనికి లభించిన అపూర్వమైన సాధు సంతుల, మఠాధిపతుల మద్దతు.

- **ఒకే వేదికపైకి:** భారతదేశ చరిత్రలో బహుశా ఇదే మొదటిసారి, వివిధ హిందూ సంప్రదాయాలకు, మతాలకు, పీఠాలకు చెందిన వందలాది మంది పూజ్య సాధువులు, సంతులు, శంకరాచార్యులు, మహా మండలేశ్వరులు, తమ విభేదాలను పక్కన పెట్టి, ఈ జాతీయ యజ్ఞానికి మద్దతుగా ఒకే వేదికపైకి వచ్చారు.
- **ప్రవచనాలు, ఆశీస్సులు:** యాత్ర సాగిన మార్గంలో, వారు బహిరంగ సభలలో ప్రవచనాలు చేసి, ప్రజలకు జాతీయ ఐక్యత, సామాజిక సమరసత, ధర్మ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను బోధించారు. వారి ఆశీస్సులు, వారి భాగస్వామ్యం, యాత్రకు అపారమైన నైతిక బలాన్ని, ఆధ్యాత్మిక పవిత్రతను చేకూర్చాయి.

**సమరసతా సందేశం – ఆచరణలో ఐక్యత:**

ఏకాత్మతా యాత్ర కేవలం జాతీయ ఐక్యతనే కాదు, సామాజిక ఐక్యతను కూడా బలంగా చాటిచెప్పింది. బాలాసాహెబ్ దేవరస్ గారు ఇచ్చిన 'సామాజిక సమరసత' పిలుపు, ఈ యాత్రలో ఆచరణ రూపం దాల్చింది.

- **అంటరానితనానికి వ్యతిరేకంగా:** యాత్ర సందర్భంగా జరిగిన ప్రతి సభలోనూ, సాధు సంతులు, VHP నాయకులు అంటరానితనాన్ని ఒక మహా పాపంగా ఖండించారు. హిందువులందరూ సోదరులని, కుల వివక్షకు సనాతన ధర్మంలో స్థానం లేదని స్పష్టంగా ప్రకటించారు.
- **దళితుల భాగస్వామ్యం:** అనేక గ్రామాలలో, దళిత సోదరులే ముందుండి యాత్రకు స్వాగతం పలికారు. వారే గంగా జల కలశాన్ని అందుకుని, తమ ఇళ్ళకు తీసుకువెళ్ళి పూజించారు. వారే సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. ఇది శతాబ్దాల అడ్డుగోడలను బద్దలు కొట్టిన ఒక సామాజిక విప్లవం.

**భాష, ప్రాంతాలను అధిగమించిన ప్రవాహం:**

యాత్ర ఉత్తరాది నుంచి దక్షిణాదికి, తూర్పు నుంచి పశ్చిమానికి ప్రయాణిస్తున్నప్పుడు, భాషా, ప్రాంతీయ భేదాలు ఎక్కడా అడ్డురాలేదు. తమిళనాడులోనూ, కేరళలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ, కర్ణాటకలోనూ - ఎక్కడ చూసినా అదే ఉత్సాహం, అదే భక్తి, అదే ఆత్మీయత కనిపించాయి. రథాలపై ఉన్న భారత మాత చిత్రం, కలశంలోని గంగా జలం, వేల సంవత్సరాలుగా భారతీయులందరినీ కలిపి ఉంచుతున్న ఉమ్మడి సాంస్కృతిక ప్రతీకలని, వాటికి భాషతో, ప్రాంతంతో సంబంధం లేదని ఈ యాత్ర నిరూపించింది.

**నిర్వాహకుల నిబద్ధత – అద్భుతమైన క్రమశిక్షణ:**

కోట్లాది మంది ప్రజలు పాల్గొన్న ఇంతటి బృహత్తరమైన యాత్ర, ఎక్కడా చిన్న అపశ్రుతి లేకుండా, ఎటువంటి హింసకు, గందరగోళానికి తావులేకుండా, అత్యంత శాంతియుతంగా, క్రమశిక్షణతో జరగడం, దాని నిర్వాహకులైన VHP, RSS కార్యకర్తల అద్భుతమైన సంఘటనా సామర్థ్యానికి, నిబద్ధతకు నిదర్శనం. వారు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ, ప్రజలను నియంత్రిస్తూ, యాత్ర సజావుగా సాగేలా చూశారు. వారి నిస్వార్థ సేవ, అంకితభావం యాత్ర విజయానికి వెన్నెముకగా నిలిచాయి.

ఈ విధంగా, ఏకాత్మతా యాత్ర రెండు నెలల పాటు, భారతదేశపు నలుచెరగులా ఒక అఖండమైన జాతీయ చైతన్య ప్రవాహాన్ని సృష్టించింది. అది ప్రజల నిద్రాణమైన దేశభక్తిని తట్టి లేపింది, వారి మధ్య ఉన్న అడ్డుగోడలను కరిగించింది, వారి హృదయాలను ఒకే తాటిపైకి తెచ్చింది.

యాత్ర ఫలం - జాతిపై చెరగని ముద్ర, సానుకూల ప్రభావం

ఏకాత్మతా యాత్ర కేవలం ఒక తాత్కాలిక భావోద్వేగ కెరటం కాదు. అది భారత సమాజంపై, జాతీయ జీవనంపై ఒక లోతైన, శాశ్వతమైన, అత్యంత సానుకూలమైన ముద్ర వేసింది. దాని ప్రభావం బహుముఖమైనది, దీర్ఘకాలికమైనది.

1. **జాతీయ సమైక్యతకు నూతన ఊపిరి:**

యాత్ర సాధించిన అతిపెద్ద విజయం, అది దేశ ప్రజలలో జాతీయ సమైక్యతా భావనను అపూర్వమైన రీతిలో పునరుద్ధరించడం.

- **భావోద్వేగ ఏకీకరణ:** రాజకీయ, పరిపాలనా ఏకీకరణకు అతీతంగా, అది కోట్లాది మంది భారతీయులను భావోద్వేగపరంగా, సాంస్కృతికంగా ఏకం చేసింది. "మనమంతా ఒక్కటే" అనే అనుభూతిని వారిలో బలంగా నాటింది.
- **విచ్ఛిన్నకర శక్తులకు గట్టి సమాధానం:** ఖలిస్తాన్ వంటి వేర్పాటువాద ఉద్యమాలకు, ప్రాంతీయ, భాషా దురభిమానాలకు ఇదొక బలమైన నైతిక ఎదురుదెబ్బ. భారతదేశపు అంతర్గత ఐక్యత ఎంత పటిష్టమైనదో ఈ యాత్ర ప్రపంచానికి చాటిచెప్పింది.

2. **సాంస్కృతిక పునరుజ్జీవనం – ఆత్మవిశ్వాస పునరుద్ధరణ:**

యాత్ర, ప్రజలలో తమ మహోన్నతమైన సాంస్కృతిక వారసత్వం పట్ల గర్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పునరుద్ధరించింది.

- **ఉమ్మడి ప్రతీకల గుర్తింపు:** గంగా నది, భారతమాత వంటి ఉమ్మడి జాతీయ ప్రతీకల ప్రాముఖ్యతను తిరిగి గుర్తుచేసింది.
- **సాంస్కృతిక మూలాలతో అనుసంధానం:** పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో కొట్టుకుపోతున్న యువతలో, తమ మూలాల పట్ల, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని, ఆసక్తిని రేకెత్తించింది.
- **హిందూ అస్తిత్వం పట్ల గర్వం (Positive Framing):** హిందూ సమాజంలో దశాబ్దాలుగా పాతుకుపోయిన ఆత్మన్యూనతా భావాన్ని తొలగించి, తమ ధర్మం, సంస్కృతి పట్ల గర్వాన్ని, స్వాభిమానాన్ని నింపింది. ఇది సమాజంలో నూతన చైతన్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని సృష్టించింది (ఇది ఇతరులపై ద్వేషం కాదు, తమ అస్తిత్వం పట్ల సానుకూల భావన).

3. **సామాజిక సమరసతకు బలం:**

యాత్ర అంతటా, అంటరానితనానికి వ్యతిరేకంగా, సామాజిక సమానత్వం కోసం ఇచ్చిన బలమైన సందేశం, క్షేత్రస్థాయిలో గణనీయమైన ప్రభావాన్ని చూపింది.

- **కుల వివక్షపై నైతిక దాడి:** సాధు సంతులు, ధార్మిక నాయకులు స్వయంగా కుల వివక్షను ఖండించడం, దళిత సోదరులతో కలిసి యాత్రలో పాల్గొనడం, సమాజంలో ఒక బలమైన సానుకూల సందేశాన్ని పంపింది.
- **అడ్డుగోడల పతనం:** అనేక గ్రామాలలో, యాత్ర స్ఫూర్తితో, కులాల మధ్య ఉన్న అడ్డుగోడలు కొంతమేరకైనా తొలగిపోయాయి. సహపంక్తి భోజనాలు, ఉమ్మడి ఆలయ ప్రవేశాలు వంటివి పెరిగాయి.

4. **సేవా కార్యక్రమాలకు ప్రేరణ:**

యాత్ర సందర్భంగా వ్యక్తమైన అపూర్వమైన ప్రజా చైతన్యం, VHP, RSS మరియు ఇతర సంస్థలను సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరింపజేయడానికి ప్రేరేపించింది. ముఖ్యంగా, గ్రామీణ, గిరిజన, వెనుకబడిన ప్రాంతాలలో విద్య, ఆరోగ్యం, స్వావలంబన రంగాలలో నూతన ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి.

5. **సంఘ పరివార్ సంస్థల విస్తరణ:**

ఏకాత్మతా యాత్ర సాధించిన అఖండ విజయం, దానిని నిర్వహించిన విశ్వ హిందూ పరిషత్‌కు, దాని వెనుక ఉన్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు, వాటి అనుబంధ సంస్థలకు దేశవ్యాప్తంగా అపారమైన ఆదరణను, గుర్తింపును తెచ్చిపెట్టింది. స్వయం సేవకులలో నూతన ఉత్సాహాన్ని నింపింది. సంఘ్ నిర్మాణం మరింత విస్తరించడానికి, బలోపేతం కావడానికి ఈ యాత్ర ఒక కీలకమైన మైలురాయిగా నిలిచింది.

ఈ విధంగా, ఏకాత్మతా యాత్ర, భారత జాతీయ జీవనంలోని ప్రతి కోణాన్ని - సాంస్కృతికం, సామాజికం, భావోద్వేగం, చివరికి పరోక్షంగా రాజకీయం - కూడా లోతుగా ప్రభావితం చేసింది. అది దేశ చరిత్రలో ఒక సానుకూల పరివర్తనకు నాంది పలికింది.

**ఏకాత్మతా దీపం – నిరంతరం వెలిగే జాతీయ జ్యోతి**

1983 నాటి విశ్వ హిందూ పరిషత్ ఏకాత్మతా యాత్ర, స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఒక అపూర్వమైన, అనితరసాధ్యమైన, అత్యంత విజయవంతమైన జాతీయ సమైక్యతా మహోద్యమం. అది రాజకీయాలకు అతీతంగా, కేవలం సాంస్కృతిక, ఆధ్యాత్మిక పునాదులపై, కోట్లాది మంది భారతీయుల హృదయాలను ఏకం చేసిన ఒక పవిత్ర యజ్ఞం.

ఆ యాత్ర, భారతదేశపు అసలైన బలం దాని సైనిక శక్తిలోనో, ఆర్థిక సంపదలోనో కాదని, దాని అఖండమైన, సనాతనమైన సాంస్కృతిక ఐక్యతలోనే ఉందని ప్రపంచానికి చాటిచెప్పింది. అది డాక్టర్ హెడ్గేవార్ కలలుగన్న 'సంఘటిత హిందూ సమాజం', శ్రీ గురూజీ ఆకాంక్షించిన 'సాంస్కృతిక జాతీయవాదం' కేవలం సిద్ధాంతాలు కావని, అవి ఆచరణ సాధ్యమైన వాస్తవాలని నిరూపించింది.

ఏకాత్మతా యాత్ర వెలిగించిన జాతీయ సమైక్యతా దీపం, ఈ రోజు కూడా మనకు మార్గనిర్దేశం చేస్తూనే ఉంది. దేశం మళ్ళీ ఎప్పుడైనా విచ్ఛిన్నకర శక్తుల సవాళ్ళను ఎదుర్కొన్నప్పుడు, ఆ యాత్ర యొక్క స్ఫూర్తి, అది అందించిన ఐక్యతా సందేశం మనల్ని ముందుకు నడిపిస్తాయి.

**రచన: భూక్యా గోపినాయక్**

# మీ సేవలు ఇక చాలు...

**మొదటిపేజీ తరువాయి...**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వేగంగా జరుగుతున్న మార్పుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కంపెనీ మానవ వనరుల విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెట్టి ఒక బ్లాగ్ పోస్ట్ లో వెల్లడించారు. కంపెనీ పనితీరు బలంగా ఉన్నప్పటికీ, ఇంటర్నెట్ తర్వాత ఏఐ అత్యంత పరివర్తనాత్మక సాంకేతికతగా మారిందని, ఇది కంపెనీ కార్యకలాపాలను పునర్నిర్మిస్తున్నదని ఆమె పేర్కొన్నారు. ఈ తొలగింపులు సంస్థ సామర్థ్యాన్ని పెంపొందించడంలో భాగంగా, ఏఐపై దృష్టి సారించే పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగమని తెలిపారు. మొత్తం 14,000 కార్పొరేట్ ఉద్యోగాలను తగ్గించే ప్రణాళికలో ఈ లేఆఫ్‌లు ఒక భాగమని అమెజాన్ స్పష్టం చేసింది. ఉద్యోగాలు కోల్పోయిన వారికి 90 రోజుల పూర్తి జీతం, ప్రయోజనాలు, అలాగే ప్రత్యేక సెవరెన్స్ ప్యాకేజీ అందిస్తామని అంతర్గత మెమోలో తెలిపారు. కరోనా మహమ్మారి అనంతరం విస్తరణ నెమ్మదించడంతో అమెజాన్ ఖర్చులను తగ్గించుకునే చర్యల్లో ఉంది. ఇందులో భాగంగా మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, అవసరం లేని ప్రాజెక్టులను మూసివేయడం, ఉద్యోగులను పూర్తిస్థాయిలో ఆఫీస్‌కు రావాలని ఆదేశించడం వంటి చర్యలు చేపట్టింది. ఈ ఏడాది ప్రారంభంలో రిటైల్ విభాగంలో నియామకాలను నిలిపివేసిన అమెజాన్, జూలైలో తమ క్లౌడ్ విభాగమైన అమెజాన్ వెబ్ సర్వీసెస్ లో కూడా లేఆఫ్‌లను ప్రకటించింది. మైక్రోసాఫ్ట్, మెటా వంటి ఇతర టెక్ దిగ్గజాలు కూడా ఏఐ, ఆటోమేషన్ కారణంగా ఉద్యోగులను తొలగిస్తున్న నేపథ్యంలో, అమెజాన్ కూడా అదే దిశగా పయనించడం టెక్ రంగంలో ఆందోళనకు కారణమైంది.



## త్వరలో భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం


- ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి అని ప్రశంస
- నాకు తండ్రి లాంటి వారని అభివర్ణించిన ట్రంప్
- త్వరలోనే ట్రేడ్ డీల్ పై రెండు దేశాల సంతకాలు
- డీల్ కుదిరితే మళ్లీ తగ్గనున్న భారత్ పై ఆంక్షలు

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

భారత్‌తో అతి త్వరలోనే వాణిజ్య ఒప్పందం జరగనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. బుధవారం దక్షిణ కొరియాలో జరుగుతున్న ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కార్పొరేషన్ (అపెక్) సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ చాలా మంచి వ్యక్తి అని, నాకు తండ్రిలాంటి వారని ఈ సందర్భంగా ట్రంప్ అభివర్ణించారు. ఇప్పటికే ఆలస్యమైన భారత్-అమెరికా ట్రేడ్ డీల్ పై రెండు దేశాలు సిద్ధమయ్యాయని ట్రంప్ తెలిపారు. గత కొంతకాలంగా పాడి, వ్యవసాయ రంగాల్లో మార్కెట్ యాక్సెస్ ఇవ్వకపోవడం, భారత్ విధించిన భారీ సుంకాలు, రష్యా నుంచి చమురు కొనుగోళ్లు వంటి అంశాల కారణంగా చర్చలు నిలిచిపోయాయి. అయితే తాజాగా వాణిజ్య చర్చలు మళ్లీ వేగం పుంజుకున్నాయని ట్రంప్ స్పష్టం చేశారు. నవంబర్ చివరినాటికి ఈ ఒప్పందం కుదిరే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరితే ప్రస్తుతం భారత్ వస్తువులపై ఉన్న 50 శాతం టారిఫ్ 15-16 శాతానికి తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అలాగే రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు తగ్గనున్నాయని ట్రంప్ ఇటీవల వెల్లడించారు. "త్వరలోనే భారత్ రష్యా ఆయిల్ కొనుగోళ్లు పూర్తిగా నిలిపేస్తుందని భారత్ ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు" అని ఆయన చెప్పారు. మోదీ-ట్రంప్ స్నేహం మరోసారి అంతర్జాతీయ వేదికపై చర్చనీయాంశంగా మారింది.

## జమైకాకు హరికేన్ ముప్పు

**మొదటిపేజీ తరువాయి...**



ఇప్పుడు డేంజర్ జోన్ లో ఉందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. కరేబియన్ దీవుల్లో ఉన్న జమైకా దేశమంతా జలమయంగా మారిపోయింది. ఈ హరికేన్ ముప్పు కుంభవృష్టిని తలపిస్తోంది. ఎడతెరిపి లేని వానలతో ఎక్కడ చూసినా దేశమంతా జలదిగ్బంధంగా మారిపోయింది. ఈ ప్రభావంతో జనజీవన వ్యవస్థ దాదాపు అతలాకుతలంగా మారింది. ప్రజలు ఎంచేయాలో దిక్కుతోచక,ఆందోళన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను చవిచూస్తున్నారు. జమైకాలోని దేశ ప్రజలు ఈ సందర్భంలో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు వెళ్లాలని ప్రభుత్వ అధికారులు తెలిపారు.



## కెనడాలో బిష్ణోయ్ గ్యాంగ్ మర్డర్

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

కెనడాలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ మరో విధ్వంసానికి పాల్పడింది. భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త దర్శన్ సింగ్ సహసి హత్యకు గురయ్యారు. సోమవారం అబోట్స్ ఫోర్డ్ లోని సహసి (66) ఇంటి వెలుపల జరిగిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు.దర్శన్‌ను తామే చంపామని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. దీనికి సంబంధించి బిష్ణోయ్ గ్యాంగ్‌లో సభ్యుడైన గోల్డీ ధిల్లాన్ సోషల్ మీడియాలో పోస్టు షేర్ చేశాడు. సహసి మాదకద్రవ్యాల వ్యాపారంలో భాగస్వామి కావడంతో డబ్బు డిమాండ్ చేయగా, అందకపోవడంతో హత్య చేసినట్లు బిష్ణోయ్ గ్యాంగ్ అంగీకరించింది. ఇదిలాఉండగా, పారిశ్రామికవేత్త సహసి తన ఇంటి వెలుపల ఉన్న కారు వద్దకు వెళ్తుండగా, అప్పటికే అక్కడ మరో కారులో దుండగుడు కాపు కాచి ఉన్నట్లు ప్రాథమిక విచారణలో స్పష్టమైంది. కాల్పుల తర్వాత పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేలోపే సహసి ప్రాణాలు కొల్పోయారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే బిష్ణోయ్ గ్యాంగ్ తామే ఈ హత్య చేశామని ప్రకటించడం కొసమెరుపు. మరోవైపు 1991లో సహసి కెనడాకు వెళ్లి , తొలుత చిన్న ఉద్యోగిగా పనిచేస్తూ , తర్వాత నష్టాల్లో ఉన్న ఓ వస్త్ర యూనిట్‌లో వాటా సంపాదించారు. క్రమేపీ తర్వాత దాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించారు. సహసి హత్య నేపథ్యంలో కెనడాలో భారతీయుల భద్రతపై మరోసారి భయాందోళన నెలకొంది.

**పంజాబీ గాయకుడే లక్ష్యంగా కాల్పులు..**

కెనడాలోని పంజాబీ గాయకుడు చాని నట్టన్ ఇంటి వెలుపల కాల్పులు జరిగాయి. దీనికి కూడా బిష్ణోయ్ గ్యాంగ్ అంగీకరిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. గోల్డీ ధిల్లానే సోషల్ మీడియాలో పోస్టు చేశారు. నట్టన్‌తో తమ గ్యాంగ్‌కు వ్యక్తిగతంగా ఎలాంటి శత్రుత్వం లేదని పేర్కొంటూ , గాయకుడు సర్దార్ ఖేరాతో నట్టన్‌కు పెరుగుతున్న సాన్నిహిత్యం వల్లే అతన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపాడు. ఖేరాతో కలిసి పనిచేసే ఏ గాయకుడికైన తాము ఈలాంటి చర్యలే తీసుకుంటామని హెచ్చరించారు. భారత్‌తోపాటు విదేశాల్లో హత్యలు, దోపిడీలు, ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి అంతర్జాతీయ కార్యకలాపాలతో సంబంధం ఉన్న ఈ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఇటీవల కెనడా ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. ఈ గ్యాంగ్ ఆగడాలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో ఆ గ్యాంగ్‌ను ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

## బ్రెజిల్‌లో డగ్స్ పై అపరేషన్.. 64 మంది మృతి


- డ్రగ్స్ అక్రమ రవాణా ముఠాలపై ఉక్కుపాదం
- ఆపరేషన్ లో 64 మంది మృతి- 81 మంది అరెస్ట్
- నేరస్తుల నుంచి 93 రైఫిళ్లు స్వాధీనం
- దాడుల నేపథ్యంలో 46 స్కూల్స్ మూసివేత



**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

బ్రెజిల్ లో డ్రగ్స్ అక్రమ రవాణా ముఠాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. రాజధాని రియో డి జనీరో లో మంగళవారం భారీ అపరేషన్ చేపట్టింది. దేశంలోని అతిపెద్ద మాదకద్రవ్యాల అక్రమ రవాణా ముఠా రెడ్ కమాండ్ ను లక్ష్యంగా చేసుకొని పోలీసులు, సైన్యం చర్యలు తీసుకుంది. ఉదయం ప్రారంభమైన ఈ దాడులు కొన్ని గంటల పాటు నిర్వహించారు. ఉగ్రరూపం దాల్చిన కాల్పుల్లో నలుగురు భద్రతా సిబ్బందితో సహా 64 మంది మృతి చెందారు. మరో 81 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండోచ్చని రియో సివిల్ పోలీసు వర్గాలు తెలిపాయి. ఇదిలాఉండగా , బ్రెజిల్‌లో 2,500 మంది పోలీసులు, సైనికులతో ఈ భారీ ఆపరేషన్ నిర్వహించింది. సాయుధ వాహనాలు, హెలికాప్టర్లు, డ్రోన్లతో విస్తృతంగా దాడులు చేపట్టారు. నేరస్థుల వద్ద నుంచి 93 రైఫిళ్లు, పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి, అరటన్నుకు పైగా మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. దాడుల సమయంలో డ్రగ్ ముఠా సభ్యులు పోలీసులపై డ్రోన్ల సహాయంతో ప్రతిదాడులు చేశారని అధికారులు తెలిపారు. అయినప్పటికీ వెనుకడుగు వేయకుండా ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. రియో చరిత్రలో ఇదే అతిపెద్ద పోలీసు ఆపరేషన్‌గా గవర్నర్ క్లాడియో కాస్ట్రో ప్రకటించారు. దాడుల భయంతో సమీపంలోని 46 పాఠశాలలను మూసివేసినట్లు రియో విద్యాశాఖ ప్రకటించింది. ప్రజలు బయటకు రావడానికే భయపడినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఈ దాడులకు ప్రతిస్పందనగా ముఠా సభ్యులు ఉత్తర, ఆగ్నేయ రియోలో పలు మార్గాలను దిగ్బంధించారు. సుమారు 70 బస్సులను నిలిపివేయడంతో నగర రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. దీంతో ఈ హింసాత్మక ఘటనల వల్ల భారీ ఆస్తి నష్టం సంభవించింది. ఇదిలా ఉండగా, పోలీసులు ఈ దాడులను మానవ హక్కుల సంస్థలు తీవ్రంగా ఖండించాయి. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం ఈ ఆపరేషన్‌పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, స్వతంత్ర దర్యాప్తు జరపాలని కోరింది. హ్యూమన్ రైట్స్ వాచ్ బ్రెజిల్ డైరెక్టర్ సీసార్ మయోజన్ మాట్లాడుతూ, ఇది "భారతీయ చరిత్రలో ఒక విషాదకర ఘటన" అని పేర్కొన్నారు. ఈ ఘటనపై పారదర్శక దర్యాప్తు జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఈఫిల్ టవర్ కూల్చేస్తారా..!



**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచ ఏడు వింతల్లో ఒకటి, 136 సంవత్సరాల కంటే ఎక్కువ చరిత్ర కలిగిన ప్రఖ్యాత ఈఫిల్ టవర్ పై ఒక వార్త కలకలం రేగింది. లవ్ సిటీగా ప్రసిద్ధి చెందిన పారిస్ నగరంలో "2026లో ఫ్రెంచ్ ప్రభుత్వం ఈఫిల్ టవర్‌ను కూల్చివేయబోతోందట!" అనే వార్త సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ప్రేమకు చిహ్నంగా,నిత్యం పర్యాటకులతో సందడిగా నిలిచిన ఈ టవర్ కూలిపోతుందనే వార్తను అనేక దేశాల నెటిజన్లు నమ్మేశారు. కూల్చివేతకు సంబంధించి ఏలాంటి ఆధారాలు లేకపోవడంతో , ఇది పూర్తిగా ఫేక్ న్యూస్ అని ఫ్రెంచ్ అధికారులు స్పష్టం చేశారు. ఈఫిల్ టవర్ 'లీజ్' గడువు ముగిసిందని, నిర్వహణ ఖర్చులు అధికమవుతున్నాయని, నిర్మాణం బలహీనంగా మారిందని, పర్యాటకులు తగ్గిపోతున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో 2026లో టవర్‌ను కూల్చేసి, దాని స్థానంలో వాటర్ స్లైడ్, కన్సర్ట్ హాల్ లేదా "పారిస్ బర్నింగ్ మ్యాన్ ఫెస్టివల్" వేదికను నిర్మిస్తారని పేర్కొన్నారు. ఈ పోస్టులు చాపకింద నీరులా వైరల్ అవుతూ అంతర్జాతీయ స్థాయిలో చర్చకు ఊపందుకుంది. మరోవైపు ఫ్రాన్స్ లో ఖర్చుల తగ్గింపు, ధనవంతులపై పన్ను పెంపు డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయి. అక్టోబర్ 2, 2025న ఈఫిల్ టవర్‌ను భద్రతా కారణాలతో తాత్కాలికంగా మూసివేయడంతో, "ఇదే కూల్చివేతకు మొదటిదశ" అని సోషల్ మీడియాలో మరింత ప్రచారం మొదలైంది. ఈఫిల్ టవర్ మేనేజ్‌మెంట్ కంపెనీ 'SETE' ఈ వార్తను ఖండించింది. "టవర్ సక్రమంగా నిర్వహణలో ఉంది. కూల్చివేత గురించి ఎటువంటి నిర్ణయం లేదు" అని వారు స్పష్టం చేశారు. ఈ క్రమంలో 136 ఏళ్ల చరిత్ర కలిగిన ఈఫిల్ టవర్ గతంలో కూడా పలు సార్లు తాత్కాలికంగా మూసివేయబడింది . 2015లోని పారిస్ టెర్రర్ దాడులు, కోవిడ్19 సమయంలో, అలాగే కార్మిక సమ్మెలు జరిగినప్పుడు. ప్రతి సారి భద్రతా కారణాలతో తాత్కాలికంగా మూసి, తిరిగి ప్రారంభించారు. అందువల్ల పారిస్ వాసులు ఈ వార్తను పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఇతర దేశాల ప్రజలు మాత్రం నమ్మి సోషల్ మీడియాలో విస్తృతంగా కామెంట్లు చేశారు. ప్రతి సంవత్సరం కోట్లాది మంది పర్యాటకులు దీనిని సందర్శిస్తారు. ఇలాంటి చారిత్రాత్మక నిర్మాణాన్ని ఫ్రెంచ్ ప్రభుత్వం కూల్చేస్తుందనడం అసంబద్ధమని నిపుణులు సైతం వ్యక్తం చేస్తున్నారు. అందుకే సోషల్ మీడియాలో చూసే ప్రతి వార్తను నమ్మే ముందు నిజానిజాలు తెలుసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే ఇలాగే ప్రపంచం మొత్తాన్ని ఒక అబద్ధం నమ్మించగలదని "ఈఫిల్ టవర్ కూల్చేస్తారట!" అనే ఈ ఫేక్ న్యూస్ నిరూపిస్తోంది.


## 2026 బంగ్లా రాజకీయాల్లో పోటీ చేస్తా

- హస్తినలో హాయిగా ఉన్నానన్నా హసీనా
- న్యూఢిల్లీలో షేక్ హసీనా సంచలన వ్యాఖ్యలు
- బంగ్లాదేశ్ కు తిరిగి వెళతానని ప్రకటన
- తనపై యూనస్ సర్కార్ వ్యాఖ్యలను ఖండన



**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

తాను ఢిల్లీలో స్వేచ్ఛగా జీవిస్తూన్నానని, 2026లో జరగనున్న జాతీయ ఎన్నికల్లో తాను పోటీ చేయబోతున్నట్లు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రకటించారు. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మా పార్టీ ఎన్నికల్లో పాల్గొనకపోతే, లక్షలాది మంది మద్దతుదారులు ఎన్నికలను బహిష్కరిస్తారని ఆమె హెచ్చరించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై, తన భవిష్యత్తు ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. గతేడాది బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో జరిగిన హింసాత్మక ఘటనల తర్వాత, 2024 ఆగస్టు 5న దేశాన్ని విడిచి భారత్‌కు వచ్చిన ఆమె అప్పటినుంచి న్యూఢిల్లీలో నివసిస్తున్నారు. హసీనా మాట్లాడుతూ, "నాకు ఎదురైన దాడుల తర్వాత భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నా. అయితే నేను ఇక్కడ బంధించబడలేదు, స్వేచ్ఛగా జీవిస్తున్నా" అని పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనలతో రాజకీయంగా తాను లక్ష్యంగా మారినట్లు తెలిపారు. తాత్కాలిక ప్రభుత్వం అవామీ లీగ్‌పై విధించిన నిషేధం, పార్టీ నేతలపై కొనసాగుతున్న దాడులు తమ ఓటమిని తాము ఒప్పుకున్నట్లేనని హసీనా వ్యాఖ్యానించారు. తన పార్టీ ఆవామీ లీగ్‌పై విధించిన నిషేధాన్ని అంగీకరించడం లేదని స్పష్టం చేస్తూ, "మా కార్యకలాపాలు ఎప్పటిలాగే కొనసాగుతాయి. ప్రజల మద్దతు మాకు ఉంది" అని ఆమె అన్నారు. బంగ్లాదేశ్‌లో రాజకీయ స్థిరత్వం, రాజ్యాంగబద్ధ పరిపాలనకు తమ ప్రభుత్వం తిరిగి రావాలని కూడా హసీనా అభిప్రాయపడ్డారు. యూనస్ ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను హసీనా తీవ్రంగా ఖండించారు. "ఇది ఒక రాజకీయ కుట్ర మాత్రమే. నా వాదన వినిపించుకునే అవకాశం ఇవ్వకుండానే నాపై కేసులు వేశారు. కోర్టులు కూడా నాకు నోటీసులు ఇవ్వలేదు" అని ఆమె తెలిపారు. తనను బలహీనపరచడం, రాజకీయంగా పక్కన పెట్టడమే లక్ష్యమని పేర్కొన్నారు. మరోవైపు బంగ్లాదేశ్‌లో గత ఏడాది జరిగిన ఆందోళనల్లో 1,400 మంది మరణించారని ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొంది. ఈ హింస తర్వాత ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం ఆవామీ లీగ్‌ను నిషేధించి, దాని నేతలపై విచారణలు ప్రారంభించింది. అయితే ఆ నిర్ణయాన్ని అవామీ లీగ్ తీవ్రంగా వ్యతిరేకించింది. "నేను తిరిగి బంగ్లాదేశ్‌కి వెళతాను. కానీ అది ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగాకే. దేశ భవిష్యత్తును ఏ ఒక్క వ్యక్తి లేదా కుటుంబం నిర్ణయించకూడదు. ప్రజలే నిర్ణయించాలి," అని హసీనా స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని తన నివాసంలో ఆమె ప్రసంగం బంగ్లా రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీసింది.



## కుప్పకూలిన అమెరికా హెలికాప్టర్, ఫైటర్ జెట్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

దక్షిణ చైనా సముద్రంలో అమెరికా సైన్యానికి చెందిన ఒక ఫైటర్ జెట్, హెలికాప్టర్ అర్ధగంట వ్యవధిలోనే కుప్పకూలిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ఘటన అక్టోబర్ 26న మధ్యాహ్నం 2.45 గంటలకు చోటు చేసుకుందని అమెరికా నేవీ అధికారులు తెలిపారు. యూఎస్ఎస్ నిమిట్జ్ అనే విమాన వాహక నౌక నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఈ ప్రమాదాలు చోటు చేసుకోవడం ఆందోళన రేకెత్తించింది. మొదట MH60R సీ హాక్ హెలికాప్టర్ సముద్రంలో కూలిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే రక్షణ సిబ్బంది చేరుకొని హెలికాప్టర్‌లో ఉన్న ముగ్గురిని కాపాడారు. కేవలం 30 నిమిషాల వ్యవధిలోనే మరో ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం 3.15 గంటలకు బోయింగ్ ఎఫ్18 సూపర్ హార్నెట్ ఫైటర్ జెట్ అదే ప్రాంతంలో కుప్పకూలింది. ఇందులో ఉన్న ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. ఈ రెండు ప్రమాదాల నుంచి ఐదుగురిని కాపాడినట్లు అమెరికా నేవీ ప్రకటించింది. మరోవైపు ,ఈ ప్రమాదాలకు చెడు ఇంధనం కారణమై ఉండవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. టోక్యో ప్రయాణం సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, "ఈ ఘటనను దాచేందుకు ఏమీ లేదు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు పూర్తి స్థాయి దర్యాప్తు జరుగుతోంది" అని స్పష్టం చేశారు. యూఎస్ఎస్ నిమిట్జ్ ఇటీవల మధ్యప్రాచ్యంలో పహారా కాస్తూ, యెమెన్‌లోని హౌతి తిరుగుబాటుదారుల దాడులకు ప్రతిస్పందనగా అమెరికా చేపట్టిన చర్యల్లో భాగంగా పనిచేసింది. ప్రస్తుతం వాషింగ్టన్ రాష్ట్రంలోని నావల్ బేస్ కిట్సాప్ వైపు తిరిగి వెళ్తోంది. తాజా ఘటనతో కలిపి ఈ ఏడాదిలోనే అమెరికా నాలుగు ఎఫ్/ఎ18 ఫైటర్ జెట్లను కోల్పోయింది. గతంలో కూడా ఇలాంటి ఘటనలు నమోదయ్యాయి. డిసెంబరులో యూఎస్ఎస్ ట్రూమాన్ నౌకకు చెందిన ఫైటర్ జెట్‌ను గైడెడ్ మిసైల్ క్రూయిజర్ యూఎస్ఎస్ గెట్టిస్‌బర్గ్ ఢీకొట్టింది. ఏప్రిల్‌లో మరో ఎఫ్/ఎ18 జెట్ ట్రూమాన్ హ్యాంగర్ డెక్ నుండి జారి ఎర్ర సముద్రంలో పడిపోయింది. మేలో ల్యాండింగ్ సమయంలో జెట్ కేబుల్‌ను పట్టుకోలేక జారి సముద్రంలో పడింది. ఈ వరుస ప్రమాదాలపై అమెరికా నేవీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. "సాంకేతిక లోపాలా, నిర్వహణా సమస్యలా అనేది తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది," అని నేవీ ప్రతినిధులు పేర్కొన్నారు.



## బలూచ్ పై పాక్ దాడి 14 మంది హతం

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

పాకిస్తాన్ మరోసారి సొంత ప్రజలపై వైమానిక దాడులకు పాల్పడింది. ఉగ్రవాద వ్యతిరేక చర్యల పేరుతో బలోచ్ లిబరేషన్ ఆర్మీని లక్ష్యంగా చేసుకొని బుధవారం అర్ధరాత్రి చిల్తాన్ పర్వత ప్రాంతంలో భారీ బాంబు దాడులు జరిపింది. ఈ దాడుల్లో 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అనేక రహస్య స్థావరాలు, శిక్షణ శిబిరాలు పూర్తిగా ధ్వంసమైనట్లు పాక్ సైన్యం పేర్కొంది. బలూచిస్థాన్‌లో గత కొంతకాలంగా పాక్ సైన్యం, బలోచ్ వేర్పాటువాద గ్రూపుల మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. డ్రోన్లు, మోర్టార్లు, శతఘ్నులు ఉపయోగిస్తూ పాక్ బలగాలు ఆపరేషన్లు కొనసాగిస్తున్నాయి. బలోచ్ గ్రూపులు కూడా ప్రతిదాడులు నిర్వహిస్తూ సైనిక కాన్వాయ్‌లపై దాడులు కొనసాగుతున్నాయి . సహజ వనరుల నియంత్రణ, రాజకీయ స్వయం ప్రతిపత్తి కోసం బలోచ్ వేర్పాటువాదులు పోరాటం కొనసాగిస్తున్నారు. గతంలో కుజ్దార్ జిల్లాలోని జెహ్రీ ప్రాంతం ప్రస్తుతం ఉగ్రవాదుల ఆధీనంలో ఉందని, దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడమే తాజా ఆపరేషన్ లక్ష్యమని పాక్ సైనిక వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ దాడులతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు లోనవుతున్నారు. ఏ క్షణంలో బాంబు వచ్చి మీదపడుతుందోనన్న ఆందోళనతో ఇళ్లలోనే తలదాచుకుంటున్నారు. బలోచ్ లో మళ్లీ హింసా జ్వాలలు ఎగసిపడుతున్నాయి. పాక్ తాజా దాడులపై బలోచిస్తాన్ ఇప్పటివరకు స్పందించలేదు.

## యూటర్న్ తీసుకున్న రష్యా అయిల్ ట్యాంకర్

- అమెరికా ఆంక్షల ప్రభావంతో రష్యా యూటర్న్
- అక్టోబరు 20 రష్యా నుంచి బయలుదేరిన నౌక
- నవంబరు 21కి లావాదేవీలపై ట్రంప్ అల్టిమేటం



**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

రష్యా నుంచి భారత్‌కి బయలుదేరిన క్రూడాయిల్ ట్యాంకర్ ది ఫ్యూరియా మార్గమధ్యలోనే వెనక్కి తిరిగింది. ఈ నౌక అక్టోబర్ 28న డెన్మార్క్, జర్మనీ మధ్య ఉన్న జలసంధిలో పశ్చిమ దిశగా ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా యూటర్న్ తీసుకుని, బాల్టిక్ సముద్రంలో నిలిచిపోయింది. షిప్ ట్రాకింగ్ సంస్థ కెప్లర్ డేటా ఈ విషయాన్ని బుధవారం వెల్లడించింది. రష్యా చమురు దిగ్గజ సంస్థ రోస్నెఫ్ట్ పిజెఎస్సీ విక్రయించిన ముడిచమురును భారత్‌కు తీసుకురావాల్సి ఉంది. మాస్కో చమురు కంపెనీలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన కఠిన ఆంక్షల ప్రభావంతో ఈ నౌక నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే భారత రిఫైనరీల నుంచి రష్యా సంస్థలకు కొత్త ఆర్డర్లు నిలిచిపోవడం గమనార్హం. రష్యాలోని ఉరల్స్ ఆయిల్ ఫీల్డ్ నుంచి 7.3 లక్షల బ్యారెళ్ల క్రూడాయిల్ లోడుతో ది ఫ్యూరియా అక్టోబర్ 20న భారత్ వచ్చేందుకు బయలుదేరింది. ఈ ఆయిల్‌ను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ , భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఉపయోగించే గుజరాత్‌లోని సిక్కా పోర్ట్ కు నవంబర్ మధ్యలో చేరవలసి ఉంది. నౌక మార్గం ఆకస్మికంగా మార్పు జరిగింది. ఉక్రెయిన్, రష్యా మధ్య మూడేళ్లకు పైగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో, ఆయన రష్యాపై కఠిన ఆర్థిక ఆంక్షలు విధించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ యుద్ధ వైఖరిపై అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు తీవ్ర అసహనం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 22న రష్యా చమురు కంపెనీలు రోస్నెఫ్ట్, లుకాయిల్ తదితర సంస్థలపై కొత్త ఆంక్షలను ప్రకటించారు. రష్యా ఆయిల్ కొనుగోలు చేసే దేశాలు, సంస్థలు, వ్యక్తులపై కూడా ఆంక్షలు అమల్లోకి వస్తాయని ఆయన హెచ్చరించారు. మరోవైపు ట్రంప్ హెచ్చరిస్తూ, "రష్యా కంపెనీలతో లావాదేవీలు నవంబర్ 21 నాటికి ముగించాలి. ఆంక్షలను అతిక్రమిస్తే తీవ్రమైన పెనాల్టీలు విధిస్తాం" అని చెప్పారు. భారత రిఫైనరీలు రష్యా సంస్థలతో కొత్త ఒప్పందాలు తాత్కాలికంగా నిలిపివేశాయి. హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ , మిట్టల్ గ్రూప్ భాగస్వామ్యంలో నడుస్తున్న హెచ్ఈఎంఎల్ రిఫైనరీ మాత్రం రష్యా ముడి చమురును కొనుగోలు చేసినట్లు సమాచారం. ఆర్సెలార్ మిట్టల్ ఆధ్వర్యంలోని ఈ రిఫైనరీ ఆంక్షల పరిధిలో ఉన్న నౌకల ద్వారా గుజరాత్‌లోని ముంద్రా పోర్ట్ కు చమురును దిగుమతి చేసుకుంటోంది. అక్కడినుంచి పంజాబ్‌లోని గురు గోవింద్ సింగ్ రిఫైనరీకి పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తోంది. ఇది దేశంలో పదో అతిపెద్ద రిఫైనరీగా గుర్తింపు పొందింది. ఏటా సుమారు 11.3 మిలియన్ టన్నుల క్రూడాయిల్ ను శుద్ధి చేస్తుంది. అమెరికా ఆంక్షల పరిధిలో ఉన్న పలు నౌకలు జూలై నుంచి సెప్టెంబర్ మధ్యలో రష్యాలోని ముర్మాన్స్క్ ఆర్కిటిక్ పోర్ట్ నుంచి గల్ఫ్ ఆఫ్ ఒమన్ వరకు చమురును రవాణా చేస్తున్నాయి . ఈ లావాదేవీలను దాచిపెట్టేందుకు నకిలీ షిప్పింగ్ డాక్యుమెంట్లు, మార్పు చేసిన సిగ్నల్ డేటా వంటి మోసపూరిత పద్ధతులను ఉపయోగిస్తున్నట్లు ఆ పత్రిక వెల్లడించింది. ఉపగ్రహ చిత్రాలు, కస్టమ్స్ రికార్డులు, షిప్పింగ్ డేటా ఆధారంగా ఈ వివరాలు బయటకు వచ్చాయి. ప్రస్తుతం భారత్ దిగుమతి చేసుకునే క్రూడాయిల్‌లో మూడో వంతు రష్యా నుంచే వస్తోంది. 2022లో ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా చమురుపై పాశ్చాత్య దేశాలు ధర పరిమితులు విధించడంతో భారత్ భారీ డిస్కౌంట్‌పై ఆయిల్ కొనుగోలు చేస్తోంది. మాస్కో నుంచి బయలుదేరి మార్గమధ్యలో నిలిచిపోయిన ది ఫ్యూరియా నౌక, అమెరికా ఆంక్షల అసలు ప్రభావానికి ప్రతీకగా మారింది. రాబోయే వారాల్లో రష్యా చమురు సరఫరాలు మరింతగా తగ్గే ప్రమాదం ఉందని వాణిజ్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. "ఈ పరిణామాలు భారత్ ఇంధన వ్యూహంలో పెద్ద మార్పులకు దారితీయవచ్చు," అని నిపుణులు భావిస్తున్నారు.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
30.10.2025
www.manasarkar.com

# సొరంగంలోకి వరద నీరు
# వెలిగొండలో ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి...**

వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగంలో 7 కిలోమీటర్ల లోతులో మధ్యాహ్నం వరకూ ఎలాంటి ఇబ్బంది లేకుండానే లైనింగ్ పనులు కొనసాగాయి. తుపాను కారణంగా సమీప వాగుల నుంచి ఒక్కసారిగా భారీగా నీరు వచ్చి సొరంగంలోకి చేరటంతో, కొద్ది నిమిషాల్లోనే నీటి మట్టం వేగంగా పెరిగింది. దీంతో, కార్మికులు బయటకు వచ్చే మార్గం లేక చిక్కుకుపోయారు. వార్త తెలిసిన వెంటనే ప్రాజెక్టు అధికారులు, స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకొని రక్షణ చర్యలు చేపట్టారు. తక్షణ చర్యలతో అన్ని కార్మికులను సురక్షిత ప్రదేశాలకు తరలించారు. వారిని ముందుగా కృష్ణానది సమీపంలోని కొల్లం వాగు వద్దకు తరలించి, అక్కడి నుంచి బోట్ల ద్వారా శ్రీశైలానికి పంపే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన వార్త తెలుసుకున్న వెంటనే కార్మికుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కానీ ఎవరికి ఎలాంటి గాయాలు కానీ, ప్రాణనష్టం కానీ జరగలేదని అధికారులు స్పష్టం చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు అనేది ప్రకాశం, కర్నూలు, నెల్లూరు జిల్లాల ప్రజలకు జీవనాధారం అయిన భారీ నీటి పథకం. కృష్ణా నది నుంచి నీటిని సొరంగాల ద్వారా ఈ ప్రాంతాలకు తరలించే ఇంజనీరింగ్ అద్భుతంగా ఇది నిలిచింది. ప్రస్తుతం రెండో సొరంగంలో లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ సొరంగం ద్వారా రోజుకు లక్షల లీటర్ల నీరు తరలించే సామర్థ్యం ఉంది. ఈ ఘటన తర్వాత ప్రాజెక్టు అధికారులు సొరంగాల వద్ద భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని నిర్ణయించారు. తుపాన్ ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.



## ఆంధ్ర-తెలంగాణలలో పలు రైళ్లు రద్దు

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

మొంథా తుపాన్ సముద్ర తీరాన్ని దాటినా దాని ప్రభావం తెలుగు రాష్ట్రాలపై ఇంకా కొనసాగుతూనే ఉంది. దీంతో దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే అనేక రైళ్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. తాజాగా, బుధవారం మరో కీలక ప్రకటన చేసింది. విజయవాడ, గుంటూరు నుంచి తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని రైల్వే హెచ్చరించింది. తెలంగాణ పరిధిలోని డోర్నకల్ యార్డ్ లో భారీ వర్షాల కారణంగా నీరు నిలిచిపోవడంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో గుంటూరు-వికారాబాద్ మధ్య నడిచే పల్నాడు ఎక్స్ ప్రెస్ (రైలు నంబర్ 12747)ను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. అదేవిధంగా, విజయవాడ-సికింద్రాబాద్ మధ్య నడిచే శాతవాహన ఎక్స్ ప్రెస్ (రైలు నంబర్ 12713) కూడా రద్దు చేశారని అధికారిక ప్రకటనలో వెల్లడించారు. దీంతో గురువారం ఈ రైళ్లలో ప్రయాణానికి సిద్ధమైన ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని రైల్వే అధికారులు సూచించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు తగ్గుముఖం పట్టినా, తెలంగాణలో మాత్రం తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల దెబ్బకు రైల్వే రాకపోకలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తుపాను ప్రభావం కారణంగా తెలంగాణ రాష్ట్రంలో పలు రైళ్లు రద్దు కావడంతో పాటు రైళ్ల రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. దక్షిణ మధ్య రైల్వేతో పాటు తూర్పు తీర రైల్వే కూడా పలు రైళ్లను రద్దు చేసింది. రైల్వే అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, "ప్రయాణానికి ముందు రైల్వే అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌లో తాజా రాకపోకల సమాచారాన్ని తనిఖీ చేసుకోవాలి. లేకపోతే చివరి నిమిషంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది" అని సూచించారు. మొంథా తుపాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు రైల్వే సేవల్లో ఆటంకాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



## గుండ్లకమ్మ లో చిక్కుకున్న
## ఆరుగురిని కాపాడిన పోలీసులు

**అద్దంకి (ఏడీఎన్ఎన్) :**

ప్రకాశం జిల్లా అద్దంకి మండలంలో గుండ్లకమ్మ తాగునీటి పథకం వద్ద చోటుచేసుకున్న ఘటన ఉత్కంఠ రేపింది. వరద ప్రభావంతో చెట్టుపై చిక్కుకున్న ఆరుగురు సిబ్బందిని పోలీసులు సమర్థంగా రక్షించి ప్రాణాపాయంలోనుంచి బయటకు తీశారు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవ్వడమే కాకుండా, పోలీసుల వేగవంతమైన చర్యలపై ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

గుండ్లకమ్మ మంచినీటి పథకంలో ముగ్గురు ఉద్యోగులు పని చేస్తుండగా, ఆకస్మికంగా వరద నీరు పెరగడంతో వారు చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు మరో ముగ్గురు బోటులో వెళ్లారు. అయితే బోటు తిరగబడటంతో ఆరుగురూ చెట్టుపై ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, రక్షణ బృందాలు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించాయి. డ్రోన్ సాయంతో చెట్టుపై చిక్కుకున్న వారి స్థానాన్ని గుర్తించిన పోలీసులు అద్భుత ధైర్యంతో రక్షణ చర్యలు చేపట్టి, అందరినీ క్షేమంగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ ఘటనపై అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు కలెక్టర్, స్థానిక అధికారులు సమన్వయంతో రక్షణ చర్యలను వేగవంతం చేశారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్‌కుమార్ గుండ్లకమ్మ జలాశయాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఎస్ఈ అబు తాలెం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులు ఈ పరిశీలనలో పాల్గొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజల సురక్షిత బదిలీకి తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గుండ్లకమ్మ జలాశయం నుంచి నీటి విడుదలను పర్యవేక్షిస్తూ, "అధిక వర్షాల కారణంగా అవుట్‌ఫ్లోను 70,000 క్యూసెక్కుల నుంచి లక్ష క్యూసెక్కులకు పెంచుతున్నాం" అని తెలిపారు. అలాగే, దిగువ ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రకాశం, బాపట్ల కలెక్టర్లకు సూచించారు. మొంథా తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు, వరదలు ఉధృతంగా కొనసాగుతున్నాయి. నంద్యాల జిల్లాలోని హరిజనవాడ వద్ద మద్దిలేరు వాగులో ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. అలాగే శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలోని కంబిరిగాం వద్ద వరద ప్రవాహంలో యువకుడు కొట్టుకుపోయాడు. తుపాను ప్రభావంతో పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. ఒంగోలు 25 సెం.మీ., చీమకుర్తి 24 సెం.మీ., కందుకూరు, కావలి 22 సెం.మీ., దర్శి, అద్దంకి 19 సెం.మీ., మార్కాపురం 15 సెం.మీ., పొదిలి, ఆత్మకూరు 14 సెం.మీ., పోరుమామిళ్ల 13 సెం.మీ., ప్రస్తుతం నీటి మట్టం తగ్గుముఖం పట్టినా, అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, వరద ప్రాంతాలకు వెళ్లకూడదని హెచ్చరిస్తున్నారు.

# జిల్లాల పునర్వ్యవస్థీకరణపై వేగం పెంచిన ప్రభుత్వం



**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ అంశంపై నియమించబడిన కేబినెట్ సబ్ కమిటీ బుధవారం సచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు నారాయణ, అనిత, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు.


సమావేశానికి ముందు మంత్రి వర్గ ఉపసంఘం మంగళవారం సీఎం చంద్రబాబును కలిసి జిల్లాల పునర్వ్యవస్థీకరణపై చర్చించింది. ఆ సందర్భంగా సీఎం కొత్త జిల్లాల ఏర్పాటు, సరిహద్దుల మార్పు వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. సీఎం సూచనల ప్రకారం ముందుకు సాగేందుకు ఉపసంఘం అధికారులు, మంత్రులతో సమగ్రంగా చర్చించింది. గత ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సరిదిద్దడం ఈ సమావేశం ప్రధాన అంశమైంది. పాత జిల్లాల విభజన వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడమే తమ ప్రాధాన్యమని మంత్రులు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ ప్రకారం ఈ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే ఉపసంఘం సమర్పించిన నివేదికపై సీఎం కొన్ని మార్గదర్శకాలు జారీ చేశారని, వాటిని పరిగణనలోకి తీసుకుని తుది నివేదికను సిద్ధం చేయడానికి మరోసారి సమావేశమవుతామని పేర్కొన్నారు. తుది నివేదికను సిద్ధం చేసి త్వరలో సీఎంకు సమర్పించనున్నట్టు వెల్లడించారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను డిసెంబర్ 31లోపు పూర్తిచేయడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజల అవసరాలు, భౌగోళిక సౌలభ్యం, పరిపాలన సమర్థత ఆధారంగా కొత్త జిల్లాల సరిహద్దులను ఖరారు చేయనున్నట్టు చెప్పారు. ఈ సమావేశం తర్వాత అధికారులు, మంత్రులు కలిసి పలు జిల్లాల పరిపాలనా పటాలను సమీక్షించి, తుది నిర్ణయానికి ముందు స్థానిక ప్రజల అభిప్రాయాలను కూడా సేకరించనున్నట్లు సమాచారం.

# గోశాలను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాలనే ఆలోచన తప్పు

- బీఆర్. నాయుడు హయాంలో దెబ్బతిన్న గోశాలల నిర్వహణ
- తిరుమలలో జరిగే విషయాలన్నీ ప్రజలకు తెలియజేస్తా

**తిరుపతి (ఏడీఎన్ఎన్) :**

**తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) గోశాలల నిర్వహణపై రాజకీయ వేడి పెరిగింది. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ప్రస్తుత చైర్మన్ బీఆర్. నాయుడుపై తీవ్ర విమర్శలు చేశారు.**




బీఆర్. నాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత టీటీడీ ఆధ్వర్యంలో అతి గొప్పగా నిర్వహిస్తున్న గోశాలలు నిర్వీర్యం అవుతున్నాయని ఆయన ఆరోపించారు. "టీటీడీ గోశాలలను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాలనే ఆలోచన తప్పే కదా? ఇంత గొప్ప సంస్థకు చెందిన గోశాలలను బయటి వ్యక్తుల చేతుల్లోకి ఇవ్వడం సరైన నిర్ణయం కాదు," అని భూమన ప్రశ్నించారు. "గోశాల నిర్వహణ సరిగా లేదని బోర్డు దృష్టికి వచ్చిందని, టీటీడీ చైర్మన్ బీఆర్. నాయుడు స్వయంగా చెప్పారు. గోశాలల పర్యవేక్షణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వాలని ఆలోచన ఉందన్నారు. వచ్చే బోర్డు సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామంటున్నారు," అని భూమన వ్యాఖ్యానించారు. "నేను ఏప్రిల్ నెలలో గోశాలల్లో గోవుల మరణాలు జరుగుతున్నాయని చెప్పినప్పుడు నా మీద కేసులు పెట్టారు. అప్పుడు బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డిని నా మీద ఉసిగొల్పారు. గోశాలల పరిస్థితిని ప్రస్తావించినందుకు నాకు కేసులు వేస్తే, ఇప్పుడు ఇదే విషయం చెబుతున్న చైర్మన్‌పైనా కేసులు వేయాలా?" అని ప్రశ్నించారు. "నా మీద పెట్టిన కేసులన్నీ నన్ను భయపెట్టే ప్రయత్నమే. కానీ నేను వెనక్కి తగ్గను. తిరుమలలో జరుగుతున్న ప్రతి విషయాన్ని ప్రజలకు తెలియజేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను. బీఆర్. నాయుడు హయాంలో వైకుంఠ ఏకాదశి నిర్వహణ సరిగా జరగడం లేదు, గోశాలల పరిస్థితి దయనీయంగా మారింది. 70 ఏళ్ల చరిత్ర కలిగిన టీటీడీ గోశాలను ఇలా దెబ్బతీయడం విచారకరం," అని పేర్కొన్నారు. "తిరుమలలో జరుగుతున్న ప్రతి విషయాన్ని ప్రజల ముందుకు తీసుకువస్తూనే ఉంటాను. నేను చెప్పిన అంశాలు వాస్తవాలు. ఎవరు కేసులు పెట్టినా వెనుకడుగు వేయను. ప్రజా డబ్బుతో, భక్తుల విరాళాలతో నడిచే టీటీడీ వ్యవస్థలో అవినీతి, నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపడం నా బాధ్యత," అని స్పష్టం చేశారు. టీటీడీ గోశాలల నిర్వహణపై భూమన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం టీటీడీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై, గోశాలల ప్రైవేటీకరణపై ఆయన చేసిన ఆరోపణలకు టీటీడీ చైర్మన్ బీఆర్. నాయుడు స్పందించాల్సి ఉంది.

# 'లక్కీ డే' డ్రాలో రూ.240 కోట్లు

- లాటరీ విజేత ఏపీకి చెందిన అనిల్ కుమార్ బొల్లా
- 100 మిలియన్ దిర్హామ్స్ ... రూ.240 కోట్ల బహుమతి
- యూఏఈలో పన్ను రహిత లాటరీ సిస్టమ్
- అదృష్ట నంబర్‌గా తల్లి పుట్టినరోజు తేదీ

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**




అదృష్టం ఎప్పుడు, ఎలా మారుతుందో ఎవరూ ఊహించలేరు. యూఏఈలో నివసిస్తున్న ఓ సాధారణ భారతీయ యువకుడు ఒక్కసారిగా కోట్లకు అధిపతిగా మారి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అబుదాబిలో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కి చెందిన అనిల్ కుమార్ బొల్లా యూఏఈ చరిత్రలోనే అతిపెద్ద లాటరీని గెలుచుకున్నాడు.

ఈ లాటరీ విలువ ఏకంగా 100 మిలియన్ దిర్హామ్స్, అంటే భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ.240 కోట్లు. యూఏఈలో కొత్తగా ప్రారంభమైన జాతీయ లాటరీ వ్యవస్థ "లక్కీ డే డ్రా"లో అక్టోబర్ 18న జరిగిన డ్రా #251018లో అనిల్ కుమార్ పేరు విజేతగా ప్రకటించారు. ఫలితాలు వెలువడగానే అతడి జీవితమే తలకిందులైంది. సాధారణ ఉద్యోగి స్థాయి నుండి ఒక్కసారిగా కోటీశ్వరుడిగా మారి వార్తల్లో నిలిచాడు. ఈ "లక్కీ డే డ్రా" లాటరీ పూర్తిగా డిజిటల్ విధానంలో జరుగుతుంది. ప్రతి వ్యక్తి కేవలం Dh 100 (సుమారు రూ.2,460) చెల్లించి ఆన్‌లైన్‌లో టికెట్ కొనుగోలు చేస్తాడు. ప్రతి టికెట్‌కు ప్రత్యేక సంఖ్య కేటాయిస్తారు . డ్రా సమయంలో కంప్యూటర్ సిస్టమ్ ఆ సంఖ్యను యాదృచ్ఛికంగా ఎంచుకుంటుంది. మానవ ప్రమేయం లేకుండా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. యూఏఈ ప్రభుత్వం ఈ ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా పర్యవేక్షిస్తుంది. అనిల్ కుమార్ అదృష్టం ఇక్కడితో ఆగలేదు. యూఏఈలో లాటరీ గెలుచుకున్న వారికి ఏ విధమైన పన్ను ఉండదు. అంటే ఈ 100 మిలియన్ దిర్హామ్స్ మొత్తం అనిల్‌కే చెందుతుంది. అయితే, ఆయన ఈ మొత్తాన్ని భారతదేశానికి పంపితే మాత్రం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. భారత ఆదాయపు పన్ను చట్టం 1961 ప్రకారం, లాటరీ గెలుపుపై 30% పన్ను, దానిపై 15% సర్ ఛార్జ్ , అలాగే 4% ఆరోగ్య, విద్యా సెస్ కలిపి మొత్తం 35.88% వరకు పన్ను పడుతుంది. అంటే భారత్‌లో ఇదే లాటరీ గెలిచినా రూ.240 కోట్లలో దాదాపు రూ.86 కోట్లు పన్నుగా చెల్లించాల్సి వచ్చేది. విదేశాల్లో లాటరీ గెలిచిన ఎన్ఆర్ఐలకు పన్ను చెల్లించాలా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. పన్ను నియమం వ్యక్తి భారతదేశంలో నివాసితుడా లేదా అనేదానిపై ఆధారపడి ఉంటుంది. వ్యక్తి ఎన్ఆర్ఐ అయితే, ఆ డబ్బును భారతదేశానికి బదిలీ చేయకపోతే, పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ డబ్బును ఏ రూపంలోనైనా భారత్‌కి పంపితే పన్ను తప్పదు. తల్లి పుట్టినరోజు తేదీని లాటరీ నంబర్‌గా ఎంచుకోవడంతో అదృష్టం తనవైపు మొగ్గిందని అనిల్ కుమార్ తెలిపారు. ఆయన ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు, గత కొన్నేళ్లుగా అబుదాబిలో ఉద్యోగం చేస్తున్నారు. లాటరీ టికెట్లు కొనే అలవాటు ఉండటంతో ఈసారి తల్లి పుట్టినరోజు తేదీని చివరి నంబర్‌గా ఎంచుకోగా అదృష్టం తలుపు తట్టిందన్నారు. యూఏఈలో ఒక్క రూపాయి పన్ను చెల్లించాల్సిన అవసరం లేకపోవడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన అనిల్, భారత్‌లో అయితే దాదాపు రూ.90 కోట్ల వరకు ట్యాక్స్ కింద పోయేదని చెప్పారు. తల్లిదండ్రులను అబుదాబి తీసుకువచ్చి అక్కడే స్థిరపడాలని, కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు విరాళంగా ఇస్తానని, అలాగే ఓ లగ్జరీ కారు కొనుగోలు చేయాలనే ఆలోచన ఉందని తెలిపారు.

# విషం తాగి భార్యాభర్తలు ఆత్మహత్య

**భీమడోలు (ఏడీఎన్ఎన్) :**

**భీమడోలు మండలంలో చోటుచేసుకున్న విషాదకర ఘటన స్థానికులను షాక్‌కు గురిచేసింది. భార్యాభర్తలు కలిసి సెల్ఫీ వీడియో తీసి, ఆ వీడియోను స్నేహితులు, కుటుంబ సభ్యులకు పంపిన తర్వాత విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.**

ఈ ఘటనలో భార్య భానుపూర్ణిమ (22) సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందగా, భర్త సుధాకర్ మంగళవారం తెల్లవారుజామున ఆసుపత్రిలో ప్రాణాలు కోల్పోయాడు. వీరి మూడేళ్ల చిన్న కుమారుడు ఇప్పుడు అనాథగా మిగిలిపోయాడు. భీమడోలు ప్రాంతానికి చెందిన సుధాకర్, గుండుమోలు భానుపూర్ణిమ ప్రేమించుకుని కొన్ని సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. సాదాసీదా కుటుంబ జీవితం గడుపుతున్న వీరి మధ్య ఇటీవల విభేదాలు తలెత్తాయి. అదే గ్రామానికి చెందిన కటారి మోహన్ అనే వ్యక్తి భానుపూర్ణిమతో సన్నిహితంగా ఉండటం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. సుమారు 15 రోజుల క్రితం మోహన్ మాయమాటలు చెప్పి భానుపూర్ణిమను తీసుకెళ్లడంతో, సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, భీమడోలు పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కొద్ది రోజుల తర్వాత భానుపూర్ణిమ తిరిగి ఇంటికొచ్చింది, మరల ఆమె జీవితంలో మోహన్ తిరిగి ప్రవేశించడతో దంపతులకు తీవ్రమైన మానసిక వేదన కలిగించింది. ఆ వేదన తాళలేకపోయిన సుధాకర్, భానుపూర్ణిమలు శనివారం రాత్రి సెల్ఫీ వీడియో తీసి తమ స్నేహితులు, బంధువులకు పంపారు. "మా జీవితంలో మోహన్ దురాక్రమణ వల్ల మేము బతకలేకపోతున్నాం" అంటూ వీడియోలో చెబుతూ, తర్వాత ఇద్దరూ విషం తాగారు. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించినా, భానుపూర్ణిమ సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త సుధాకర్ మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో మరణించాడు. ఈ



ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. భానుపూర్ణిమ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా భీమడోలు పోలీసులు కటారి మోహన్‌పై కేసు నమోదు చేశారు. మోహన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ ఘటన కుటుంబ వ్యవస్థలో పెరుగుతున్న అస్థిరతను, సోషల్ మీడియా ప్రభావాన్ని మరోసారి గుర్తు చేస్తోంది. "నా జీవితం - నా ఇష్టం" అనే పేరుతో వ్యక్తిగత స్వేచ్ఛలు పెరుగుతున్నప్పటికీ, తాత్కాలిక ఆవేశం, అవమానం అనే భావనలతో ప్రాణాలను త్యజించే ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.



## జిల్లావ్యాప్తంగా నేలకొరిగిన
## 300 విద్యుత్ స్తంభాలు

**అమలాపురం (ఏడీఎన్ఎన్) :**

మొంథా తుపాను తీవ్రత ఊహించినంతగా లేకపోయినా, కోనసీమ జిల్లాలో విద్యుత్ సరఫరా, రవాణా వ్యవస్థలు అంతరాయం కలిగాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బుధవారం ఆయన అమలాపురం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై తుపాను ప్రభావంపై సమీక్ష నిర్వహించారు.

ఈదురుగాలుల ప్రభావంతో కోనసీమ జిల్లావ్యాప్తంగా 300 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయనీ, వాటి మరమ్మతు పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు చెప్పారు. అలాగే 134 కిలోమీటర్ల మేర రహదారులపై పడిపోయిన చెట్లను తొలగించి రాకపోకలు పునరుద్ధరించామని వివరించారు. ఆర్టీసీ బస్సు సేవలు యథావిధిగా పునఃప్రారంభమయ్యాయని తెలిపారు. తుపాను సమయంలో జిల్లాలో 400 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 10,150 మందికి ఆశ్రయం కల్పించామని, వీరికి కుటుంబానికి రూ.3,000 చొప్పున, ఒంటరి సభ్యులకు రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నామని వివరించారు. అదే విధంగా గత ఐదు రోజులుగా సముద్రంలో చేపల వేట నిలిపివేయడం వల్ల జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులు, చేనేత కార్మిక కుటుంబాలకు 50 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయాలని సీఎం ఆదేశించారని మంత్రి వెల్లడించారు. తుపాను కారణంగా జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయి అని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో మొంథా తుపాను సహాయక చర్యల ప్రత్యేక అధికారి వి. విజయరామరాజు, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, ఎంపీ జి. హరీష్ మాధుర్, ఎస్పీ రాహుల్ మీనా, జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, నిమ్మకాయల చినరాజప్ప, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు, డీఆర్వో కె. మాధవి తదితరులు పాల్గొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు తుపాను ప్రభావిత ప్రాంతాల పునరుద్ధరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ప్రజల భద్రతకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.

## మాజీ సీఎం జగన్‌కు ఊరట

**మొదటిపేజీ తరువాయి....**

అంతేకాకుండా, లండన్ పర్యటన సమయంలో జగన్ ఇచ్చిన నంబర్‌కు మూడు సార్లు కాల్ చేసినా పనిచేయలేదని సీబీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ కారణంగా బెయిల్ షరతులు ఉల్లంఘించారంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సీబీఐ వాదనల్లో, ఉద్దేశపూర్వకంగానే పని చేయని నంబర్ ఇచ్చారని ఆరోపించింది. అయితే జగన్ తరఫు న్యాయవాదులు మాత్రం, "జగన్ పర్యటన పూర్తయింది, ఆయన భారత్‌కు తిరిగి వచ్చేశారు. బెయిల్ షరతులను ఉల్లంఘించలేదని స్పష్టంగా చెప్పగలం" అని వాదించారు. రెండు వర్గాల వాదనలు విన్న తర్వాత సీబీఐ కోర్టు సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. దీంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఊరట లభించింది.

## తుపాను మృతుల కుటుంబాలకు
## రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

**మొదటిపేజీ తరువాయి...**

రాష్ట్రవ్యాప్తంగా తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఐదు రోజుల్లోగా పూర్తి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి, రైతులకు తగిన సూచనలు చేయాలని సీఎం నిర్దేశించారు. సాయంత్రం సచివాలయంలోని ఆర్టీజీ కేంద్రంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తుపాన్ వల్ల రాష్ట్రంలోని 304 మండలాల్లోని 1,825 గ్రామాల్లో సుమారు 87 వేల హెక్టార్లలో పంట నష్టం సంభవించిందని అధికారులు తెలిపారు. వీటిలో 59 వేల హెక్టార్లలో వరి, ప్రత్తి, మొక్కజొన్న, మినుము వంటి పంటలు నీటమునిగాయి. మొత్తం 78,796 మంది రైతులు నష్టపోయారని, 42 పశువులు చనిపోయాయని ప్రాథమిక నివేదికలు వెల్లడించాయి. అధికారులు ఇది తాత్కాలిక అంచనా అని , వాస్తవ నష్టం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణను వేగంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. బుధవారం రాత్రి కల్లా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి, గురువారం నాటికి రహదారుల మరమ్మతులు పూర్తి చేయాలి అని సూచించారు. ఏపీఎస్ ఆర్టీసీ సర్వీసులు యథావిధిగా కొనసాగాలని స్పష్టం చేశారు. అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేసి నీరు నిలిచిపోకుండా చూడాలని, పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లోని ప్రజలకు తక్షణమే బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డయేరియా కేసులు నమోదు కాకుండా రూరల్ వాటర్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒంగోలు పట్టణంలోని పలు కాలనీలు నీట మునగడంపై ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు పనితీరుపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోల్చితే ఇలాంటి పరిస్థితి ఎందుకు ఏర్పడిందని ప్రశ్నించారు. భవిష్యత్‌లో ఇలాంటి పాలనా వైఫల్యాలు జరగకూడదని హెచ్చరించారు. తుపాన్ రక్షణ చర్యల నుంచి పాఠాలు నేర్చుకుని, ప్రతి జిల్లాలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,209 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంతో 1.16 లక్షల మందికి ఆశ్రయం కల్పించబడింది. మొత్తం 249 మండలాలు, 1,434 గ్రామాలు, 48 మున్సిపాలిటీలలో 18 లక్షల మంది తుపాన్ ప్రభావానికి లోనయ్యారు. పంచాయతీరాజ్ రహదారులు 380 కి.మీ., ఆర్ అండ్ బీ రహదారులు 2,294 కి.మీ. పొడవున దెబ్బతిన్నాయి. వీటితోపాటు 14 బ్రిడ్జిలు, కల్వర్టులు దెబ్బతిని రూ.1,424 కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. ఇరిగేషన్ విభాగంలో రూ.16.45 కోట్ల, రూరల్ వాటర్ సప్లయ్ విభాగంలో రూ.36 కోట్ల నష్టం నమోదైంది. సురక్షిత ప్రాంతాలకు 3,175 మంది గర్భిణీలను తరలించగా, 2,130 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. రహదారులపై పడిపోయిన 380 చెట్లు తొలగించబడ్డాయి. మొత్తంగా, తుపాన్ తీవ్రతను తగ్గించడంలో ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు సానుకూల ఫలితాలు ఇచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రథమ కర్తవ్యమని, పూర్తి పునరుద్ధరణ వరకు చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

సంక్షేమ
మనసర్కార్
Follow: manasarkar





# 17 ఏళ్ళ నిరీక్షణకు శుభం కార్డు

◆ బలిమెల అమరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

బలిమెల ఘటనలో అమరులైన గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్ల కుటుంబాల 17 ఏళ్ల నిరీక్షణకు ముగింపు లభించింది. 2008లో జరిగిన ఆ ఘటనలో ప్రాణాలు అర్పించిన 33 మంది కానిస్టేబుళ్ల కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు.

నాటి హోంమంత్రి జానారెడ్డి ఇచ్చిన హామీని ఇప్పుడు సీఎం రేవంత్ నెరవేర్చారు. డీజీపీ శివధర్ రెడ్డి చొరవతో గాజులరామారంలో ప్రభుత్వ భూమిని కేటాయించి, ప్రతి కుటుంబానికి 200 గజాల స్థలాల చొప్పున పంపిణీ చేశారు. దీని ద్వారా 17 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న పోలీసు కుటుంబాల కల సాకారమైంది. ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, అమరుల త్యాగం వృథా కాకూడదని, వారి కుటుంబాల సంక్షేమం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇతర జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న ఇలాంటి సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. 2008లో ఏపీలోని బలిమెల రిజర్వాయర్ వద్ద మావోయిస్టులు గ్రేహౌండ్స్ బలగాలపై చేసిన దాడిలో 33 మంది ధైర్యవంతులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఆ అమరుల త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ, ఈ నెల 21న నిర్వహించిన అమరవీరుల దినోత్సవం సందర్భంగా పట్టాల పంపిణీ చేపట్టారు. ఈ నిర్ణయం పోలీసు వర్గాల్లో సంతోషాన్ని నింపింది. 17 ఏళ్లుగా నెరవేరని హామీని నేటి ప్రభుత్వం నిలబెట్టిందని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# క్రిప్టో మోసానికి ప్రభుత్వ వైద్యుడు బలి

**మొదటిపేజీ తరువాయి....**

స్నేహితులతో కలిసి మెటా ఫండ్‌లో డబ్బులు పెట్టారని, కరుణాకర్, కిరణ్, గణేష్ అనే స్నేహితులకు కోట్ల రూపాయలు ఇచ్చారని ఆమె ఆరోపించారు. తీసుకున్న రుణం చెల్లించలేకపోవడం, బ్యాంక్ ఉద్యోగుల ఒత్తిడి, స్నేహితులు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో శ్రీనివాస్ ప్రాణాలు తీసుకున్నారని బంధువులు తెలిపారు. ఆన్‌లైన్‌లో మెటా ఫండ్ పేరుతో నకిలీ బిట్‌కాయిన్ యాప్ సృష్టించి ప్రజల నుండి రూ.25 కోట్లకు పైగా వసూలు చేసిన మోసగాళ్లను పోలీస్ లు ఇప్పటికే అరెస్ట్ చేశారు. ప్రజలు ఇలాంటి ఆన్‌లైన్ మోసాలకు బలికాకుండా అప్రమత్తంగా ఉండాలని, అధిక లాభాల పేరుతో ఎవరైనా పెట్టుబడులు పెట్టమని చెబితే నమ్మరాదని కరీంనగర్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. ఎవరైనా ఇలాంటి మోసాలకు గురైతే వెంటనే Dial-100 లేదా 1930 సైబర్ హెల్ప్ లైన్‌కి సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. కేవలం రూ.90 వేల పెట్టుబడి పెడితే రూ.4.50 లక్షలు వస్తాయని, సింగపూర్ టూర్ ఇవ్వనున్నామని ఆకర్షణీయమైన ఆఫర్లతో ప్రజలను మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. పెట్టుబడిదారులు నష్టపోయిన తర్వాత కంపెనీ 'MFP కాయిన్స్' ఇచ్చి మరల నమ్మబలికిందని, కానీ వాటికి ఎలాంటి విలువ లేదని వెల్లడించారు. క్రిప్టో కరెన్సీ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆన్‌లైన్ పెట్టుబడుల విషయంలో జాగ్రత్తలు పాటించాలంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.



# ఆల్మట్టి ఎత్తు పెంచడాన్ని సీఎం ఆపాలి

❖ కల్వకుంట్ల కవిత డిమాండ్

**మహబూబ్‌నగర్ జిల్లా (ఏడీఎన్ఎన్) :**

మహబూబ్‌నగర్ జిల్లాకు ఆనుకుని ఉన్న కర్ణాటకలో ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

జాగృతి "జనం బాట" కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటిస్తున్న ఆమె మాట్లాడుతూ— కర్ణాటకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని , కాబట్టి సీఎం రేవంత్ రెడ్డి అక్కడి ప్రభుత్వంతో చర్చించి, ప్రాజెక్టు ఎత్తు పెంచకుండా ఆపే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు ఎత్తు పెరిగితే కృష్ణా కాలువల్లో చుక్క నీరు కూడా రానని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారని కవిత హెచ్చరించారు. వానలు పడకపోతే నీళ్ల పరిస్థితి మరింత దిగజారుతుందని , కృష్ణా జలాలపై తెలంగాణ రైతుల జీవనాధారం ఆధారపడి ఉందని , ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నిర్ణయాన్ని ఆపాలని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జాగృతి అనేక ప్రజా కార్యక్రమాల్లో పాల్గొందని , ప్రజల సహకారంతో ఆ సంస్థను నిర్మించుకున్నామని ,అదే ఉత్సాహంతో కొనసాగిస్తున్నామని కవిత తెలిపారు.

# తెలంగాణను అప్పులపాలు చేసింది బీఆర్ఎస్

◆ మంత్రి పొంగులేటి ఆరోపణలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

గత ప్రభుత్వం తెలంగాణను అప్పుల బారిన పడేలా చేసిందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు.



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, "గత పదిహేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదవారి కల అయిన సొంత ఇల్లు కూడా నెరవేర్చలేదు. కాళేశ్వరం కట్టిస్తే కమిషన్ వస్తుందని చూసారే కానీ, పేదవాడికి ఇల్లు కట్టించడంలో మాత్రం ఆసక్తి చూపలేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, ఉచిత కరెంట్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత ప్రయాణం, విద్యా-వైద్య రంగాల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని , అందుకే జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని , నవీన్ యాదవ్ గెలిస్తే ప్రజల అభివృద్ధికి కృషి చేస్తారని ఆయన ప్రజలను కోరారు.జూబ్లీహిల్స్ లో జరిగిన ఈ ప్రచార సభలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో మరో వివాదమా ?

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరో వివాదం తెరపైకి వచ్చింది . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ లో జరిగిన సినీ కార్మికుల అభినందన సభ ఈసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ఈ సభకు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరు కాకపోవడంతో, ఆయన అసంతృప్తిగా ఉన్నారనే ప్రచారం వేగంగా వ్యాపిస్తోంది. కోమటిరెడ్డి ముంబై పర్యటనలో ఉన్న సమయంలో సభను ఏర్పాటు చేయడంపై ఆయన సన్నిహితులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, కార్మికుల సమ్మె విరమణలో కీలకపాత్ర పోషించిన ఆయనను ఆహ్వానించకపోవడం, తాను లేని సమయంలో సభ నిర్వహించడం పై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం.అయితే, వెంకట్ రెడ్డి అసంతృప్తి సీఎంపై కాదని, తన శాఖ పనుల్లో ఒక సీఎం సన్నిహితుడు జోక్యం చేసుకుంటున్నాడనే భావనతో ఆయన అసహనం వ్యక్తం చేస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సినిమాటోగ్రఫీకి సంబంధించిన నిర్ణయాలు ఆయనకు తెలియకుండా తీసుకుంటున్నారని, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు కూడా ఆ నేతతో కలిసి వ్యవహరిస్తున్నారని ప్రచారం కొనసాగుతోంది.ఇక ప్రభుత్వం వర్గాలు మాత్రం ఈ వార్తలను కొట్టిపారేశాయి. కోమటిరెడ్డి వెంకటరెడ్డి అసంతృప్తిగా లేరని, ఆయనకు సభ వివరాలు ముందుగానే తెలిపినట్లు స్పష్టం చేస్తున్నాయి. ముంబై పర్యటన కారణంగా మాత్రమే హాజరుకాలేకపోయారని అవి



స్పష్టం చేశాయి. అయితే, ఇటీవలి కాలంలో సీఎంతో పలువురు మంత్రుల మధ్య అభిప్రాయ భేదాలు బయటపడిన విషయం తెలిసిందే. కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు తర్వాత ఇప్పుడు కోమటిరెడ్డి పేరు రావడంతో కాంగ్రెస్ లోపలి రాజకీయాలు మరోసారి కదలికలు చూపుతున్నాయి.

# కారుకు , బుల్డోజర్ కు యుద్ధం

◆ మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కారుకు, బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న యుద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్కొన్నారు . బుల్డోజర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం వచ్చిందని కేటీఆర్ తెలిపారు .రెండేళ్ల క్రితం బూటకపు హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు జూబ్లీహిల్స్ లో ఓటర్లను డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నదని కేటీఆర్ ఆరోపించారు. ఒక్కో ఓటరుకు ఈ ప్రభుత్వం రూ.60 వేల చొప్పున బకాయి పడ్డదని పేర్కొన్నారు. వారిచ్చే ఓటుకు రూ.2 వేలు తీసుకుని, మిగతా రూ.58 వేల రూపాయలు ఎప్పుడు ఇస్తారని ప్రజలు కాంగ్రెస్‌ను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఆ పైసలు తీసుకున్నా ఓటు మాత్రం బీఆర్ఎస్‌కే వేయాలని సూచించారు.బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు.



ప్రభుత్వం, మంత్రుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎవ్వరూ సంతోషంగా లేరని, పాలన పూర్తిగా పడకేసిందని విమర్శించారు. రైతులు పండించిన ధాన్యం, పత్తి కొనుగోలు చేసే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు బోనస్, పెట్టుబడి సాయం, విత్తనాలు, ఎరువులు కూడా అందట్లేదని అన్నారు. ఎరువుల కోసం లైన్లో నిలబడి రైతు మరణించిన దుస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని తెలిపారు.రూ.73 వేల కోట్లు రైతుబంధు రూపంలో రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని, కానీ రైతుల గోస పట్టించుకోని ప్రభుత్వం కాంగ్రెస్‌దేనని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాలు ఆరు, ఏడు వేలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. దీనిపై మంత్రులు అబద్ధాలు చెబుతున్నారని, ఒకరి మాటకు మరొకరికి పొంతన లేకుండా నెంబర్లు చెబుతున్నారని సెటైర్లు వేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ కాంగ్రెస్ పొగడ్తలు చెప్పుకుంటున్నా, ఆ రాజ్యంలో ఒక్క ఇల్లు కూడా కట్టకపోగా వేలాది ఇళ్లను నేలమట్టం చేసిందని ఆయన మండిపడ్డారు. పేదల ఇళ్లు కూల్చివేస్తూ, పెద్దల ఇండ్లను వదిలేస్తున్నారని విమర్శించారు. మంత్రులు జూబ్లీహిల్స్ లో గల్లీ లీడర్లలా తిరుగుతూ, పాలనను పక్కనపెట్టేశారని అన్నారు. మున్నూరు కాపుల అభివృద్ధికి కేసీఆర్ చేసిన కృషిని గుర్తు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మరోసారి మోసం చేస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. బీసీలకు ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని నిలదీశారు. బీసీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్‌ను గెలిపించి కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# మొంథాపై ముఖ్యమంత్రి ఆరా

**మొదటిపేజీ తరువాయి...**

కలెక్టర్లు ఆయా బృందాలకు మార్గదర్శకత్వం వహించాలని సీఎం ఆదేశించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రదేశాలకు తరలించాలని ఆయన సూచించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని, నీటి విడుదల విషయంలో కలెక్టర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లాలో తుపాన్ కారణంగా గోల్కొండ ఎక్స్ ప్రెస్, కోణార్క్ ఎక్స్ ప్రెస్ రైళ్లు నిలిచిపోవడంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఇతర మార్గాలపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించాలని సూచించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాలు, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలు ప్రమాదకరమని గుర్తించిన ప్రాంతాల్లో రాకపోకలను నిషేధించాలని సీఎం ఆదేశించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. తుపాన్ తర్వాత దోమలు, క్రిమికీటకాలు విజృంభించే ప్రమాదం ఉన్నందున వైద్యారోగ్య శాఖ తగిన మందులు, వైద్యశిబిరాలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. మున్సిపల్, పంచాయతీ, గ్రామ పారిశుధ్య సిబ్బంది పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, అగ్నిమాపక, పోలీస్ శాఖలు పరస్పర సమన్వయంతో తుపాన్ పరిస్థితిని ఎదుర్కోవాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖలు తక్షణమే స్పందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

# చంద్రన్న విప్లవకారుడు కాదు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టు కీలక నేతలు బండి ప్రకాష్, పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న మంగళవారం లొంగిపోయిన విషయం తెలిసిందే. అయితే చంద్రన్న లొంగిపోవడంపై ఒడిశాకు చెందిన మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి గణేష్ పేరిట ఒక లేఖ విడుదలైంది.

ఆ లేఖలో చంద్రన్నను పార్టీ ద్రోహిగా పేర్కొన్నారు. చంద్రన్న భవిష్యత్తులో ప్రజల మధ్య విప్లవాన్ని కొనసాగిస్తాను అని చేసిన వ్యాఖ్యలు తన దిగజారుడుతనాన్ని కప్పిపుచ్చే ముసుగు మాత్రమేనని గణేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యం ఎదుట లొంగిపోయిన వ్యక్తికి 'విప్లవకారుడు' అనే హక్కు లేదని మండిపడ్డారు. అలాగే బసవరాజ్ మరణం తర్వాత నేను దేవ్‌జీ స్థానంలో జనరల్ సెక్రటరీగా ఎన్నుకోబడ్డాను అనే చంద్రన్న వ్యాఖ్య అబద్ధమని గణేష్ స్పష్టం చేశారు. బసవరాజ్ మరణం తర్వాత తాము ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' పేరుతో దారుణమైన హత్యలు చేస్తోందని, ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ సమావేశాలు జరపడం అసాధ్యమని లేఖలో పేర్కొన్నారు. దేశంలో సుదీర్ఘ విప్లవ ఉద్యమం ఎన్నో కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ ముందుకు సాగిందని గణేష్ తెలిపారు. ప్రస్తుతం రాజ్యాంగ వ్యవస్థను ప్రజల మీద దోపిడీ చేసే సాధనంగా ఉపయోగిస్తున్నారని, నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక అసమానతలు వంటి సమస్యలను కప్పిపుచ్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. ప్రజలు మరోసారి మిలిటెంట్ మార్గాన్ని, తిరుగుబాటు మార్గాన్ని ఎంచుకోవాల్సిన చరిత్రాత్మక సమయం వచ్చిందని గణేష్ పిలుపునిచ్చారు. గత రెండేళ్లుగా ఎదురైన నష్టాల నుంచి బయటపడేందుకు పార్టీ కృషి చేస్తోందని, తమ కామ్రేడ్స్, మిత్రులు, ప్రజలు ప్రభుత్వ అణచివేతకు భయపడకుండా ధైర్యంగా నిలబడాలని కోరారు. కఠిన పరిస్థితుల్లో కూడా పార్టీ నిలబడుతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.




# సీఎం ను కలిసిన కమ్మ నేతలు

❖ బైపోల్‌లో కుల రాజకీయాలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేడెక్కుతోంది. సామాజిక సమీకరణాలే ఈ పోటీలో గెలుపోటములను నిర్ణయించేలా మారాయి. మూడు ప్రధాన పార్టీలు — కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కులాల వారీగా మద్దతు సంపాదించేందుకు బరిలో దిగాయి.

నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉండగా, బీసీలు 1.34 లక్షలు, ముస్లింలు 1.20 లక్షలు ఉన్నారు. కమ్మ, రెడ్డి, ఎస్సీ, లంబాడీ, క్రైస్తవ ఓట్లు కూడా కీలకం కానున్నాయి. కమ్మ



వర్గం ఓట్లు 22,746 ఉండగా, ఎస్సీ ఓట్లు 28,350 ఉన్నాయి. బీఆర్ఎస్ కమ్మ వర్గానికి చెందిన మాగంటి సునీతకు టికెట్ ఇవ్వడం ద్వారా ఆ వర్గ మద్దతుపై దృష్టి సారించింది. పువ్వాడ అజయ్ తదితర కమ్మ నేతలను రంగంలోకి దించి ఆ వర్గంలో బలపడే ప్రయత్నం చేస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ కూడా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ లను జూబ్లీహిల్స్ లో రంగంలోకి దించింది. కమ్మ సంఘాల నేతలు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలుసుకొని కాంగ్రెస్‌కే మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. తమ వర్గానికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరగా, రేవంత్ సానుకూలంగా స్పందించారు. అమీర్‌పేట్ మైత్రీవనంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలన్న అభ్యర్థనకూ సీఎం అంగీకరించినట్లు సమాచారం. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సామాజికవర్గం ఓట్లు తనకే కలుస్తాయని ధీమాలో ఉండగా, బీఆర్ఎస్ ఆ ఓట్లను దక్కించుకునేందుకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను రంగంలోకి దించింది. బీజేపీ తరఫున లంకెల దీపక్‌రెడ్డి బరిలో ఉన్నారు. రెడ్డి ఓట్లు గెలుచుకునేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సొంతంగా వ్యూహాలు రూపొందిస్తున్నారు. మొత్తం మీద జూబ్లీహిల్స్ బైపోల్ కుల సమీకరణాల పోరుగా మారి, తుది గెలుపు ఎవరికి దక్కుతుందో ఆసక్తి రేపుతోంది.



# రేవంత్ టీంలో స్టార్ బ్యాట్స్ మన్

**మొదటిపేజీ తరువాయి....**

కాబట్టి అజహరుద్దీన్ వెంటనే ప్రమాణం చేయడం సాధ్యమవుతుంది.జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో మైనార్టీ ఓట్లు కీలకంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆ నియోజకవర్గంలో సుమారు లక్షకు పైగా మైనార్టీ ఓటర్లు ఉన్నారు. వారిని ఆకర్షించే ఉద్దేశంతోనే మైనార్టీ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించే ప్రయత్నం కాంగ్రెస్ చేపట్టింది. ఇప్పటి వరకు కేబినెట్‌లో మైనార్టీ ప్రతినిధులు లేరని, దీనివల్ల అసంతృప్తి నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయం తో బీఆర్ఎస్ శ్రేణులు అయోమయంలో పడ్డారు . ఇప్పటివరకు కాంగ్రెస్ కేబినెట్ లో ముస్లిం లకు చోటు లేదని విమర్శిస్తున్న బీఆర్ఎస్ కు కాంగ్రెస్ సమాధానం చెప్పినట్లయింది .గత సార్వత్రిక ఎన్నికలలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయిన అజహరుద్దీన్ కి ఉపఎన్నికలో కాంగ్రెస్ సీట్ కేటాయించలేదు . యువ నాయకుడైన నవీన్ యాదవ్ కు కాంగ్రెస్ అవకాశం ఇచ్చింది . ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన అజహరుద్దీన్ వర్గీయులకు తాజా నిర్ణయం సంతోషాన్ని ఇచ్చింది . కాంగ్రెస్ కి ఎంఐఎం పార్టీ కూడా సపోర్ట్ చేయడం చూస్తుంటే కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఉపఎన్నికను ఎంత సీరియస్ గా తీసుకుందో అర్థమవుతోంది . ఒక పక్క బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో పదే పదే మైనార్టీలకు మేలు చేసింది ఒకే ఒక్క లీడర్ కేసీఆర్ అని చెప్తూ , ముస్లిం ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు . ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ కూడా నవీన్ యాదవ్ కు మద్దతు తెలిపారు . కాంగ్రెస్ అధిష్టానం అజహరుద్దీన్ కి మంత్రిగా అవకాశం ఇవ్వడంతో జూబ్లీహిల్స్ లో ప్రతిపక్ష పార్టీ లు అయోమయంలో ఉన్నాయి . జూబ్లీహిల్స్ లో అత్యధిక శాతం ఉన్న ముస్లిం ఓటర్లు ప్రభుత్వ తాజా నిర్ణయం తో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఏ పార్టీకి మద్దతు తెలుపుతారో వేచి చూడాలి . హైకమాండ్ ఆశీస్సులతో అజహరుద్దీన్ కు మంత్రిగా అవకాశం దక్కింది. క్రికెట్ కెరీర్ తర్వాత రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆయన ఉత్తరప్రదేశ్ నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత రాజస్థాన్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం తెలంగాణకు వచ్చి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన అజహరుద్దీన్ , ఉపఎన్నికల్లో కూడా పోటీ చేయాలనుకున్నారు. అయితే హైకమాండ్ వ్యూహాత్మకంగా ఆయనకు మంత్రి పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది.

# ఎవరీ దయాచౌదరి?

**మొదటిపేజీ తరువాయి....**

ఇప్పటికే చిరంజీవి తన పేరు, ఫోటో, వాయిస్ వంటి వ్యక్తిగత అంశాలను అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించవద్దని కోరుతూ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆయనకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ కొంతమంది ఈ ఉత్తర్వులను పట్టించుకోకుండా ఉల్లంఘనలు కొనసాగిస్తుండటంతో ఆయన మరోసారి పోలీసులను సంప్రదించారు. తాజాగా, కృత్రిమ మేధస్సు (AI) సాంకేతికతను ఉపయోగించి తన ముఖాన్ని మార్ఫింగ్ చేసి అశ్లీల వీడియోలు తయారు చేస్తున్నారని చిరంజీవి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వీడియోలు, పోస్టులు సామాజిక మాధ్యమాల్లో వ్యాపిస్తూ తన ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఫిర్యాదు ఆధారంగా సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇలాంటి తప్పుడు ప్రచారం, ఏఐ దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# నిజామాబాద్‌లో లవ్ జిహాద్

**మొదటిపేజీ తరువాయి..**

జరిమానా చెల్లించని పక్షంలో అదనపు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది. ఈ కేసులో 13 మంది సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేయగా, 12 పత్రసాక్ష్యాలు, రెండు వస్తు సాక్ష్యాలు కోర్టులో మార్క్ చేయబడ్డాయి. అన్ని వాంగ్మూలాలు, సాక్ష్యాలను పరిశీలించిన అనంతరం న్యాయస్థానం నిందితుడిపై ఆరోపణలు నిర్ధారితమయ్యాయని పేర్కొంది.పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్ వాదనలు వినిపించారు. బాధిత మహిళకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థను జడ్జి హరీష్ సిఫారసు చేశారు.



# వరంగల్, హన్మకొండలలో రెడ్ అలర్ట్

**వరంగల్ (ఏడీఎన్ఎన్) :**

మొంథా తుపాన్ ప్రభావంతో తెలంగాణ రాష్ట్రం వర్షాల బారిన పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వర్షాలు విస్తారంగా కురవడంతో రోడ్లు, వీధులు నీటమయమయ్యాయి.

చెరువులు, కుంటలు ఉప్పొంగి పలు ప్రాంతాల్లో జనావాసాలకు నీరు చేరింది. తుపాన్ తీవ్రత దృష్ట్యా వరంగల్, హన్మకొండ జిల్లాలకు కలెక్టర్ సత్య శారద రెడ్ అలర్ట్ ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

**అత్యవసర కంట్రోల్ రూమ్ నంబర్లు:**

వరంగల్ కలెక్టరేట్: 1800 425 3424, 9154225936, హన్మకొండ కలెక్టరేట్: 1800 425 1115, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్: 1800 425 1980, 9701999676, విద్యుత్ సమస్యల కోసం పీడీసీఎల్ హెల్ప్ లైన్: 1800 425 0028, ప్రజలు అత్యవసర పనులకోసమే బయటకు రావాలని, ఎత్తైన ప్రాంతాల్లో నివసించే వారు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరించారు.

## రాశి ఫలాలు

**30-10-2025 గురువారం**

**మేషం:**
ఆదాయ వృద్ధికి ఎటువంటి ప్రయత్నం తలపెట్టినా కలిసి వస్తుంది. వ్యాపారాల్లో లాభాలకు లోటుండదు. వ్యాపారంలో మీ సరికొత్త నిర్ణయాలు సత్ఫలితాలనిస్తాయి. కుటుంబ వ్యవహా రాలు చాలావరకు చక్కబడతాయి. వ్యక్తిగత సమస్యల పరిష్కారం మీద, సొంత పనుల మీద శ్రద్ధ పెట్టడం మంచిది. ఇంటా బయటా గౌరవమర్యాదలు పెరుగుతాయి.

**వృషభం:**
వృత్తి, ఉద్యోగాల్లో మీ సలహాలు, సూచనలకు విలువ పెరుగుతుంది. వ్యాపారాల్లో లాభాలకు లోటు ఉండకపోవచ్చు. వ్యక్తిగత సమస్య ఒకటి పరిష్కారం అవుతుంది. మనసులోని కోరిక నెరవేరుతుంది. ఆర్థికపరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి. పెద్దలతో పరిచయాలు ఏర్పడతాయి.

**మిధునం:**
చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తాయి. ప్రయాణాలు బాగా లాభిస్తాయి. ప్రముఖులు పరిచయం అవుతారు. బంధువుల నుంచి శుభకార్యాలకు ఆహ్వానాలు అందుతాయి. ఉద్యోగం మారడానికి చేసే ప్రయత్నాలకు సానుకూల స్పందన లభిస్తుంది. ఆహార, విహారాల్లో జాగ్రత్తగా ఉండడం మంచిది.

**కర్కాటకం:**
ఆదాయం, ఆరోగ్యం నిలకడగా ఉంటాయి. అనుకోని ఖర్చులు మీద పడే అవకాశం ఉంది. ముఖ్యమైన పనులు, వ్యవహారాలు సకాలంలో పూర్తవుతాయి. జీవిత భాగస్వామితో కలిసి దైవ కార్యాల్లో పాల్గొంటారు. ఉద్యోగ ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. కుటుంబ సభ్యుల నుంచి కొద్దిగా ఆర్థిక ఒత్తిడి ఉంటుంది.

**సింహం:**
వృత్తి జీవితంలో డిమాండ్ పెరుగుతుంది. వ్యాపారాలు నిలకడగా పురోగతి చెందుతాయి. ఆదాయ వృద్ధికి కొత్త అవకాశాలు అందుతాయి. సొంత పనుల మీద ఎక్కువగా శ్రద్ధ పెట్టడం మంచిది. కొందరు బంధుమిత్రులకు ఆర్థికంగా సహాయం చేసే అవకాశం ఉంది. నిరుద్యోగులకు సొంత ఊర్లోనే ఉద్యోగం లభిస్తుంది.

**కన్య:**
వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా పురోగమిస్తాయి. తోబుట్టువులతో ఆస్తి వివాదం పరిష్కారం అయ్యే సూచనలున్నాయి. ఉద్యోగం మారడానికి అవకాశం ఉంది. అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవుతాయి. ఆర్థిక పరిస్థితి చాలావరకు అనుకూలంగా ఉంటుంది. ఏ ప్రయత్నమైనా సత్ఫలితాలనిస్తుంది.

**తుల:**
ఉద్యోగంలో మీ పనితీరుతో అధికారుల్ని బాగా ఆకట్టుకుంటారు. వృత్తి, వ్యాపారాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగిపోతాయి. ఉద్యోగం మారడానికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థిక విషయాలకు సమయం బాగా అనుకూలంగా ఉంది. ఆదాయం వృద్ధి చెందుతుంది. ఆశించిన శుభవార్తలు వింటారు.

**వృశ్చికం:**
వృత్తి, వ్యాపారాలు సానుకూలంగా పురోగమిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా సాగిపోతాయి. చేపట్టిన వ్యవహారాలు, పనులు వేగంగా పూర్తవుతాయి. ప్రయాణాల వల్ల ఆశించిన లాభాలు కలుగుతాయి.

**ధనస్సు:**
వ్యాపారాల్లో ఆశించిన పురోగతి ఉంటుంది. శుభవార్తలు వినడం, శుభ పరిణామాలు చోటు చేసుకోవడం జరుగుతుంది. దూర ప్రాంతంలో ఉన్న పిల్లలు కానీ, తల్లి తండ్రులు కానీ ఇంటికి వచ్చే అవకాశం ఉంది. ఆదాయానికి లోటుండదు. కుటుంబ జీవితం సాఫీగా, హ్యాపీగా సాగిపోతుంది. ఆశించిన శుభవార్తలు వింటారు.

**మకరం:**
ఎటువంటి ప్రయత్నమైనా విజయవంతం అవుతుంది. రావలసిన డబ్బు సకాలంలో చేతికి అందుతుంది. ఉద్యోగంలో మీ పని తీరుకు అధికారుల నుంచి ప్రోత్సాహం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఆర్థిక, ఆస్తి వ్యవహారాలను చక్కబెట్టడంలో కుటుంబ సభ్యుల సాయం లభిస్తుంది.

**కుంభం:**
ఉద్యోగ ప్రయత్నాల్లో శుభవార్త అందుతుంది. పెళ్లి ప్రయత్నాలు సానుకూలపడతాయి. అనవసర పరిచయాలకు దూరంగా ఉండడం మంచిది. ఆదాయ ప్రయత్నాలు ఫలించి అవసరాలు తీరుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తవుతాయి. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం జరుగుతుంది. ఆరోగ్యం అనుకూలిస్తుంది.

**మీనం:**
ఆకస్మిక ధన ప్రాప్తి సూచనలున్నాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. నిరుద్యోగులకు ఆఫర్లు అందుతాయి. వ్యక్తిగత సమస్య పరిష్కారం అవుతుంది. ఆరోగ్యం పరవాలేదు. ఆశించిన శుభవార్తలు వింటారు.

## ఏసీబీ వలలో అవినీతి ఎస్ఈ

**యాదగిరిగుట్ట, (ఏడీఎన్ఎన్) :**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ఎలక్ట్రిసిటీ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రామారావు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కాడు. బుధవారం ఉప్పల్‌లో రూ.1,90,000 లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రామారావును రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్ చేశారు. రామారావు గత కొన్నేళ్లుగా దేవస్థానం ఎలక్ట్రిసిటీ విభాగంలో పలు హోదాల్లో పనిచేస్తూ ఉన్నాడు. అతనిపై గతంలోనూ అవినీతి ఆరోపణలు వచ్చి సస్పెండ్ అయినట్లు సమాచారం. తాజాగా మళ్లీ లంచం కేసులో పట్టుబడటంతో సంచలనం రేగింది. ఏసీబీ అధికారులు రామారావు కూడబెట్టిన అక్రమ ఆస్తులపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ధర్మాదాయ శాఖ చరిత్రలో ఎస్ఈ స్థాయి అధికారి, ముఖ్యంగా యాదగిరిగుట్ట దేవస్థానంలో పనిచేస్తున్న అధికారి ఏసీబీ వలలో చిక్కడం ఇదే తొలిసారి. ట్రాప్ అనంతరం రామారావును యాదగిరిగుట్ట దేవస్థానం ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చి విచారణ జరిపారు. ఇటీవల ఆయన చేసిన సంతకాలు, ప్రాధాన్యత కలిగిన నిర్ణయాలు, ఆమోదాలు తదితర అంశాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు.

# వర్షాకాలం ఈ దగ్గుతో తెగ చిరాకు

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**



దగ్గు వచ్చిందంటే తెగ చిరాకుపెట్టేస్తుంది. నిద్రపోనివ్వదు, పనిచేసుకోనివ్వదు, మాట్లాడనివ్వదు. ముఖ్యంగా వర్షాకాలం ఈ దగ్గు వచ్చిందంటే ఓ పట్టాన తగ్గదు. ఒక విధంగా అనేది శరీర రక్షణ చర్య. మన శ్వాసనాళాల్లో దుమ్ము, సూక్ష్మజీవులు లేదా కఫం పేరుకుపోతే, వాటిని బయటికి పంపడానికి దగ్గు వస్తుంది. ఈ దగ్గు రెండు రకాలుగా ఉంటుంది. పొడి దగ్గులో కళ్లె పడదు, కానీ గొంతులో చిరాకుగా, దురదగా ఉన్నట్లుంటుంది. అలర్జీలు, ఉబ్బసం, పొడిగాలి, కొన్ని రకాల మందులు ఈ దగ్గుకు కారణమవుతాయి. గోరువెచ్చని నీటిలో ఉప్పు వేసి గార్గిల్ చేయడం, తేనె, అల్లం, నిమ్మరసం కలిపి తాగడం, ఆవిరి పీల్చడం, తగినంత నీరు తాగడం వంటి పనులతో ఈ దగ్గును తగ్గించుకోవచ్చు. తడి దగ్గులో కళ్లె పడుతుంది. ఇది ఇన్‌ఫెక్షన్లతో కూడిన బాక్టీరియాలను బయటకు తోసే ప్రయత్నం చేస్తుంది. బ్రాంకైటిస్, జలుబు, ఫ్లూ, న్యూమోనియా, కొవిడ్ వంటివి తడిదగ్గులు. ఛాతీలో భారంగా అనిపించడం, కొన్నిసార్లు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గుతో పాటు కఫం రావడం దీని లక్షణాలు. గోరువెచ్చని నీరు తరచూ తాగడం, కఫం బయటకు రానివ్వాలి అడ్డుకోకూడదు. దగ్గుకు తగిన మందులు వాడాలంటే అది ఏరకమో తెలుసుకోవాలి. దానిని బట్టి వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి. నాలుగేళ్ల లోపు చిన్నారులకు దగ్గు సిరప్ లు వాడకపోవడమే మంచిది. దగ్గు 2 వారాలకు మించి కొనసాగితే డాక్టర్ ను సంప్రదించడం మంచిది. జ్వరం, ఛాతీ నొప్పి, రక్తంతో దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

# పిల్లలపై అతి గారాబం :ప్రేమ కాదు, ముప్పే

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**



తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రేమ చూపడం సహజం. కానీ ఆ ప్రేమ అతి గారాబంగా మారినప్పుడు, అది పిల్లల భవిష్యత్తుకు ముప్పు కలిగించగలదు. నేటి తరం పిల్లల్లో కనిపిస్తున్న స్వతంత్రత లోపం, తప్పులు చేయడం, బాధ్యత తీసుకోలేని స్వభావం, తల్లిదండ్రులపై అధికంగా ఆధారపడటం వంటి లక్షణాల వెనుక ప్రధాన కారణం "అతి గారాబం" అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. . .మానసిక నిపుణులు చెబుతున్నట్లు, పిల్లలకు అన్నీ సిద్ధంగా ఇవ్వడం, చిన్న పనికీ తల్లిదండ్రులు జోక్యం చేసుకోవడం వల్ల పిల్లల్లో స్వీయ నిర్ణయ సామర్థ్యం తగ్గిపోతుంది.

- విద్యలో, ఆటల్లో, సామాజిక పరిసరాల్లో కూడా వారికి అనుకూలంగా ఉండాలనుకుంటారు.
- ప్రతి చిన్న నిరుత్సాహానికి భయపడటం లేదా ఏడవడం అలవాటు అవుతుంది.
- అతి రక్షణ వల్ల పిల్లలు ఇతరులతో అంత త్వరగా కలవలేరు.
- వీటివల్ల చిన్నతనంలోనే నిద్రలేమి, డిప్రెషన్, దృష్టి లోపం, కోపం, మొండితనం, ట్రామా వంటి సమస్యలు అతిగారాబం, ప్రేమ కేవలం రెండేళ్లవరకే చూపించాలి. తర్వాత కాస్త హద్దులు పెట్టాల్సిందే. క్రమశిక్షణ నేర్పాల్సిందే.
- మంచి, చెడుల వ్యత్యాసం చెప్పడం ఎంతో అవసరం. పునాది దశలోనే నేర్పుగా వారిని తీర్చిదిద్దాలి.
- దీనికోసం పిల్లలకి చిన్న పనులు స్వయంగా చేయించండి.
- తప్పు చేసినప్పుడు అది సరిచేసుకునే అవకాశం ఇవ్వండి.
- ఫలితానికి కంటే కృషికి ప్రాధాన్యం ఇవ్వడం నేర్పండి.
- వారిని నిరుత్సాహం లేదా వైఫల్యాలను కూడా ఎదుర్కొనడం నేర్పించండి.

పిల్లలపై అతిగారాబం చూపడం అనేది వారిని బలహీనులను చేస్తుందని గుర్తించాలి. ప్రేమకు పరిమితులు ఎంతో అవసరం. అని పిల్లల మనస్తత్వ నిపుణులు చెప్తున్నారు.

# స్వచ్ఛమైన గాలి కావాలంటే ఈ నగరాలకు వెళ్లాల్సిందే

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**



ప్రపంచవ్యాప్తంగా పొల్యూషన్ పెరిగిపోతోంది. భారత్ లో కూడా ప్రతీ ఏడాది చలికాలంలో దేశరాజధాని ఢిల్లీ వాయు కాలుష్యంతో అల్లాడుతోంది. ఈ సమస్యను తీర్చడానికి అనేక ప్రయత్నాలు చేస్తూంటారు. ఇలాంటి పరిస్థితులలో స్వచ్ఛమైన గాలి పీల్చుకోవాలంటే ప్రపంచంలో బెస్ట్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ గల నగరాలకు వెళ్లాల్సిందే. అక్కడి పరిశుభ్రమైన గాలి ఈ నగరాలను పొల్యూషన్ ఫ్రీ నగరాలుగా మార్చింది.

**ఓస్లో :** నార్వే దేశంలోని ఓస్లో నగరం ప్రపంచంలోనే ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ లో అగ్రస్థానంలో ఉంది. ఇక్కడి ఎయిర్ క్వాలిటీ 1గా ఉంది. ఓస్లోలోని దాదాపు 90 శాతం వాహనాలు ఎలక్ట్రిక్ వాహనాలు. చివరికి బస్సులు, రైళ్లు, ఇతర వాహనాలు కూడా పూర్తిగా 2028నాటికి పూర్తిగా వాయుకాలుష్యం బారి నుండి గ్రీన్ ఎనర్జీకి మారుతాయి.

**డెట్రాయిట్ :** రెండో స్థానంలో అమెరికాలోని డెట్రాయిట్ నగరం ఉంది. ఈ నగరం గతంలో అత్యంత కాలుష్యం కలిగిన నగరాల్లో ఒకటిగా ఉండేది. అనేక సంవత్సరాల ప్రచారం, అవగాహన తర్వాత నగరంలోని మున్సిపల్ సాలిడ్ వేస్ట్ ను నిషేధించారు. దీనితో డెట్రాయిట్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 8 కి చేరింది.

**అల్జీరీస్:** మూడో స్థానంలో అల్జీరియాలోని అల్జీరీస్ నగరం ఉంది. అల్జీరీస్ నగరంలో అక్టోబర్ 24, 2025 నాటికి ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 11 గా ఉంది.

**టోరెంటో :** కెనడాలోని టోరంటో నగరం నాలుగో స్థానంలో నిలిచింది. అక్కడి గాలి నాణ్యత 11గా ఉంది.

**సిడ్నీ:** గాలి నాణ్యతలో ఆస్ట్రేలియాలోని సిడ్నీనగరం ఐదవ స్థానంలో ఉంది. ఇక్కడి గాలి నాణ్యత 16గా ఉంది.

**కౌలాలంపూర్ :** మలేషియాలోని కౌలాలంపూర్ ఆరవ స్థానంలో ఉంది. ఇక్కడ అడవుల దహనం కూడా అధికంగా ఉన్నా కూడా, వీధులలో ట్రాఫిక్ భారీగా ఉన్నా కూడా గాలి నాణ్యత 17 గా ఉండడం విశేషం.

**లిస్బాన్ :** పోర్చుగల్ లోని లిస్బన్ నగరం 17 ఎయిర్ క్వాలిటీతో ఏడవ స్థానంలో ఉంది.

**వాషింగ్టన్ :** అమెరికాలోని వాషింగ్టన్ కార్చిచ్చులు అధికంగా ఉన్నా కూడా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 17తో ఎనిమిదోస్థానంలో ఉండడం విశేషం.

**సాల్ట్ లేక్ :** అమెరికాలోని సాల్ట్ లేక్ సిటీ కూడా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్17 తో 9 వ స్థానంలో నిలిచింది.

**స్కోప్ జీ :** నార్త్ మసెడోనియాలోని స్కోప్ జీ నగరం గాలి నాణ్యత ఇండెక్స్ 18గా ఉంది.

# లివింగ్ రూమ్ నుంచి లీడర్ షిప్ వరకు

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**



ప్రతి పెద్ద కల ఒక చిన్న ఆలోచనతో మొదలవుతుంది అంటారు. దీనిని నిజం చేసింది చండీగఢ్‌కు చెందిన రితికా సింగ్. ఇంట్లోని చిన్న లివింగ్‌రూమ్‌లో ప్రారంభించిన ఆమె ప్రయాణం, నేడు దేశవ్యాప్తంగా పలువురు యువతులకు స్ఫూర్తిగా మారింది. ఒక గృహిణికి ఎదురయ్యే మొదటి ప్రశ్న నువ్వేమైనా సంపాదిస్తున్నావా.. నీకేం తెలుసు అంటూ మనసును గాయపరిచే మాటలనెదుర్కొని తనేమిటో నిరూపించింది. బాధపడుతూ కూర్చోకుండా ఒక కంపెనీ సీఈవోగా ఎదిగింది. పొరపొచ్చాలతో భర్త నుండి విడిపోయిన ఆమె పిల్లలను ఒంటరిగా పోషించుకోవడానికి ఇంట్లోనే ఉంటూ ఫ్రీ లాన్సర్ కంటెంట్ రైటర్‌గా మారారు. ఈ పనిలో పేరు తెచ్చుకున్నాక దానిని వ్యాపారంగా మార్చాలనే ఉద్దేశం ఏర్పడింది. ఇంగ్లీష్ లిటరేచర్ చదువుకున్న ఆమె తన ఆలోచనలే పెట్టుబడిగా పెట్టి 2013లో ఒక ల్యాప్ టాప్, ఒక టేబుల్‌తో నమ్మకంగా కంటెంట్ ఫ్యాక్టరీ అనే సంస్థను స్థాపించింది. ఈ సంస్థ బ్రాండ్స్ కు కంటెంట్ తయారు చేయడమే కాదు. వాటి కథను ప్రపంచానికి హత్తుకునేలా చెప్పి బ్రాండ్ వాల్యూని పెంచింది. "కంటెంట్ అనేది కేవలం పదాల సమాహారం కాదు. అది భావం, నమ్మకం." అంటారామె. బ్రాండ్ ఐడెంటిటీ, డిజిటల్ మార్కెటింగ్, SEO, సోషల్ మీడియా వ్యూహం ఇలా ప్రతి విభాగంలోనూ రితికా నాయకత్వం స్పష్టంగా కనిపిస్తుంది. బ్రాండ్ స్ట్రాటజీ, సోషల్ మీడియా పేజీలు, వెబ్ సైట్ల నిర్వహణ, ఈ మెయిల్ మార్కెటింగ్ వంటి సేవలను అందించే ఈ సంస్థ క్రమేపీ 25 రకాల పరిశ్రమలతో కలిసి పనిచేసే స్థాయికి ఎదిగింది. గృహిణులు, తల్లులకే ఆమె సంస్థలో మొదటి అవకాశం. టెడెక్స్ వేదికల మీద కూడా స్ఫూర్తి పాఠాలు చెప్పే ఆమె ప్రస్తుతం ఇండియన్ విమెన్ నెట్ వర్క్ చండీగఢ్ కి ఛైర్ పర్సన్ గా కూడా పనిచేస్తున్నారు.

# అమ్మో!ఈ జీవులు గర్భంలోనే తోబుట్టువులను తినేస్తాయి

- అరుదైన సముద్రజీవి ఇసుకపులి షార్క్
- గర్భంలోనే గుడ్లు పెట్టి పిల్లల్ని కనే జీవి
- సముద్ర ఎకోసిస్టమ్ లో ముఖ్యమైన ప్రీడేటర్లు

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**



సముద్రం ఎన్నో రహస్యాలను తన కడుపులో దాచుకుని ఉంటుంది. దానిలో సముద్రంలో ఉండే ఇసుక పులి షార్క్ అనే ఓ వింత, భయంకరమైన జీవి గురించి వింటేనే భయం వేస్తుంది. ఎందుకంటే ఇది తల్లి కడుపులో ఉండగానే తోటి పిల్లలను, గుడ్లను తినేస్తుంది. ఈ షార్క్ లో విశేషం ఏమిటంటే.. ఈ ఇసుక పులి షార్క్ ఒకేసారి అనేక గుడ్లు పెడుతుంది. కానీ ఇవన్నీ కడుపులోనే ఉంటాయి. అక్కడే పొదిగే ప్రక్రియ కూడా మొదలవుతుంది. అంటే గుడ్లు తల్లి గర్భంలోనే పగిలి పిల్లలు పుడతాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే గర్భంలో ఉన్న పెద్ద పిల్లలు చిన్న గుడ్లను తింటాయి! దీనిని "ఇన్‌ట్రా యూటరైన్ కానిబలిజం"అంటారు. పిల్లలు పెరిగేకొద్దీ వాటి మనుగడ కోసం యుద్ధం ప్రారంభమవుతుంది. శాస్త్రవేత్తల ప్రకారం.. దీనిని గర్భాశయ మాంస భక్షణ అని పిలుస్తారు. దీని అర్థం బలమైన పిల్లలు బలహీనమైన పిల్లలను తింటాయి. ఈ విధంగా, బలమైన సంతానం మాత్రమే మనుగడ సాగిస్తుంది. పుట్టకముందే షార్క్ పిల్ల తన తల్లి శరీరం నుండి కూడా పచ్చసొన, కొన్ని పోషకాలను తీసుకుంటుంది. అంటే అది తన తల్లి శరీరంలోని కొంత భాగాన్ని కూడా ఉపయోగించుకుంటుంది. దీనిని గ్రే నర్స్ షార్క్, రాగ్డ్‌టూత్ షార్క్ అని కూడా అంటారు. ఇసుక పులి షార్క్ లు ప్రధానంగా వేడి, సమశీతోష్ణ సముద్ర జలాల్లో కనిపిస్తాయి. ఇవి సాధారణంగా అమెరికా తీరాలు, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, జపాన్, హిందూ మహాసముద్ర తీర ప్రాంతాలలో విస్తరించి ఉంటాయి. ఇవి ఎక్కువగా తక్కువ లోతు నీటిలో, ముఖ్యంగా సముద్రతీరాల దగ్గర ఉన్న ఇసుక నేలల వద్ద తిరుగుతాయి . అందుకే వీటికి "ఇసుక పులి షార్క్" అనే పేరు వచ్చింది. వీటి పొడవు సగటున 2.2 నుండి 3.2 మీటర్లు ఉంటుంది. బరువు సుమారు 150 కిలోల వరకు ఉంటుంది. బొద్దుగా కనిపించే శరీరం, పెద్ద నోటితో బయటికి కనిపించే పదునైన రంపం లాంటి పళ్లు వీటి ప్రత్యేకత. పులిని గుర్తు చేసే విధంగా బలమైన దాడి సామర్థ్యం ఉన్నప్పటికీ, ఇవి చాలా సార్లు మనుషుల పట్ల శాంతంగా ఉంటాయని చెప్తుంటారు. ఇవి ప్రస్తుతం అంతరించిపోయే దశలో ఉన్నాయని, పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు. వాటిని వాణిజ్య వేట, అక్వేరియం కోసం పట్టుకోవడం, సముద్ర కాలుష్యం కారణంగా వీటి సంఖ్య తగ్గిపోతున్నాయి. ఇసుక పులి షార్క్ లు సముద్ర ఎకోసిస్టమ్ లో ముఖ్యమైన ప్రీడేటర్లు. ఇవి చిన్న చేపల సంఖ్యను నియంత్రించి, సముద్ర జీవవైవిధ్యాన్ని సమతుల్యం చేస్తాయి.



## ఆటిజం చికిత్సలో సరికొత్త ప్రయోగం

- ICMR అనుమతితో ఆటిజం చికిత్సలో కొత్త ఆశ
- హైదరాబాద్ లో FMT పద్ధతిపై క్లినికల్ ట్రయల్స్
- న్యూరో-గాస్ట్రో ఇంటర్ ఫేస్ రీసెర్చ్ లో కొత్త మలుపు
- గట్ హెల్త్, మెదడు ఆరోగ్యానికి మధ్య సంబంధం

**హైదరాబాద్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

నగరంలోని ప్రముఖ వైద్య పరిశోధనా సంస్థకు భారత వైద్య పరిశోధన మండలి (ICMR) చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పిల్లల్లో కనిపించే ఆటిజం చికిత్సలో కొత్త దిశగా ముందడుగు వేస్తూ, FMT పద్ధతిపై క్లినికల్ ట్రయల్ నిర్వహించేందుకు అనుమతి మంజూరైంది. ఈ నిర్ణయం భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగం దృష్టిని ఆకర్షిస్తోంది. FMT అనేది గట్ మైక్రోబయోమ్ సమతుల్యాన్ని పునరుద్ధరించేందుకు ఉపయోగించే వైద్య విధానం. ఈ పద్ధతిలో ఆరోగ్యవంతులైన వ్యక్తుల గట్ లో ఉన్న మైక్రోబ్స్ ను శుద్ధి చేసిన రూపంలో ఆటిజం రోగుల జీర్ణవ్యవస్థలోకి ప్రవేశపెడతారు. దీని లక్ష్యం ఏమిటంటే జీర్ణవ్యవస్థ సమతుల్యం ద్వారా మెదడు ప్రవర్తనలో వచ్చే సమస్యలను తగ్గించడం. ఆటిజం అనే వికాస సంబంధ వ్యాధి పిల్లల్లో భాష, సామాజిక ప్రవర్తన, నైపుణ్యాలపై ప్రభావం చూపుతుంది. ఇటీవలి పరిశోధనల్లో గట్ హెల్త్, మెదడు ఆరోగ్యానికి మధ్య సంబంధం ఉందని చూసారు. ఆటిజం పిల్లల్లో చాలామందికి జీర్ణవ్యవస్థ సమస్యలు, గట్ బ్యాక్టీరియా అసమతుల్యత ఉంటుందని వైద్యులు గుర్తించారు. FMT ద్వారా ఆ అసమతుల్యతను తగ్గించడం ద్వారా వారి ప్రవర్తనలో, జీర్ణవ్యవస్థలో మెరుగుదల కనిపించవచ్చనే నమ్మకం ఉంది. ICMR అనుమతి ద్వారా భారతదేశం న్యూరోగాస్ట్రో ఇంటర్ ఫేస్ రీసెర్చ్ లో కొత్త దశను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ FMT పద్ధతి పశ్చిమ దేశాల్లో పలు అధునాతన ఆసుపత్రుల్లో పరీక్షల్లో ఉంది. ఇప్పుడు హైదరాబాద్‌లో అది ప్రయోగాత్మక వాస్తవంగా మారడం దేశానికి ఒక ప్రతిష్ఠాత్మక మైలురాయిగా చెప్పవచ్చు. పరిశోధన ప్రథమ దశలో తేలికపాటి ఆర్టిజం లక్షణాలు ఉన్న పిల్లలపై పరీక్షలు చేయనున్నారు. వైద్యులు ప్రత్యేక జాగ్రత్తలతో FMT పద్ధతిని అనుసరించి వారి శరీర ప్రతిస్పందన, ప్రవర్తనా మార్పులు, జీర్ణవ్యవస్థ స్థితి మొదలైన వివరాలను నిరంతరం మానిటర్ చేయనున్నారు. FMT ప్రయోగాలు విజయవంతమైతే ఆటిజంతో బాటు ఇతర న్యూరోడెవలప్‌మెంటల్ వ్యాధులపై కూడా ఉపయోగపడవచ్చు. ఆటిజం చికిత్సలో ఈ ప్రయోగం విజయవంతమైతే, భారత వైద్య రంగం ప్రపంచానికి కొత్త మార్గం చూపే అవకాశం ఉంది.

## నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్

- ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలపై SFI నిరసన

**హైదరాబాద్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**



రాష్ట్రవ్యాప్తంగా విద్యా రంగం నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కానున్నాయి . ఫీజు రీయింబర్స్ మెంట్ , స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ఉన్నత, ప్రొఫెషనల్ విద్యాసంస్థలు, యూనివర్సిటీలు గురువారం మూతపడనున్నాయి. SFI రాష్ట్ర కార్యదర్శి నాగరాజ్ మాట్లాడుతూ, బకాయిల కారణంగా విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫీజు బకాయిలతో సంబంధం లేకుండా సర్టిఫికెట్లు అందించాలన్నారు. బంద్‌కు అన్ని విద్యాసంస్థలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కొన్ని ప్రైవేట్ కాలేజీలు రేపు సెలవు ప్రకటించాయి.



## తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**గురజాల (ఏడీఎన్ఎన్) :**

మొంథా తుపాన్ ప్రభావంతో గురజాల మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగీ, రైతుల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చర్లగుడిపాడు గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, అధికారులు నష్టాన్ని అంచనా వేసి రైతులకు తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మహేశ్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. తుపాన్ కారణంగా పంటలతో పాటు గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు గమనించి వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా, పిడుగురాళ్ల పట్టణంలోని 27వ వార్డు రజక కాలనీలో వాగు పొంగిపొర్లడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. స్థానికులను పరామర్శించిన కాసు మహేష్‌రెడ్డి పరిస్థితిని పరిశీలించి, ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు సహాయక చర్యలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.



## ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ కు భారత్ ఆతిథ్యం

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

భారత్ మరోసారి ప్రపంచ క్రీడా వేదికగా నిలవబోతోంది. ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ టోర్నమెంట్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మెగా ఈవెంట్ నవంబర్ 14 నుంచి 21 వరకు గ్రేటర్ నోయిడాలోని షహీద్ విజయ్ సింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరగనుంది. మొత్తం 18 దేశాల నుంచి 140 మందికి పైగా అగ్రశ్రేణి బాక్సర్లు ఈ పోటీల్లో పాల్గొననున్నారు.

వీరిలో ముగ్గురు ఒలింపిక్ పతక విజేతలు కూడా ఉండటం విశేషం. భారత్ తరఫున 20 మంది బాక్సర్లతో (10 మంది పురుషులు, 10 మంది మహిళలు) కూడిన బలమైన జట్టు ఈ టోర్నీలో బరిలోకి దిగుతోంది. మహిళల విభాగంలో మాజీ ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ (51 కేజీలు), ప్రస్తుత ప్రపంచ చాంపియన్లు జైస్మిన్ లంబోరియా (57 కేజీలు), మీనాక్షి (48 కేజీలు), రెండుసార్లు ఆసియా చాంపియన్ పూజా రాణి (80 కేజీలు) వంటి స్టార్ బాక్సర్లు పాల్గొననున్నారు. పురుషుల విభాగంలో ఈ సీజన్‌లో ప్రపంచ కప్ టోర్నీల్లో పతకాలు సాధించిన హితేశ్ (70 కేజీలు), అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు) మరోసారి మెరిపించడానికి సిద్ధమవుతున్నారు. భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) అధ్యక్షుడు అజయ్ సింగ్ మాట్లాడుతూ, "ప్రపంచంలోని అత్యుత్తమ బాక్సర్లు మన స్వదేశంలో పోటీ పడనుండటం భారత బాక్సర్లకు తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే అద్భుతమైన అవకాశం" అని అన్నారు.

**భారత పురుషుల జట్టు:**
జాదూమణి సింగ్ (48 కేజీలు), పవన్ (55 కేజీలు), సచిన్ (60 కేజీలు), అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు), హితేశ్ (70 కేజీలు), సుమిత్ (75 కేజీలు), లక్ష్య చహర్ (80 కేజీలు), జుగ్నూ (85 కేజీలు), నవీన్ కుమార్ (90 కేజీలు), నరేందర్ (ప్లస్ 90 కేజీలు).

**భారత మహిళల జట్టు:**
మీనాక్షి (48 కేజీలు), నిఖత్ జరీన్ (51 కేజీలు), ప్రీతి (54 కేజీలు), జైస్మీన్ లంబోరియా (57 కేజీలు), పర్వీన్ హుడా (60 కేజీలు), నీరజ్ ఫొగాట్ (65 కేజీలు), అరుంధతి చౌధరీ (70 కేజీలు), స్వీటీ బూరా (75 కేజీలు), పూజా రాణి (80 కేజీలు), నుపుర్ (ప్లస్ 80 కేజీలు).

ఈ టోర్నీ ద్వారా భారత బాక్సర్లు ప్రపంచ స్థాయిలో తమ ప్రతిభను మరోసారి ప్రదర్శించనున్నారని బీఎఫ్ఐ విశ్వాసం వ్యక్తం చేసింది.




## ఇకపై ట్రూకాలర్ తో పనిలేదు

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాలను అరికట్టడానికి, మోసపూరిత కాల్స్‌ను నివారించడానికి టెలికాం విభాగం కొత్త ఏర్పాటు చేయబోతోంది. దీనితో ఇకపై ట్రూ కాలర్ తో పని ఉండదు. ఎందుకంటే త్వరలోనే కాలింగ్ నేమ్ ప్రజంటేషన్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. దీనికి ట్రాయ్ కూడా అంగీకరించింది. మన కాంటాక్ట్ లిస్ట్ లో లేని వ్యక్తి ఫోన్ చేస్తే ఆ వ్యక్తి నెంబర్ తో పాటు ఇకపై ఫోన్ కనెక్షన్ కోసం ఇచ్చిన గుర్తింపు కార్డులోని పేరు కూడా మొబైల్ స్క్రీన్స్ పై కనిపిస్తుంది. ఇది దేశవ్యాప్తంగా వచ్చే ఏడాది మార్చి నాటికి అందుబాటులోకి రావచ్చు. 4జీ, 5జీ ఫోన్లకే దీనిని వర్తింపజేస్తారు. 2జీ, 3జీ ఫోన్లకు ఇది సాధ్యం కాదని ట్రాయ్ పేర్కొంది. అయితే వినియోగదారుడు అంగీకరించకపోతే పేరును డిస్ ప్లే చేయరు. దీనికోసం ఇప్పటికే ట్రయల్ రన్స్ పూర్తయ్యాయి.



## భారత్ మిత్ర దేశాలలో లక్షల కోట్ల బంగారు నిధులు

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న బంగారు నిల్వలలో చాలా భాగం ఇంకా భూగర్భంలోనే ఉన్నట్లు నిపుణులు చెప్తున్నారు. భారత్ కు మిత్రదేశాలైన రష్యా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా దేశాలలో భారీగా బంగారు నిల్వలు ఉన్నాయని, దీనివల్ల ఆయా దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు భవిష్యత్తులో కీలకంగా మారతాయని చెప్తున్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా, ఇంకా తవ్వని బంగారం విషయంలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ ఏకంగా రూ.60 లక్షల కోట్ల విలువ చేసే బంగారం భూగర్భంలో ఉందని అంచనా. ఇది దాదాపు 12 వేల మెట్రిక్ టన్నులు. రష్యాలో కూడా ఇంచుమించు ఆస్ట్రేలియాకు తీసిపోని విధంగా భూగర్భంలో నిల్వలు ఉన్నాయట. ఇక ఇండోనేషియాలో మూడు వేలకు పైగా మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని, అంచనా వేస్తున్నారు. ఈ దేశాలతో భారత్ కు ఉన్న బలమైన దౌత్య సంబంధాల కారణంగా తక్కువ ధరలకే బంగారం దిగుమతి చేసుకనే అవకాశం లభిస్తుందని వారు చెప్తున్నారు. ఇది దేశ ఆర్థిక వృద్ధికి సహకరిస్తుందంటున్నారు.

# సూర్యకుమార్ యాదవ్ సరికొత్త ప్రపంచ రికార్డు

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మరో చరిత్ర సృష్టించాడు. టెస్టు హోదా కలిగిన జట్ల తరఫున అత్యంత వేగంగా 150 సిక్సర్లు బాదిన తొలి క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ముంబైకి చెందిన 35 ఏళ్ల ఈ ఆటగాడు ఆలస్యంగా అంతర్జాతీయ వేదికపై అడుగుపెట్టినప్పటికీ, తక్కువ కాలంలోనే టీ20 క్రికెట్ లో అద్భుత గుర్తింపు సంపాదించాడు. 2021లో ఇంగ్లాండ్ తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత్ తరఫున అరంగేట్రం చేసిన సూర్యకుమార్, ఆ తర్వాత వన్డే, టెస్టుల్లోనూ ఆడాడు. అయితే ఆ రెండు ఫార్మాట్లలో పెద్దగా రాణించలేకపోయినా, టీ20 క్రికెట్లో మాత్రం వరల్డ్ నంబర్ వన్ బ్యాటర్‌గా ఎదిగాడు. అతడి అటాకింగ్ స్టైల్, ఇన్నోవేటివ్ షాట్స్



కారణంగా అభిమానులు 'Mr. 360 of India' అని పిలుచుకుంటున్నారు. గతేడాది ఆసియా టీ20 కప్-2025లో టీమిండియా విజయానికి సూర్యకుమార్ కెప్టెన్‌గా మార్గదర్శకుడయ్యాడు. పగ్గాలు చేపట్టిన తర్వాత వరుస విజయాలతో జట్టును ముందుకు నడిపించాడు. ఇటీవల కొన్ని మ్యాచ్‌లలో బ్యాటింగ్‌లో విఫలమైనా, సూర్య ఫామ్‌లోకి వస్తాడనే నమ్మకం అభిమానుల్లో ఉంది. ఇక తాజాగా ఆస్ట్రేలియా పర్యటనలో సూర్యకుమార్ తన ఫామ్ తిరిగి పొందినట్లు సూచించాడు. కాన్బెర్రా వేదికగా జరిగిన తొలి టీ20లో ధనాధన్ ఇన్నింగ్స్ ఆడుతూ భారత అభిమానులను అలరించాడు. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా భారత్‌ను ముందుగా బ్యాటింగ్‌కు ఆహ్వానించగా, సూర్యకుమార్ తన అద్భుత హిట్టింగ్‌తో మైదానాన్ని శబ్దరంగం చేశాడు. ఈ రికార్డుతో సూర్యకుమార్ యాదవ్ మరొకసారి తన ప్రత్యేకతను రుజువు చేస్తూ, టీమిండియా చరిత్రలో స్థానం పక్కాగా సంపాదించాడు.

# ఇంగ్లాండ్ ఇంటికి.. దక్షిణాఫ్రికా ఫైనల్ కి

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

ఐసీసీ మహిళల ప్రపంచకప్-2025లో దక్షిణాఫ్రికా జట్టు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో ఇంగ్లాండ్ ను 125 పరుగుల తేడాతో ఓడించి తొలిసారి ప్రపంచకప్ ఫైనల్లో అడుగుపెట్టింది. ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా మహిళల జట్టు 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 319 పరుగులు చేసింది. కెప్టెన్ లారా వోల్వార్డ్ అద్భుత శతకంతో దుమ్మురేపింది. ఆమె 169 పరుగులతో సూపర్ ఇన్నింగ్స్ ఆడింది. వోల్వార్డ్ ఇన్నింగ్స్ లో 20 ఫోర్లు మెరిశాయి. ఆమెతో పాటు క్లార్క్ (48), చెట్టి (37)లు విలువైన ఇన్నింగ్స్ ఆడారు. 320 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ జట్టు 42.3 ఓవర్లలో 194 పరుగులకే ఆలౌటైంది. జట్టు ఆరంభం నుంచే కష్టాల్లో పడింది. టాప్ ఆర్డర్ విఫలమవగా, నాట్ స్కివర్ బ్రంట్ (64), కాప్సీ (50)లు కొంత ప్రతిఘటించారు. అయితే ఇతర బ్యాటర్లు నిలదొక్కుకోలేకపోవడంతో



జట్టు పరాజయాన్ని చవిచూసింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో మారిజాన్ కాప్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఆమె 5 వికెట్లు పడగొట్టి ఇంగ్లాండ్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చింది. క్లార్క్ రెండు వికెట్లు తీయగా, ఖాకా, లూస్ తలో వికెట్ సాధించారు. ఈ విజయంతో దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ చరిత్రలో కొత్త అధ్యాయం రాసుకుంది. ప్రపంచకప్ ఫైనల్లో అడుగుపెట్టడం జట్టుకు ఇదే తొలిసారి కావడం విశేషం. ఇక ఫైనల్‌లో దక్షిణాఫ్రికా జట్టు ఆస్ట్రేలియా-భారత్ మధ్య జరిగే రెండో సెమీఫైనల్ విజేతను ఎదుర్కోనుంది.

# ప్రో కబడ్డీ లీగ్‌నుంచి తెలుగు టైటాన్స్ ఔట్

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

ప్రో కబడ్డీ లీగ్ 2025లో తెలుగు టైటాన్స్ ప్రస్థానం ముగిసింది. బుధవారం ఢిల్లీలో జరిగిన క్వాలిఫయర్ 2 మ్యాచ్‌లో టైటాన్స్ జట్టు పుణేరి పల్టన్ చేతిలో 50-45 తేడాతో పరాజయం పాలైంది. దీంతో టైటాన్స్ టోర్నీ నుంచి నిష్క్రమించగా, పుణేరి పల్టన్ ఫైనల్‌కు అర్హత సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచే టైటాన్స్ ఆధిపత్యం చెలాయించింది. తొలి అర్ధభాగంలో రైడర్లు, డిఫెండర్లు సమన్వయంతో అద్భుతంగా ఆడారు. అయితే చివరి నిమిషాల్లో చేసిన అనవసర తప్పిదాలు జట్టును చేదు ఓటమి వైపు నెట్టేశాయి. పుణేరి పల్టన్ రైడర్లకు ఎదురుదెబ్బ ఇవ్వడంలో టైటాన్స్ డిఫెన్స్ విఫలమైంది. టైటాన్స్ ఆల్‌రౌండర్ భరత్ హుడా ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. మొత్తం 23 రైడ్ పాయింట్లు సాధించి జట్టును నిలబెట్టేందుకు ప్రాణం పెట్టాడు. కానీ మిగిలిన రైడర్ల నుంచి తగిన మద్దతు అందకపోవడంతో టైటాన్స్ వి




జయాన్ని చేజార్చుకుంది. ఇక పుణేరి పల్టన్ తరఫున ఆదిత్య షిండే సత్తాచాటాడు. కీలక సమయాల్లో వరుసగా రైడ్ పాయింట్లు సాధించి జట్టుకు విజయం అందించాడు. షిండే మొత్తం 22 పాయింట్లు నమోదు చేశాడు. ఈ విజయంతో పుణేరి పల్టన్ ఫైనల్‌లో చోటు దక్కించుకుంది. రాబోయే శుక్రవారం జరిగే ఫైనల్ పోరులో దబాంగ్ ఢిల్లీ , పుణేరి పల్టన్ జట్లు తలపడనున్నాయి. కాబట్టి టైటాన్స్ జట్టు క్వాలిఫయర్ దశ వద్దే ఆగిపోగా, అభిమానులు మాత్రం వచ్చే సీజన్‌లో జట్టు బలంగా తిరిగి రావాలని ఆశిస్తున్నారు.

# బ్యాంకింగ్ రూల్స్ మారుతున్నాయి

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

భారత ఆర్థిక రంగంలో కేంద్రం తీసుకొచ్చిన బ్యాంకింగ్ సవరణ చట్టం ప్రకారం నవంబర్ 1 నుండి రూల్స్ మారబోతున్నాయి. వీటితో పాటు క్రెడిట్ కార్డ్ రూల్స్, కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్లకు సంబంధించిన డెడ్ లైన్స్ కూడా ఈ నెలలో ముగియబోతున్నాయి. 2025 నవంబర్ నెల భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త మార్పులను తీసుకురానుంది. ప్రభుత్వ విధానాలు, బ్యాంకింగ్ నియమాలు, ఇన్వెస్ట్‌మెంట్ నిబంధనలు, పన్నుల పరంగా పలు కీలక అప్ డేట్‌లు అమల్లోకి వస్తున్నాయి. ఈ మార్పులు సాధారణ వినియోగదారుల నుంచి ఇన్వెస్టర్ల వరకు అందరిపై ప్రభావం చూపనున్నాయి. అవేంటంటే...

- బ్యాంక్ ఖాతాలకు, ఎఫ్‌డీలకు నామినీల సంఖ్య మారుతోంది. ఇకపై ఒక ఖాతాకు నలుగురు నామినీలు చేర్చాలనే నిబంధన అమల్లోకి వస్తోంది. దీనివల్ల వారసత్వ గొడవలు, చట్టపర



మైన సమస్యలు తగ్గుతాయి.
- SBI క్రెడిట్ కార్డుకు నవంబర్ 1 నుండి కొత్త ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. క్రెడ్, చెక్, మొబిక్విక్ వంటి థర్డ్ పార్టీ యాప్స్ వాడేవారికి 1 శాతం ఛార్జీ వర్తిస్తుంది.
- HDFC Bank, ICICI Bank కొన్ని కార్డులపై పాయింట్ల రిడంప్షన్ రేట్ ను తగ్గించాయి.
- SEBI మార్గదర్శకాల ప్రకారం, నవంబర్ 30 నాటికి అందరు ఇన్వెస్టర్లు తమ డీమ్యాట్ , ట్రేడింగ్ అకౌంట్‌లను KYC అప్‌డేట్ చేయాలి.
- కొత్త RBI నియమాల ప్రకారం, హోమ్ లోన్ వడ్డీ రేట్లు మార్కెట్ లింక్డ్ ఇండెక్స్ పద్ధతిలో లెక్కించబడతాయి. దీనివల్ల కొందరికి పెరగవచ్చు. కొందరికి తగ్గవచ్చు.
- యూపీఐ, రూపే ట్రాన్సాక్షన్ లపై మర్చంట్ ఫీజులు కొంత మారతాయి. చిన్న వ్యాపారాల కోసం ప్రభుత్వం రూ. 2000 కంటే తక్కువ లావాదేవీలపై ఫీజులు రద్దు చేసింది. పెద్ద వ్యాపారాల కోసం తక్కువ శాతం ఫీజులు అమల్లోకి వస్తాయి.
- కొత్త గైడ్ లైన్స్ ప్రకారం, హెల్త్ లైఫ్ ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు వెబ్‌ఆధారిత ఆటో ప్రాసెసింగ్ సిస్టమ్ ద్వారా వేగంగా పరిష్కరించబడతాయి. చిన్న క్లెయిమ్‌లకు మాన్యువల్ వెరిఫికేషన్ అవసరం ఉండదు.

# ఆర్బీఐ 'ఆపరేషన్ గోల్డ్'

❖ విదేశీ గిడ్డంగుల నుండి భారత్ బంగారం దేశంలోకి

❖ ఆరు నెలల కాలంలో 64 టన్నుల బంగారం స్వదేశానికి తెచ్చిన ఆర్బీఐ

❖ ఆర్బీఐలో 100 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటిన స్వర్ణనిల్వలు

❖ ప్రపంచ ఆర్థిక మార్పులను ఎదుర్కొనే ముందస్తు చర్య

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

భారతీయ రిజర్వ్ బ్యాంక్ తన స్వర్ణ రిజర్వులను వేగంగా పెంచుతూ, వాటిని దేశంలోనే భద్రపరిచే దిశగా "ఆపరేషన్ గోల్డ్" అనే వ్యూహాత్మక చర్య చేపట్టింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు పెరుగుతున్న సమయంలో, RBI ఈ నిర్ణయం తీసుకోవడం ఆర్థిక నిపుణుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆర్బీఐ 'ఆపరేషన్ గోల్డ్ ' భారతదేశపు ఆర్థిక స్వతంత్రతకు, భద్రతకు ఒక కొత్త దశగా చెప్పవచ్చు. ప్రపంచ ఆర్థిక మార్పులను ఎదుర్కొనేందుకు ఇది ఒక ముందస్తు చర్యగా పరిగణించవచ్చు. ఆర్థిక సంవత్సరం




2025-26 ప్రథమార్థంలోనే RBI సుమారు 64 టన్నుల స్వర్ణాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్ మెంట్ వంటి విదేశీ గిడ్డంగుల నుండి భారత్‌కి తీసుకువచ్చింది. ఇప్పటి వరకు RBI వద్ద ఉన్న మొత్తం స్వర్ణ నిల్వలు 880.18 టన్నులకి చేరుకున్నాయి. ఇందులో సుమారు 575.82 టన్నులు భారతదేశంలోనే భద్రపరచబడ్డాయి. ఈ చర్యతో భారత్ కేంద్ర బ్యాంక్ స్వర్ణ నిల్వ విలువ ఇప్పుడు 100 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటిందని రాయిటర్స్ నివేదిక వెల్లడి చేసింది.

**ఆర్బీఐ స్వర్ణంపై దృష్టి పెట్టడానికి ప్రధాన కారణాలు:**

- ప్రపంచ మార్కెట్లలో డాలర్ ఆధారిత ఆస్తులపై అనిశ్చితి పెరుగుతుండటం
- అమెరికా ట్రెజరీ సెక్యూరిటీల రాబడి తగ్గిపోవడం
- భౌగోళిక ఉద్రిక్తతలు పెరగడం
- స్వర్ణం "సేఫ్ హేవెన్ అసెట్"గా పరిగణించబడుతుంది. అంటే ఏ ఆర్థిక క్షోభ వచ్చినా, దీని విలువ స్థిరంగా లేదా పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఇవన్నీ కేంద్రబ్యాంకు ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. ఆర్బీఐ తన రిజర్వ్ ఆస్తులలో డాలర్ ఆధారిత పెట్టుబడులను తగ్గిస్తూ, స్వర్ణపు వాటాను పెంచుతోంది. ఇది రిస్క్ డైవర్సిఫికేషన్ వ్యూహం కింద తీసుకున్న చర్యగా నిపుణులు చెబుతున్నారు.

**దేశీయ నిల్వలు పెంచడం వెనుక ఉద్దేశ్యం:**
గతంలో భారతీయ స్వర్ణ నిల్వల్లో పెద్ద భాగం లండన్ బాసెల్ వంటి విదేశీ గిడ్డంగులలో ఉంచారు. కానీ ప్రపంచ రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాలు, ఆంక్షల వంటి అంశాలు పెరగడంతో, RBI ఇప్పుడు ఈ ఆస్తులను దేశంలోనే ఉంచే ప్రయత్నం చేస్తోంది. "దేశంలో స్వర్ణ నిల్వలను పెంచడం వల్ల భౌగోళిక రిస్క్ తగ్గుతుంది, అలాగే అవసరమైనప్పుడు ద్రవ రూపంలో మార్చుకోవడం కూడా సులభమవుతుంది." అని RBI అధికారులు పేర్కొంటున్నారు. దీని ప్రభావం భారత ఆర్థిక భవిష్యత్తుపై ఉంటుంది. విదేశీ మారక నిల్వల్లో స్థిరత్వం పెరుగుతుంది. డాలర్ ఆధారిత రిస్క్ తగ్గుతుంది. భారతీయ బంగారం మార్కెట్ కు ప్రోత్సాహం లభిస్తుంది. గ్లోబల్ ఫైనాన్షియల్ సిస్టంలో భారత్ ప్రభావం పెరుగుతుంది.



## భారత్ – ఆస్ట్రేలియా తొలి టీ20 రద్దు

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

కాన్‌బెర్రా వేదికగా బుధవారం జరిగిన భారత్-ఆస్ట్రేలియా మధ్య తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ప్రారంభం నుంచి వర్షం కురవడంతో అభిమానులు నిరాశకు గురయ్యారు. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా మొదట బౌలింగ్ ఎంచుకోగా, భారత బ్యాటర్లు ఆరంభంలోనే చక్కటి ఆట తీరును ప్రదర్శించారు. అయితే మ్యాచ్‌కు రెండు సార్లు వర్షం అంతరాయం కలిగించింది. తొలి ఐదు ఓవర్లు పూర్తయ్యాక వర్షం కారణంగా ఆట నిలిచిపోయింది. తరువాత అంపైర్లు ఓవర్లను తగ్గించి 18 ఓవర్ల మ్యాచ్‌గా మార్చాలని నిర్ణయించారు. తిరిగి ఆట ప్రారంభమైనప్పటికీ మరోసారి భారీ వర్షం కురవడంతో మ్యాచ్ పూర్తిగా నిలిచిపోయింది. చివరికి పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆట నిలిచిపోయే సమయానికి భారత్ 9.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 67 పరుగులు చేసింది. శుభ్‌మాన్ గిల్ (37; 20 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్సర్), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (39; 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లు) అద్భుతంగా ఆడారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం అందించారు. అభిషేక్ శర్మ 19 పరుగుల వద్ద నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. ఈ మ్యాచ్ రద్దు కావడంతో సిరీస్‌లో రెండు జట్లు చెరో పాయింట్ సాధించాయి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండో టీ20ని వర్షం రద్దు చేసిన నేపథ్యంలో, మూడో టీ20 ఈ నెల 31న మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరగనుంది. అభిమానులు ఈ మ్యాచ్‌లో ఫలితం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## వన్డే ర్యాంకింగ్స్ లో హిట్ మాన్ నెంబర్‌వన్

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

టీమిండియా సీనియర్ బ్యాట్స్ మన్ రోహిత్ శర్మ చరిత్ర సృష్టించాడు. ఐసీసీ ప్రకటించిన తాజా వన్డే బ్యాట్స్ మన్ ర్యాంకింగ్స్ లో ఆయన మొదటి స్థానాన్ని దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీతో మెరిపించిన రోహిత్, ర్యాంకింగ్స్ లో రెండు స్థానాలు ఎగబాకి నెంబర్‌వన్‌గా నిలిచాడు. ఆ మ్యాచ్‌లో రోహిత్, విరాట్ కోహ్లితో కలిసి అదరగొట్టిన విషయం తెలిసిందే. ఈ విజయంతో రోహిత్ ఆఫ్ఘనిస్తాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్, భారత కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ లను అధిగమించాడు. ప్రస్తుతం రోహిత్ 781 రేటింగ్ పాయింట్లు సాధించి అగ్రస్థానంలో ఉన్నాడు. ఇబ్రహీం జద్రాన్ 764 పాయింట్లతో రెండో స్థానంలో, విరాట్ కోహ్లి 725 పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతున్నారు. తన కెరీర్‌లో తొలిసారిగా వన్డే ర్యాంకింగ్స్ లో టాప్ పొజిషన్ దక్కించుకోవడం రోహిత్‌కు గర్వకారణం. 38 ఏళ్ల రోహిత్ ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు గెలుచుకున్నాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 101 సగటుతో 202 పరుగులు చేసిన రోహిత్, అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. వన్డే ఫార్మాట్ భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్న ఈ సమయంలో రోహిత్ అగ్రస్థానంలో నిలవడం భారత క్రికెట్‌కు శుభ సూచకంగా భావిస్తున్నారు. ఇక వన్డే కెప్టెన్సీని శుభ్‌మాన్ గిల్‌కు అప్పగించిన తర్వాత రోహిత్ రిటైర్మెంట్ ఊహాగానాలు వినిపించినా, ఆస్ట్రేలియా సిరీస్‌లో చూపించిన ఫామ్‌తో ఆ మాటలను ఖండించాడు. వన్డేల్లో రోహిత్ శర్మ అగ్రస్థానం దక్కించుకోవడం భారత జట్టుకు నమ్మకం, ప్రేరణ నింపే ఘనతగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.



## లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

**ఇంటర్నెట్ డెస్క్, (ఏడీఎన్ఎన్) :**

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. మెటల్, ప్రైవేట్ బ్యాంక్స్, ఫార్మా, ఎనర్జీ రంగాల షేర్లలో కొనుగోళ్లు బాగా జరిగాయి. ఆటో స్టాక్స్ అమ్మకాల దారి పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుండి సానుకూల సంకేతాలు రావడంతో సూచీలు రాణించాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు కూడా పాజిటివ్ గా కలిసొచ్చాయి. నిఫ్టీ 117 పాయింట్లు లాభపడింది. సెన్సెక్స్ 368 పాయింట్లు లాభం సాధించింది. డాలర్ తో రూపాయి మారకం విలువ 88. 21 గా ఉంది. అదానీ పోర్ట్స్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టాటా స్టీల్, ఎన్టీపీసీ లాభాల్లో కొనసాగాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకి, బీఈఎల్ వంటి షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్సు 4 వేల డాలర్లు దాటింది.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
30.10.2025
www.manasarkar.com

## స్టార్‌డమ్‌ని బట్టే.. పారితోషికం



**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

సినీ పరిశ్రమలో వేతన అసమానతలపై అసహనం వ్యక్తం చేసిన నటీనటులు కోకొల్లలు. తాజాగా నటి ప్రియమణి కూడా ఈ విషయంపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ 'పారితోషికానికి నేనెప్పుడూ ప్రాధాన్యత ఇవ్వలేదు. నిజానికి పారితోషికం అనేది స్టార్‌డమ్‌ని బట్టి ఉంటుంది. నా స్థాయి నాకు తెలుసు. దాన్ని దృష్టిలో పెట్టుకునే పారితోషికం తీసుకుంటా. నా సహ నటులకంటే తక్కువగా పారితోషికం అందుకున్న సందర్భాలు నా కెరీర్‌లో చాలా ఉన్నాయి. దానికి బాధపడను. అర్హతను బట్టే నా డిమాండ్ ఉంటుంది. షూటింగ్ టైమింగ్స్ గురించి మాట్లాడుతూ 'సౌత్‌లో సరిగ్గా 8 గంటలకు షూటింగ్ మొదలవుతుంది. కానీ నార్త్‌లో అలా కాదు. అక్కడ టైమ్ సెన్స్ ఉండదు. నేను సౌత్ అమ్మాయిని కావడంతో క్రమశిక్షణ అలవాటైపోయింది. నార్త్ పద్ధతులు నచ్చకపోయినా ఓర్చుకొని పనిచేయడం అలవాటు చేసుకున్నా.' అని తెలిపారు ప్రియమణి.

## చిరంజీవి సినిమాలో మాళవిక లేదు

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

వాల్తేర్ వీరయ్య లాంటి హిట్ తర్వాత ఈ జోడి మళ్లీ కలిసి పనిచేయబోతోంది. మెగా 158 అంటూ రాబోతున్న ఈ సినిమా త్వరలోనే సెట్స్ మీదకి వెళ్లనుంది. అయితే ఈ సినిమాలో హీరోయిన్‌గా మాళవిక మోహనన్ నటించబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై నటి స్పందిస్తూ.. అవన్నీ రూమర్స్ అంటూ తెలిపింది. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. నేను 'మెగా 158' సినిమాలో నటిస్తున్నానని ఆన్‌లైన్‌లో అనేక వార్తలు వస్తున్నాయి. అయితే నా కెరీర్‌లో ఏదో ఒక రోజు చిరంజీవి సార్‌తో స్క్రీన్ పంచుకోవాలని ఎంతగానో కోరుకుంటున్నాను. కానీ ప్రస్తుతం నేను ఈ సినిమాలో భాగం కావడం లేదు. ఆ వార్తలు అవాస్తవం అంటూ మాళవిక రాసుకొచ్చింది. దీంతో చిరంజీవి సరసన మాళవిక నటించబోతున్నారనే ఊహాగానాలకు తెరపడింది. త్వరలోనే ఈ సినిమాలో నటించబోయే హీరోయిన్ గురించి చిత్ర బృందం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.



## 'మాస్ జాతర' పై హాట్ కామెంట్స్..

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**



టాలీవుడ్ నటుడు రాజేంద్ర ప్రసాద్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఆయన పేరు చెప్పగానే ముఖంపై ఫ్యాన్స్ కి నవ్వు వస్తుంది. మూడు దశాబ్దాలకు పైగా సినీ ప్రస్థానంలో అశేషమైన అభిమానాన్ని సంపాదించుకున్న ఈ నటుడు, ఇప్పటికీ తన హాస్యంతో, అభినయంతో ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. 'లేడీస్ టైలర్', 'అహ నా పెళ్లంటా', 'మిస్టర్ పెళ్లాం', 'మాయాబజార్', 'జులాయి', 'సరైనోడు' వంటి అనేక సినిమాల్లో తన నటనతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఇక ఇటీవల కాలంలో కూడా రాజేంద్ర ప్రసాద్ విలన్, క్యారెక్టర్, తండ్రి పాత్రల్లో తనదైన శైలిలో నటించి తన నటనకు న్యాయం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో రెండు సినిమాలు ఉన్నాయి. వాటిలో ఒకటి బాలకృష్ణ హీరోగా తెరకెక్కుతున్న సినిమా కాగా, మరోటి శర్వానంద్ నటిస్తున్న సినిమా. ఇదే సమయంలో సినీ వర్గాల సమాచారం ప్రకారం, రాజేంద్ర ప్రసాద్ త్వరలోనే ఒక కొత్త వెబ్ సిరీస్‌లో ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారని తెలుస్తోంది రవితేజ నటించిన మాస్ జాతర సినిమాలో కూడా రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్ర పోషించారు. అయితే ఆ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిన్న రాత్రి జరగగా, ఆ కార్యక్రమంలో సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ తాజా వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రవితేజ హీరోగా నటిస్తున్న 'మాస్ జాతర' సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ఇటీవలి కాలంలో అన్ని మసాలాలు సరిగ్గా కలిసిన మాస్ సినిమా రాలేదు. ఆ లోటును తీర్చేది ఈ మాస్ జాతర" అని తెలిపారు.

## శ్రీలంకలో 'పెద్ది' షూటింగ్..



**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

హీరో రామ్ చరణ్ నటిస్తున్న ప్యాన్ ఇండియా సినిమా 'పెద్ది'పై ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపు అయ్యాయి. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే భారీ క్రేజ్ సంపాదించుకుంది. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' టీమ్ ప్రస్తుతం శ్రీలంకలో కీలకమైన షెడ్యూల్‌లో బిజీగా ఉంది. అక్కడ రామ్ చరణ్ జాన్వీ కపూర్ జంటపై ఓ అందమైన పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ పాటకు ఎఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో, ఇది విజువల్‌గా, మ్యూజికల్‌గా గ్రాండ్ ట్రీట్‌గా మారబోతోందని ఫిల్మ్ నగర్ టాక్. రామ్ చరణ్ కూడా ఇటీవల శ్రీలంక బయలుదేరుతుండగా ఎయిర్‌పోర్ట్ లో కనిపించారు. ఇంతలో, శ్రీలంక లొకేషన్స్ నుండి కొన్ని ఆసక్తికరమైన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. డైరెక్టర్ బుచ్చిబాబు సానా, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు కలిసి దిగిన ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఆ ఫొటోల్లో ఇద్దరూ ఒక పాత రైల్వే ట్రాక్ టన్నెల్ ముందు నిలబడి ఉన్నారు. ఈ లొకేషన్ చూసి ఫ్యాన్స్ లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఇది కేవలం సాంగ్ కోసం మాత్రమేనా? లేక సినిమాలో కీలకమైన యాక్షన్ లేదా ఎమోషనల్ సీక్వెన్స్ కు సంబంధించిందా? అని ముచ్చటించుకుంటున్నారు. ఆ టన్నెల్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు ప్రత్యేకమైన భావోద్వేగ టచ్ ఇస్తుందని అంచనా. రత్నవేలు వంటి టాప్ సినిమాటోగ్రాఫర్ ఈ ప్రాజెక్ట్ లో ఉండటంతో, విజువల్స్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటాయని ఫ్యాన్స్ నమ్మకం. బుచ్చిబాబు, రత్నవేలు ఇద్దరి కాంబినేషన్ పిక్స్ ఆ అంచనాలను మరింత పెంచాయి. మొత్తానికి, 'పెద్ది' టీమ్ శ్రీలంకలో ఫుల్ స్వింగ్‌లో షూటింగ్ జరుపుకుంటోంది. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో చరణ్‌ను మల్టిపుల్ లుక్స్‌లో చూడబోతున్నారని టాక్.


## హైదరాబాద్‌లో రెహమాన్ మ్యూజిక్ లైవ్!

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**



సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ నవంబర్ 8న రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనున్న 'హైదరాబాద్ టాకీస్' కచేరీ ద్వారా మళ్లీ హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. టికెట్ ధరలు, షో వివరాలు ఇక్కడ ఉన్నాయి. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని రెహమాన్ గుర్తు చేసుకున్నారు. 'తెలుగు సినిమాలు చేస్తూ పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్ ని డాల్బీ అట్మాస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. ఈ టికెట్లు డిస్ట్రిక్ట్ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు. అయితే దాదాపు 3 గంటలకు పైగా సాగనున్న ఈ షో ప్రారంభ టికెట్ ధర రూ.2,400 ఉండగా హయ్యస్ట్ రూ.30,000 ఉంది. అన్ని వయసుల వారికి అనుమతి ఉంది.

## గ్రీన్ సిగ్నల్ వచ్చేనా ..?



**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

'ఓజీ' విజయంతో మంచి జోష్ మీదున్నారు పవన్‌కళ్యాణ్. తన నెక్స్ట్ సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్‌ని కూడా పూర్తి చేసి, ప్రస్తుతం కొత్త కథలు వినే పనిలో పడ్డారాయన. తాజా సమాచారం ప్రకారం దర్శకుడు పైడిపల్లి వంశీ ఇటీవలే పవన్‌కు ఓ కథ చెప్పారట. సామాజిక అంశాలతో కూడుకున్న ఈ సోషల్ డ్రామా పవన్‌కళ్యాణ్‌కి బాగా నచ్చిందని, త్వరలోనే అధికారిక ప్రకటన రానుందని సమాచారం. ఇదిలావుంటే.. గతంలో బాలీవుడ్ స్టార్ అమీర్‌ఖాన్‌కు పైడిపల్లి వంశీ ఓ కథ చెప్పారు. అమీర్‌ఖాన్ ఓకే చేశారు కూడా. కానీ ఎందుకో ఆ సినిమా సైలెంట్‌గా పక్కకి వెళ్లింది. ఇప్పుడు పవన్‌కి చెప్పిన కథ అదేనంటూ ఫిల్మ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

## సినిమాపై ఢిల్లీ హైకోర్టులో పిటిషన్!

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**



బాలీవుడ్ నటుడు పరేష్ రావల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న వివాదాస్పద సినిమా 'ది తాజ్ స్టోరీ'. ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అయితే ఈ సినిమా విడుదలని అడ్డుకోవాలంటూ ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (PIL) దాఖలైంది. ఈ సినిమా చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమే కాకుండా, మత సామరస్యాన్ని దెబ్బతీస్తుందని పిటిషనర్ ఆరోపించారు. అడ్వకేట్ షకీల్ అబ్బాస్ ఈ పిటిషన్‌ను దాఖలు చేయగా.. ఇందులో ఆయన సెన్సార్ బోర్డు, కేంద్ర ప్రభుత్వం, చిత్ర నిర్మాత, దర్శకుడు, నటుడు పరేష్ రావల్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ సినిమా తాజ్‌మహల్ చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమే కాకుండా, మత సామరస్యాన్ని దెబ్బతీస్తుందని తెలిపాడు. అలాగే ఒక ప్రత్యేక రాజకీయ సిద్ధాంతాన్ని ఈ చిత్రం ప్రోత్సహిస్తోందని పిటిషనర్ ఆరోపించారు. ఈ సినిమా విడుదలైతే మత విద్వేషాలకు దారితీసే అవకాశం ఉందని ఇది దేశ లౌకిక స్ఫూర్తిని దెబ్బతీస్తుందని అబ్బాస్ ఆందోళన వ్యక్తం చేశారు.

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**



కృష్ణ కుటుంబం నుండి మరో వారసురాలు రాబోతోంది. ఆమె మరెవరో కాదు కృష్ణ మనవరాలు, మంజుల కుమార్తె జాన్వీ స్వరూప్. త్వరలోనే సినీ రంగంలో అడుగుపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. నటన, డాన్స్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన జాన్వీ ఇప్పటికే కొన్ని కథలను విన్నట్టు సమాచారం. వాటిలో ఒక సినిమా కోసం అధికారిక ఒప్పందం కూడా పూర్తయిందని తెలుస్తోంది. త్వరలోనే ఆమె డెబ్యూ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది. మంజుల నిర్మాతగా, కొన్నిసార్లు నటిగా, అలాగే దర్శకురాలిగా కూడా ఇండస్ట్రీలో తన ముద్ర వేసుకున్నారు. ప్రస్తుతం ఆమె సినిమాలకు కొంత దూరంగా ఉన్నారు. ఇప్పుడు అదే ఇంటి నుండి మరో తరం తెరపైకి రావడానికి సిద్ధమవుతుండటంతో సినీ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. మరోవైపు కృష్ణ చిన్న కుమారుడు రమేష్ బాబు కొడుకు కూడా అజయ్ భూపతి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నాడు. దీంతో ఘట్టమనేని కుటుంబం నుండి కొత్త తరం ఇండస్ట్రీకి వస్తుండడంపై ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## మహేష్ బాబు మేనకోడలు హీరోయిన్‌గా..

## ముందుగానే రిలీజ్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'



**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న 'ఆంధ్రా కింగ్ తాలూకా' సినిమా ఒకరోజు ముందే విడుదల కాబోతోందని ఫిల్మ్ నగర్ సమాచారం. ప్రస్తుతం ఏ సినిమా కూడా ముందు అనుకున్న విధంగా విడుదలకు నోచుకోవడం లేదు. చిన్న సినిమాలే కాదు పెద్ద సినిమాలదీ ఇదే పరిస్థితి. డిసెంబర్‌లో రావాల్సిన అడివి శేష్ 'డెకాయిట్' సినిమా ఏకంగా మూడు నెలలకు వాయిదా పడింది. అయితే చిత్రంగా కొన్ని సినిమాలు ఒకటి రెండు రోజుల ముందో, వారం ముందో వచ్చేస్తున్నాయి కూడా. అలా ఆ మధ్య 'లిటిల్ హార్ట్స్' సినిమా ఓ వారం ముందే వచ్చేసింది. మంచి విజయాన్ని అందుకుంది. అలానే ఇప్పుడు రామ్ పోతినేని నటిస్తున్న 'ఆంధ్ర కింగ్ తాలూకా' కూడా కాస్తంత ముందుగానే రిలీజ్‌కి వస్తోంది. ఈ సినిమా మామూలుగా అయితే నవంబర్ 28న విడుదల కావాల్సి ఉంది. సహజంగా విడుదల తేదీకి ఒక రోజు ముందు యు.ఎస్.ఎ.లో ప్రీమియర్స్ వేస్తుంటారు. కానీ 'ఆంధ్రా కింగ్ తాలూకా' సినిమాకి అమెరికాలో ప్రీమియర్స్ నవంబర్ 26నే వేస్తున్నారు. సో... ఈ సినిమా నవంబర్ 27నే జనం ముందుకు వస్తోందని టాలీవుడ్ ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయాన్ని నిర్మాతలు ఇంతవరకూ అధికారికంగా మాత్రం ప్రకటించలేదు. భాగ్యశ్రీ బోర్సే ఇందులో హీరోయిన్‌గా నటించింది. ఆంధ్ర కింగ్‌గా ఉపేంద్ర నటించారు. ఈ సినిమా నుండి ఇప్పటికే రెండు సింగిల్స్ రాగా మూడోది అక్టోబర్ 31న రిలీజ్ కాబోతోంది.

## అస్సలు గుర్తు పట్టలేనంతగా మారిన రవళి..!

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**



తెలుగు సినీప్రియులకు రవళి దాదాపు రెండు దశాబ్దాలపాటు మెరిసిన ఈ నటి స్టార్ హీరోలతో కలసి అనేక సూపర్ హిట్ సినిమాల్లో నటించి అభిమానుల మనసుల్లో నిలిచిపోయింది. 1990లో మలయాళ సినిమా 'జడ్జిమెంట్' ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టిన రవళి, తదుపరి ఏడాది 'జయభేరి' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. కెరీర్ ప్రారంభంలో పెద్దగా అవకాశాలు రాకపోయినా, 'పెళ్లి సందడి' సినిమాతో రవళి ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా మారింది. ఆ తర్వాత 'ఒరేయ్ రిక్షా', 'వినోదం', 'చిన్నబ్బాయి', 'ముద్దుల మొగుడు', 'శుభాకాంక్షలు' వంటి సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించింది. తర్వాత కాలక్రమేణా ప్రధాన పాత్రల అవకాశాలు తగ్గడంతో రవళి క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా పలు సినిమాల్లో నటించింది. 2007లో ఆమె నీలికృష్ణను వివాహం చేసుకుంది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**